కొండపిలో ప్రారంభించిన చైర్మన్

జిల్లాలోని ఒంగోలు-1, కొండపి, పొదిలి కేంద్రాలతోపాటు నెల్లూరు జిల్లాలోని కందుకూరు-1లో వేలం ప్రక్రియ మొదలైంది. కొండపిలో పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్, ఒంగోలు-1 కేంద్రంలో బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు కొనుగోళ్లను ప్రారంభించారు. కొండపిలో బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య, స్థానిక అధికారులు హాజరు కాగా ఒంగోలు-1లో ఆర్‌ఎం లక్ష్మణరావు. ఇతర అధికారులు, రైతు నాయకులు ఉన్నారు. పొదిలి, కందుకూరు-1లలో అక్కడి పొగాకు బోర్డు అధికారులు, రైతు, వ్యాపార ప్రతినిధుల సమక్షంలో వేలం ప్రారంభించారు. అన్నిచోట్లా తొలిరోజున 18 బేళ్ల వంతున వేలానికి రైతులు తీసుకురాగా మొత్తాన్ని వ్యాపారులు కొన్నారు. నాలుగు కేంద్రాల్లోనూ గరిష్ఠ ధర కిలోకు రూ.280 లభించింది.



వేలానికి బేళ్లను తీసుకొస్తున్న రైతులు



ఒంగోలు-1 వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లను ప్రారంభిస్తున్న బోర్డు ఈడీ శ్రీధర్‌బాబు, వ్యాపారులు, రైతులు

ఆరంభం అదుర్స్

బోర్డు చరిత్రలో ఇదే అత్యధికం

కిలో రూ.280 పలికిన పొగాకు ప్రారంభ ధర

పొగాకు వేలం ప్రారంభం రోజున ఊహించని రీతిలో రికార్డు స్థాయి ధర పలికింది. కిలోకు రూ.280 లభించింది. గత ఏడాది కిలో రూ.230తో ప్రారంభించిన వ్యాపారులు ఈసారి మరో రూ.50 పెంచారు. బోర్డు చరిత్రలోనే వేలం ప్రారంభ రోజున ఇంత ధర దక్కడం ఇదే ప్రథమం. ఇలాగే ఈ ఏడాది పొడవునా మంచి ధరలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. దక్షిణాదిలో సోమవారం పొగాకు కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. జిల్లాలోని ఒంగోలు-1, పొదిలి, కొండపి, నెల్లూరు జిల్లా కందుకూరు-1 కేంద్రాల్లో తొలి విడతగా మొదలయ్యాయి. ఈ ప్రాంతంలో ప్రస్తుత సీజన్‌కు 105 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి బోర్డు అనుమతివ్వగా దాదాపు 161 మిలియన్ కిలోలు ఉత్పత్తి అయినట్లు అంచనా. కాగా కొండపి కేంద్రంలో పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్, ఒంగోలు-1లో బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు వేలాన్ని ప్రారంభించి పరిశీలించారు.

ఒంగోలు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పొగాకు మార్కెట్ ఆరంభం అదిరిపోయింది. కొనుగోళ్ల ప్రారంభం రోజున గరిష్ఠ ధర కిలో రూ.280 పలికింది. గత ఏడాది వేలం ప్రారంభం రోజున కిలోకు రూ.230 ఇచ్చిన వ్యాపారులు ఈ సీజన్‌లో ఎవరి ఊహలకు అందని విధంగా ఏకంగా రూ.280 చెల్లించారు. రాష్ట్రంలో 16 వేలం కేంద్రాలలో ప్రస్తుత సీజన్ పొగాకు కొనుగోళ్లను మూడు విడతలలో చేపట్టాలని బోర్డు నిర్ణయించింది. అందులో దక్షిణాది ప్రాంతంగా పిలిచే మన జిల్లాతోపాటు నెల్లూరు జిల్లాలో ఉన్న 11 కేంద్రాలలో తొలుత నాలుగు చోట్ల, రెండో దశలో మిగిలిన ఏడు చోట్ల వేలం ప్రారంభానికి నిర్ణయించారు. తదనుగుణంగా సోమవారం దక్షిణాదిలో తొలిదశ పొగాకు కొనుగోళ్లకు శ్రీకారం పలికారు.

అంతర్జాతీయ అవసరమే కారణం

వేలం ముందు రోజు అధిక శాతం వ్యాపారులు గత ఏడాది కిలో రూ.230తో ప్రారంభించి నందున ఈ ఏడాది రూ.260తో చేద్దామని సూచించగా ఐటీసీ ప్రతినిధులు రూ.290 ప్రతిపాదించినట్లు సమాచారం. చివరకు కిలోకు ప్రారంభ ధర రూ.280 ఇచ్చి కొనుగోలు చేశారు. అంతర్జాతీయ అవసరాల కోసం తక్షణం కొంత మేలురకం పొగాకు కావాలని తెలుస్తోంది. దాని వల్ల తొలి రోజునే ఈ స్థాయి ధర లభించినట్లు చెప్తున్నారు. నిజానికి ఈ ఏడాది ఇచ్చిన అనుమతి కన్నా గత ఏడాది జరిగిన

మిగతా 6వ పేజీలో

- దక్షిణాదిలో మొదలైన ప్రస్తుత సీజన్ పొగాకు కొనుగోళ్లు
- 19న రెండో విడత ప్రారంభం
- కొండపిలో చైర్మన్, ఒంగోలు-1లో ఈడీ హాజరు
- మార్కెట్‌లో ఇదే ఒరవడి కోరుతున్న రైతులు



బ్రహ్మయ్యకు బొకే ఇచ్చి అభినందిస్తున్న కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ రామయ్య చౌదరి, చోడవరం గ్రామస్థులు

పొగాకు బోర్డు వైస్ చైర్మన్‌గా బ్రహ్మయ్య బాధ్యతల స్వీకరణ 6



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై కోటేశ్వరరావు

శభాష్ పోలీస్!

ఆత్మహత్య చేసుకోబోతున్న వ్యక్తిని కాపాడిన రాచర్ల ఎస్ఐ

బేస్తవారపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకోబోతున్న ఓ వ్యక్తిని పోలీసులు కాపాడారు. ఈ ఘటన సోమవారం జగ్గంబొట్ల రైల్వే లైన్‌పై చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే... కంభంకు చెందిన ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకుంటున్నానని తన కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. దీంతో భయాందోళనకు గురైన వారు కంభం పోలీసులను ఆశ్రయించారు. అతని సెల్ సిగ్నల్ రాచర్ల మండలం చూపడంతో వెంటనే ఆ మండల ఎస్సైకి సమాచారం ఇచ్చారు. స్పందించిన రాచర్ల ఎస్సై కోటేశ్వరరావు రైల్వేలైన్‌పై పరిశీలన చేపట్టగా బేస్తవారపేట మండలంలోని జగ్గంబొట్ల కృష్ణాపురం ట్రాక్ వద్ద ఆ వ్యక్తి కనిపించాడు. ఆయన్ను పట్టుకొని కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సకాలంలో స్పందించి ఒక ప్రాణాన్ని కాపాడిన ఎస్సైని ప్రజలు అభినందించారు.



పూరిమెట్లలో నిర్మించిన కోదండ రామాలయం

ఊరు మారింది

గొడవలు, కొట్లాటలు వదిలి అభివృద్ధి, ఆధ్యాత్మికతపై దృష్టి పెట్టిన పూరిమెట్ల

- రూ.లక్షలు ఖర్చు చేసి పలు దేవాలయాల నిర్మాణం
- ఆగిన పోలేరమ్మ ఆలయ నిర్మాణానికి కదిలిన యువత
- వాట్సాప్ గ్రూపు ద్వారా విరాళాల సేకరణ
- సాయపడుతున్న సాఫ్ట్‌వేర్‌లు, ఇతర ఉద్యోగులు

7

గిద్దలూరు సబ్ రిజిస్ట్రార్‌పై దాడి

- ఆయన ఇంటిలోనే ఘటన
- తలకు గాయాలు
- గుర్తుతెలియని వ్యక్తులని పోలీసులకు ఫిర్యాదు

6



ఖాళీ బిందెలతో రోడ్డుపై నిరసన తెలుపుతున్న మహిళలు

తాగునీటి కోసం రాస్తారోకో

- ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన పోతంపల్లి మహిళలు

పెద్దారవీడు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పది రోజులుగా తాగునీరు లేకపోవడంతో మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. గుంటూరు-కర్నూలు రహదారిపై సోమవారం నిరసనకు దిగారు. ప్రభుత్వాలు మారినా తమ కష్టాలు తీరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. మండలంలోని పోతంపల్లి ఎస్సీ కాలనీకి పది రోజుల నుంచి నీటి సరఫరా జరగడం లేదు. గ్రామమంతా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితులను ముందే తెలుసుకున్న అధికారులు కొంత మేరకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. కానీ ఆ నీరు సరిపోవడం లేదంటూ ఎస్సీ కాలనీ మహిళలు రాస్తారోకో చేశారు. సరిపడినన్ని సరఫరా చేయాలని నినదించారు. విషయం తెలుసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పోతంపల్లి చేసుకొని ఉన్నతాధికారుల అనుమతితో ట్యాంకర్లను పెంచి నీటిని సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

ధాన్యం రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో వ్యాపారులు, దళారుల ఇష్టారాజ్యమైంది. రైతుల అవసరాన్ని ఆసరా చేసుకొని ధరలను దిగ్గోసి కొనుగోలు చేస్తున్నారు. పంట సాగుకు తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుతుండటం, ఇతరత్రా అవసరాల కోసం వారికే అన్నదాతలు అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో తీవ్రంగా నష్టపోతున్నారు. కానీ కొనుగోలు కేంద్రాల ప్రారంభంపై అధికారుల నుంచి ఎలాంటి చలనం లేకపోవడం కర్షకులను కన్నీరు పెట్టిస్తోంది.



లారీలో ఎక్కించేందుకు సిద్ధం చేస్తున్న ధాన్యం బస్తాలు

చివరికి నష్టాలే!

- ప్రారంభం కాని ప్రభుత్వ కొనుగోలు కేంద్రం
- లభించని మద్దతు ధర
- వ్యాపారులు, దళారుల దగా
- పట్టించుకోని అధికారులు
- కనపర్తి ఎత్తిపోతల రైతు కన్నీరు

నాగులుప్పలపాడు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : విత్తిన నాటి నుంచి చేతికొచ్చేదాకా వ్యయప్రయాసల కోర్చి పండించిన పంటను అమ్ముకుందామని చూస్తే ధర లేకుండా పోయింది. ప్రభుత్వం మార్కెట్‌ను పట్టించుకోకపోగా ధాన్యం కొనుగోలు కేంద్రం కూడా ఏర్పాటు చేయకపోవడంతో అన్నదాత పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికార యంత్రాంగం తీరుతో అప్పులు తీర్చుకునేందుకు రైతన్నలు గత్యంతరం లేక దళారులు చెప్పిన ధరకే అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. వివరాల్లోకెళితే.. మండలంలోని అమ్మనబ్రోలు, వినోదరాయునిపాలెం, దాసరివారిపాలెం, చవటపాలెం, కనపర్తి, మాచవరం, రాపర్ల తదితర గ్రామాలకు చెందిన రైతులు కనపర్తి ఎత్తిపోతల పథకం పరిధిలో మాగాణి సాగు చేశారు. ఈ ఏడాది 4 వేల ఎకరాల్లో పంటను వేశారు. వర్షాలు బాగానే కురిసినా గుండ్లకమ్మ డ్యాం నుంచి దిగువన ఉన్న కనపర్తి ఎత్తిపోతల పథకం స్కీంకు సకాలంలో నీరు అందని పరిస్థితి నెలకొంది. చివరి భూముల పరిస్థితి మరీ దారుణం. దీంతో రైతులు భగీరథ ప్రయత్నాలు చేసి పంటను పండించారు. కానీ అమ్ముకునే సమయానికి ధర లేకుండా పోయింది.

ఊసే లేని కొనుగోలు కేంద్రం

అధికార యంత్రాంగం ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోకపోవడంతో అన్నదాతకు కన్నీళ్లు మిగులుతున్నాయి. కనపర్తి ఎత్తిపోతల పథకం పరిధిలో ఈ ఏడాది కేఎన్ఎమ్1638, 1262, 1271, నెల్లూరు సన్నాలు రకం సాగు చేశారు. ఎకరానికి 40 బస్తాల వరకూ దిగుబడి వచ్చింది. 20 రోజుల నుంచి కోతలు నడుస్తున్నాయి. అయితే వచ్చిన పంటను కల్లాల్లోనే విక్రయించే ప్రయత్నంలో రైతులు

మిగతా 6వ పేజీలో



కల్లంలో ధాన్యాన్ని కాటా వేస్తున్న కూలీలు

తప్పని పరిస్థితుల్లో అమ్ముకోవాల్సి వస్తోంది



పంట సాగు చేపట్టిన నాటి నుంచి అనేక ఇబ్బందులు పడ్డాం. అప్పులు చేసి సాగు పూర్తి చేశాం. తీరా పంట చేతికొచ్చిన సమయానికి ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయకపోవడంతో దళారులు, వ్యాపారుల ఇష్టారాజ్యమైంది. తప్పని పరిస్థితుల్లో వారి వద్దనే అమ్ముకోవాల్సిన పరిస్థితి. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి.

- ఈదర వెంకటకృష్ణారావు, కనపర్తి ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు

మద్దతు ధర కల్పించి ఆదుకోవాలి



ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికొచ్చిందన్న ఆనందం దళారుల దెబ్బకు ఆవిరైపోయింది. ప్రభుత్వం, అధికార యంత్రాంగం తీరు బాధాకరం. మా సమస్యలను పట్టించుకోవడం లేదు. అప్పులు చేసి పంట సాగు చేస్తే కన్నీళ్లే మిగులుతున్నాయి.

- వల్లంశెట్టి విజయభాస్కర్, రైతు, కనపర్తి

సబ్సిడీ పరికరాలు ఇప్పిస్తామని మోసం

- ఎస్పీ గ్రీవెన్స్‌లో రైతుల ఫిర్యాదు



వినతులను స్వీకరిస్తున్న పోలీసు అధికారులు

ఒంగోలు క్రైం, మార్చి10 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సబ్సిడీ వ్యవసాయ పరికరాలు ఇప్పిస్తానని చెప్పి పలువురి వద్ద రూ.16.82 లక్షలు తీసుకొని ఓ వ్యక్తి మోసం చేశాడని దర్శికి చెందిన రైతులు ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి 77మంది అర్జీలను అందజేశారు. అదనపు ఎస్పీ కె.నాగేశ్వరరావు, పోలీసు అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకొని వారితో సావధానంగా మాట్లాడారు. అందుకు సంబంధించిన అధికారులతో మాట్లాడి సత్వరమే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేశారు. సబ్సిడీ పరికరాలు ఇప్పిస్తానని ఓ వ్యక్తి నమ్మించి రూ.16.82 లక్షలు తమ వద్ద వసూలు చేశాడని దర్శికి చెందిన రైతులు ఫిర్యాదు చేశారు. రెండేళ్లు గడిచినా పరికరాలు ఇప్పించకపోగా తిరిగి డబ్బులు ఇవ్వకుండా మోసం చేశాడని పేర్కొన్నారు. అదేవిధంగా ఒంగోలుకు చెందిన ముగ్గురు వ్యక్తులు తన కుమారుడికి కరెంటు ఆఫీసులో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఆరు లక్షలు తీసుకొని ఇంత వరకూ పని చేయకపోగా, అడిగితే బెదిరిస్తున్నారని ఓ బాధితుడు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐలు హజరత్తయ్య, జగదీష్, పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు

● ప్రత్యేక చొరవ తీసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర
● అందుబాటులోకి అధునాతన పరికరాలు

కనిగిరి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కనిగిరి పట్టణంలోని కమ్యూనిటీ వైద్యశాలలో వైద్యసేవలు పూర్తిస్థాయిలో మొదలయ్యాయి. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చొరవ, కృషితో శస్త్రచికిత్స సేవలు కూడా అందుతున్నాయి. సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఆపరేషన్‌చేసి ఓ బిడ్డకు జన్మనిచ్చారు. కనిగిరిలో దశాబ్దకాలంగా పాలకులు నిర్లక్ష్యానికి ప్రభుత్వాసుపత్రి కునారిల్లింది. చిన్న వైద్యానికి కూడా ఒంగోలు లేదా ప్రయివేటు ఆసుపత్రికి రోగులు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి 2024 ఎన్నికల్లో గెలిచిన నాటి నుంచి ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు అందించాలని సంకల్పించారు. ఈక్రమంలో సొంత నిధులతో పాటు దాతల సహకారంతో ప్రవేటు ఆసుపత్రుల కంటే మెరుగుగా అధునాతన వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చారు. అపరేషన్ థియేటర్‌లో అధునాతన సేవలు, మిషనరీ సామగ్రిని సమకూర్చారు. పుట్టిన బిడ్డకు కంగారు కేర్ కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చారు. కనిగిరి ప్రభుత్వాసుపత్రిలో స్థానికంగానే కాదు జిల్లా కేంద్రాల్లో కూడా లేని అధునాతన, ఎంతో విలువైన సామగ్రిని ఏర్పాటుచేయించారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర తన సొంత నిధులతో సేవలు అందించేలా మత్తు డాక్టర్‌ను నియమించారు. ఇటీవల ఆసుపత్రిని మంత్రులు గొట్టిపాటి రవికుమార్, బాలవీరాంజనేయస్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా సందర్శించి ఎమ్మెల్యేను ప్రశంసించారు. కనిగిరి ప్రాంతవాసులు ప్రసవాలకు ప్రయివేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తుంది. దీంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనుంచి కనిగిరి ప్రభుత్వాసుపత్రిలో ఈ సేవలు అందుతున్నాయి. ఎమ్మెల్యే చొరవ తీసుకొని మెరుగైన వసతులు కల్పించడంపట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


పుట్టిన పాపను కంగారు కేర్ యూనిట్ మిషన్‌లో ఉంచిన వైద్యులు


కనిగిరి సీహెచ్‌సీ లో మహిళకు సిజేరియన్ చేసి పాపకు జన్మనిచ్చిన వైద్యులు

గిద్దలూరు సబ్ రిజిస్ట్రార్‌పై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

● తలకు గాయాలు ● పోలీసులకు ఫిర్యాదు

గిద్దలూరు టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు సబ్ రిజిస్ట్రార్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయడంతో తలకు గాయమైంది. ఈ విషయమై సబ్‌రిజిస్ట్రార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అందిన సమాచారం మేరకు... గిద్దలూరు సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న ఎస్.క్రిష్ణ మోహన్ విధులు పూర్తి చేసుకుని ఇంటికి వెళ్లారు. శర్మవీధిలో నివాసం ఉంటున్న అతను 8 గంటలకు ఇంటికి చేరుకోగా 8.30 గంటల సమయంలో నలుగురు వ్యక్తులు వచ్చారు. సబ్ రిజిస్ట్రార్ సహాయకునిగా ఉన్న వ్యక్తితో రిజిస్ట్రేషన్ విషయమై సబ్ రిజిస్ట్రార్‌తో మాట్లాడాలని చెప్పారు. వెంటనే అతను వెళ్లి సబ్ రిజిస్ట్రార్‌కు చెబుతున్న క్రమంలోనే వచ్చిన నలుగురు సబ్ రిజిస్ట్రార్‌పై దాడికి పాల్పడ్డారు. పిడిగుద్దులు కురిపించడంతోపాటు అక్కడ ఉన్న వస్తువులతో తలపై కొట్టారు. దీనితో సబ్ రిజిస్ట్రార్‌కు గాయాలయ్యాయి. దీంతో అతను వెంటనే గిద్దలూరు పోలీసుస్టేషన్‌కు వెళ్లి అర్బన్ సీఐ కె.సురేష్‌కు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తాం

కొమ్మినేనివారిపాలెంలో ఆర్వోప్లాంట్‌ను ప్రారంభించిన ఎన్ఆర్ఐ

బల్లికురవ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : తాను ఎంత ఉన్నత స్థానంలో ఉన్నా తనకు విద్యను అందించిన పాఠశాలను జీవితంలో మరిచిపోనని ఎన్ఆర్ఐ కరిశెట్టి పవన్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కొమ్మినేనివారిపాలెం ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ పవన్, ఎపర్చు సంస్థ ద్వారా సుమారు రూ.3లక్షలు ఖర్చు చేసి విద్యార్థుల కోసం మినరల్ ఆర్వో ప్లాంట్, లైబ్రరీని ఏర్పాటు చేసి వారి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సభకు ప్రధానోపాధ్యాయుడు పాలపర్తి రామాంజనేయులు అధ్యక్షత వహించారు. ఎన్ఆర్ఐ, పీజీఎస్ఎఫ్ ప్రతినిధి అయిన పవన్ మాట్లాడుతూ తన జీతంలో 30 శాతాన్ని పాఠశాలల అభివృద్ధికి ఖర్చు చేస్తానని హామీ ఇచ్చారు.

పొగాకు బోర్డు వైస్ చైర్మన్‌గా బ్రహ్మయ్య బాధ్యతలు

కొండపి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పొగాకు బోర్డు వైస్‌చైర్మన్‌గా బొడ్డపాటి బ్రహ్మయ్య సోమవారం గుంటూరులోని ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో బోర్డు ప్రస్తుత చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ చౌదరి, సభ్యులు, మాజీ వైస్ చైర్మన్ వాసుబాబు, రైతు నాయకులు పోతుల నరసింహారావు, కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడు గోపీచంద్ అమ్మమ్మ మృతి

ఇంకొల్లు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఇండియా బ్యాడ్మింటన్ కోచ్, తెలంగాణ రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి పుల్లెల గోపీచంద్ అమ్మమ్మ గోరంట్ల ఆదెమ్మ (89) మృతి చెందారు. ఇంకొల్లు మండలం నాగండ్ల గ్రామానికి చెందిన ఆదెమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు కాగా పెద్దకుమార్తె సుబ్బాయమ్మ కుమారుడు పుల్లెల గోపిచంద్. అమ్మమ్మ మృతి చెందడంతో సోమవారం నాగండ్లలో జరిగిన అంత్యక్రియల కార్యక్రమంలో గోపీచంద్ పాల్గొన్నారు. ఆదెమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి రాష్ట్రాల బ్యాడ్మింటన్ అసోసియేషన్‌ల తరుపున సంతాపం తెలిపారు. ఆదెమ్మ నివాళులర్పించినవారిలో కరణం చెంచుపున్నయ్య, రావి సత్యనారాయణ, సోమేపల్లి రామ్మోహనరావు, మార్కెండెయులు, గోరంట్ల హరిబాబు, బాబు, శ్రీనివాసరావు, కుమార్, పీవీలక్ష్మీ ఉన్నారు.


అమ్మమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న గోపించ్, కుటుంబీకులు

ఆర్ఎంపీ వైద్యుడికి చేయూత

సంతనూతలపాడు, మార్చి 10(ఆంధ్రజ్యోతి) మండలంలోని పి.గుడిపాడు గ్రామంలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో ఆర్ఎంపీ వైద్యుడు యు.మల్లిఖార్జునరావు ప్రథమ చికిత్సా కేంద్రం దెబ్బతినింది. సోమవారం గుడిపాడు సర్పంచ్ కే.పుష్ప, బీజేపీ నాయకులు ఎస్.శ్రీనివాసరావు, కళ్యాణ్‌రెడ్డి, వెంకట్రావు నాయీబ్రాహ్మణసంఘం నాయకులు కే.నరశింహారావు ఆర్ఎంపీకి చేయూత నిచ్చారు.

రేపు వైసీపీ పోరుబాట ధర్నా

మద్దిపాడు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): యువత పోరుబాట పేరుతో ఒంగోలు ప్రకాశం భవనం ఎదుట ఈనెల 12న ధర్నా నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి, సంతనూతలపాడు వైసీపీ సమన్వయకర్త మేరుగ నాగార్జున తెలిపారు. సోమవారం మద్దిపాడు వైసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇనమనమెళ్లూరు ఎంపీటీసీ వాకా కోటిరెడ్డి, వైసీపీ నాయకులు చెంచిరెడ్డి, పోలవరపు లక్ష్మీనారాయణ, వెంకట్రావు, ప్రభాకర్, దుడ్డు వినోద్, బొమ్మల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థుల సేవలు అభినందనీయం

మద్దిపాడు, మార్చి 10(ఆంధ్రజ్యోతి):నర్సింగ్ విద్యార్థినుల సమాజ సేవ అభినందనీయమని మండల తహసీల్దార్ సుజన్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీలో రిమ్స్ నర్సింగ్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు ఎన్‌ఎస్‌ఎస్ క్యాంప్ ప్రారంభోత్సవంలో పాల్గొని ఎంపీడీవో వరప్రసాద్, ఎంఈవో ఎంవీఆర్ ఆంజనేయులుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రామస్థులలో పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించాలని అన్నారు. ఎంపీడీవో వరప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థినులు ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమానికి మద్దిపాడును ఎంచుకోవటం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శిరీష, వినీల, రిమ్స్ కళాశాల అధ్యాపకులు వరలక్ష్మి, ధనలక్ష్మి, భువనేశ్వరి, అనురాధ, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

ఘనంగా హైస్కూల్ వార్షికోత్సవం

టంగుటూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పునాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీ పూజ, విద్యార్థులు గురుపూజ చేశారు. ఎంఈవోలు చెంచుపున్నయ్య, మారుతీ బాలజీ విద్యార్థులను ఆశీర్వదించారు. పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని కోరారు. 1996లో 10వ తరగతి చదివిన విద్యార్థులంతా కలసి పాఠశాలకు కుర్చీలను బహూకరించారు. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ప్రధానాపాధ్యాయురాలు ఎస్‌వీ సుదారాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పి.సురేష్, బి.శ్రీనివాస్, జ్యోతి పాల్గొన్నారు.

ఆరంభం అదుర్స్

(5వ పేజీ తరువాయి)

ఉత్పత్తి పరిమాణం కన్నా అధికంగానే పంట పండింది. ఈ ఏడాది దక్షిణాదిలో 105 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతి ఇవ్వగా విస్తారంగా పంట సాగైంది. దీంతో సుమారు 161 మిలియన్ కిలోలు ఉత్పత్తి అంచనా వేస్తున్నారు.

రైతుల్లో ఆనందం

తొలిరోజు లభించిన ధరతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది కన్నా ఈ సీజన్‌లో సగటున 25శాతం ఉత్పత్తి ఖర్చులు పెరిగాయి. గతం కన్నా 20 నుంచి 25శాతం పంట దిగుబడి తగ్గుతోంది. ఈ పరిస్థితిని వ్యాపారులు, బోర్డు అధికారులు గుర్తించి ఏడాది పొడవునా మార్కెట్‌లో ఇబ్బందులు రాకుండా కొనుగోలు చేయాలని పలువురు రైతు నాయకులు కోరుతున్నారు. ఇదే విషయాన్ని వారు అటు కొండపిలో చైర్మన్‌ను, ఇటు ఒంగోలులో ఈడీల దృష్టికి తీసుకెళ్లారు. కాగా తొలిరోజు ప్రారంభించిన ధరల పట్ల పూర్తి సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని, భవిష్యత్‌లో కూడా మంచి ధరలు లభించాలని ఆకాంక్షిస్తున్నట్లు బోర్డు ఈడీ శ్రీధర్‌బాబు ఒంగోలు-1 కేంద్రంలో కొనుగోళ్ల ప్రారంభం సందర్భంగా చెప్పారు.

చి'వరి'కి నష్టాలే!

(5వ పేజీ తరువాయి)

ఉన్నారు. ఫిబ్రవరి 15 తర్వాత కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్న అధికారులు ఆదిశగా చర్యలు తీసుకున్న పరిస్థితి లేదు. ఇదే అదనుగా దళారులు గద్దల్లా వాలిపోయి తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో వారు చెప్పిన ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితి దాపురించిందని అన్నదాతలు వాపోతున్నారు.

లభించని మద్దతు ధర

1638 రకం. 76కేజీల బస్తాకు ప్రభుత్వం రూ.2,320 మద్దతు ధర ఇస్తుండగా దళారులు మాత్రం రూ.1,550 కొనుగోలు చేస్తున్నారు. 1262, నెల్లూరు సన్నాలు రకానికి రూ.1,770 మద్దతు ధర ప్రకటించగా వ్యాపారులు రూ.1,400కు మాత్రమే కొంటున్నారు. ఈ ప్రాంతంలో కోతలు ప్రారంభమైన నాటి నుంచి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని మార్కెటింగ్ శాఖ జిల్లా మేనేజర్‌కు విన్నవించినా ఫలితం లేదు. మండల వ్యవసాయాధికారి దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆ అంశం జిల్లా అధికారుల పరిధిలో ఉందని, తాను ఏం చేయలేనని చేతులెత్తేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికార యంత్రాంగం స్పందించి కనపర్తిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి వరికి మద్దతు ధర కల్పించాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

సంతనూతలపాడు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు జడ్పీ హైస్కూల్లో సోమవారం సేవాసంకల్ప్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల సామగ్రిని ఎస్సై వి.అజయ్‌బాబు, ఎంఈవో వెంకారెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోఆ ట్రస్టు చైర్మన్ శనగల వెంకటరమణ, సభ్యులు నాగేశ్వరరావు, వెంకటరామిరెడ్డి, పీఎన్ఎస్ చౌదరి, శ్రీనివాసరావు, హెచ్ఎం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. ఏకేఎస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆ ట్రస్ట్ అధినేత అట్లూరి రామారావు 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల మెటీరియల్స్‌ను ఎంఈవో వెంకారెడ్డి పంపిణీ చేశారు.

కార్యాలయ కౌంటర్‌లోనే పన్ను చెల్లించండి

● సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు
● మున్సిపల్ కమిషనర్ రవీంద్ర

అద్దంకి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పన్నులు చెల్లింపు దారులకు పన్ను చెల్లించమని కమిషనర్ పేరుతో ఫోన్ చేసి ఫోన్‌పే చేయమని చెపితే ఎట్టి పరిస్థితులలో చెల్లింపులు చేయరాదని అద్దంకి మున్సిపల్ కమిషనర్ రవీంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ట్రేడ్ లైసెన్స్ చెల్లింపు దారులకు 7670906441 నెంబర్ నుంచి ఫోన్ చేసి మున్సిపల్ కమిషనర్‌గా చెప్పి ఆన్‌లైన్ పేమెంట్ చేయమని అడుగుతున్నట్లు పలువురు నుంచి ఫిర్యాదుల వచ్చాయని, ఆ ఫోన్‌నెంబర్ తనది కాదని కమిషనర్ వివరించారు. సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది మాత్రమే పట్టణంలో పన్నుల వసూలు చేస్తున్నారని తెలిపారు. ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా ఎట్టి పరిస్థితిలోనూ చెల్లింపుల చేయరాదన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఉన్న కౌంటర్‌లో ట్యాక్స్ చెల్లించి మోసాలకు గురి కాకుండా ఉండాలన్నారు.


కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో స్వరూపారాణి

పీ-4 సర్వేకు సహకరించాలి

పంగులూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం స్వర్ణాంధ్ర - 2047లో భాగంగా ప్రతి ఇంటికీ అభివృద్ధి, ప్రతి జీవితానికి ప్రగతి అనే నినాదంతో నిర్వహిస్తున్న పీ-4 సర్వేకు ప్రజలు సహకరించాలని ఎంపీడీవో స్వరూపారాణి కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం పీ4 సర్వేకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన పోస్టర్‌ను ఎంపీడీవో ఆవిష్కరించారు. పేదల ప్రగతికి పరస్పర సహకారంతో ప్రభుత్వం, దాతలు, ప్రజల భాగస్వామ్యంతో చేపడుతున్న పీ-4 సర్వేపై ప్రజలు క్యూఆర్ కోడ్ ద్వారా అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు. ఈ నెల25 వరకు చేపట్టే సర్వేను ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీవో సూచించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ హనుమంతరావు, ఈవోఆర్డీ సుమంత్, ఏవో సుబ్బారెడ్డి, కార్యాలయ సూపరింటెండెంట్ రమేష్, కార్యదర్శి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేని పరిశీలించిన ఎంపీడీవో

చినగంజాం : మండల పరిధిలో జరుగుతున్న పబ్లిక్, ప్రైవేట్ పీపుల్ పార్టనర్ షిప్ (పీ-4) సర్వేని ఎంపీడీవో ఏ శ్రీనివాసమూర్తి సోమవారం పరిశీలించారు. పలు గ్రామాల్లో జరుగుతున్న పీ-4 సర్వేని ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. సర్వేలోని ప్రశ్నలకు సంబంధించిన వివరాలను నమోదు చేయడంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పేదిరిక నిర్మూలన కోసం ప్రభుత్వం ఈ సర్వేని చేపట్టినట్లు తెలిపారు. ఈ సర్వే ద్వారా పేదకుటుంబాలను గుర్తించి వారి జీవనప్రమాణాలను మెరుగు పరచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులతో ఈ నెల 18వ తేదీ వరకు సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


ప్రమాదంలో పూర్తిగా కాలిపోయిన ఇల్లు

జరుబులవారిపాలెం(పర్చూరు), మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రేకుల షెడ్‌తో ఉన్న ఇల్లు దగ్ధమైన ఘటన కారంచేడు మండల పరిధిలోని జరుబులవారిపాలెంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మహాలక్ష్మి ఇల్లు ప్రమాదంలో కాలిపోయింది. ఇంట్లో ఎవరూలేని సమయంలో అగ్నిప్రమాదం జరగడంతో పెనుప్రమాదం తప్పింది. సుమారు రూ.2లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగిందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చినా సకాలంలో స్పందించకపోవడంతో తన ఇల్లు పూర్తిగా కాలిపోయిందని ఆమె విలపిస్తున్నారు. గ్రామస్థులు ట్యాంకర్ ద్వారా నీటిని తెచ్చి మంటలను అదుపుచేశారు.

ఆందోళన పడకుండా పరీక్ష రాయాలి

చీరాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఈయేడాది పది పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు ఆందోళన పడకుండా పరీక్ష రాయాలని కృతి ఫౌండేషన్ చైర్మన్ ఆకురాతి వెంకట అశ్విని, భట్టు ప్రదీప్ దంపతులు అన్నారు. స్థానిక ఎపి మోడల్ స్కూల్ నుంచి పది పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు పరీక్ష పరికరాలు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, ఎస్ఎంసీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న ఇన్‌చార్జి చైర్మన్ జైసన్‌బాబు, నాయకులు

చీరాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పరిపాలన విఫలమైందని ఇచ్చిన హామీలు విస్మరించి ప్రజలను మభ్య పెడుతున్నారని మునిసిపల్ ఇన్‌చార్జి చైర్మన్ బొనిగల జైసన్‌బాబు అన్నారు. సోమవారం చైర్మన్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈనెల 12వ తేదీన జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు యాతం మేరిబాబు, ప్రసాద్, రమణారెడ్డి, చిరంజీవి, వాసు పాల్గొన్నారు.

ఇంకొల్లు, : విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఈ నెల 12న తలపెట్టిన యువతపోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైసీపీ ఇన్‌చార్జి గాదె మధుసూదనరెడ్డి కోరారు. సోమవారం మండలంలోని పావులూరులో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

స్కూటీని ఢీకొన్న కంటైనర్ లారీ

పాస్టర్ మృతి


బాలసుందరం మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రవితేజ

అద్దంకి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : స్కూటీని పక్కగా వెళ్తున్న కంటైనర్ లారీ ఢీకొనడంతో పాస్టర్ ఆత్తోటి బాలసుందరం (72) అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కలవకూరు చెందిన బాలసుందరం సోమవారం సాయంత్రం స్కూటీపై వెళ్తుండగా అద్దంకి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆగి ఉన్న కారు పక్క గుండా వెళ్లే క్రమంలో వెనుక నుంచి వెళ్తున్న కంటైనర్ లారీ వెనుక భాగం స్కూటీని ఢీకొట్టింది. దీంతో బాలసుందరం అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనాస్థలాన్ని ఎస్సై రవితేజ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఊరు మారింది

గొడవలు, కొట్లాటలు వదిలి అభివృద్ధి, ఆధ్యాత్మికతపై దృష్టి పెట్టిన పూరిమెట్ల

ముండ్లమూరు మండలంలోని పూరిమెట్ల మూడు దశాబ్దాల క్రితం ఫ్యాక్షన్ కక్షలతో రికార్డుల్లోకి ఎక్కింది. నిత్యం గొడవలతో గ్రామస్థులు రెండు వర్గాలుగా విడిపోయి పోలీసుస్టేషన్‌ల చుట్టూ తిరుగుతూ కంటి మీద కునుకు లేకుండా ఉండేవారు. ఇప్పుడు ఆలోచనలు మారాయి. ఫ్యాక్షన్‌కు ఫుల్‌స్టాప్ పెట్టి గ్రామాభివృద్ధే లక్ష్యంగా ఊరంతా కదులుతోంది. యువత ముందు వరుసలో నిలుస్తోంది.

- రూ.లక్షలు ఖర్చు పెట్టి పలు దేవాలయాల నిర్మాణం
- ఆగిన పోలేరమ్మ ఆలయ నిర్మాణానికి కదిలిన యువత
- వాట్సాప్ గ్రూపు ద్వారా విరాళాల సేకరణ
- సాయపడుతున్న సాఫ్ట్‌వేర్‌లు, ఇతర ఉద్యోగులు


పూరిమెట్ల గ్రామం వ్యూ

ముండ్లమూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు బాంబుల మోతతో దద్దరిల్లే పూరిమెట్ల ఇప్పుడు మారిపోయింది. అభివృద్ధి, ఆధ్యాత్మిక భావాలు వెదజల్లుతున్నాయి. ఆ గ్రామంలో యువత దేవాలయాలు నిర్మించు కోవాలని నిర్ణయానికి వచ్చారు. దీన్ని అందరూ ఆమోదించారు. ముందుగా గ్రామంలో రూ.50 లక్షలతో బ్రహ్మంగారి దేవాలయం, రూ.25 లక్షలతో కోదండరామాలయం, మరో రూ.10 లక్షలతో నాభిశిల విగ్రహం నిర్మించారు. గ్రామంలో దేవాలయాలు నిర్మించటంతో ఫ్యాక్షన్, గొడవలు వల్ల జరిగే నష్టాలను ఒకరికొకరు చెప్పుకుంటూ ముందుకు సాగారు. మూడు సంవత్సరాల క్రితం గ్రామ దేవత అయిన పోలేరమ్మ అమ్మవారి ఆలయాన్ని నిర్మించాలని నిర్ణయానికి వచ్చారు. మొదట కొంత నగదుతో గుడిని నిర్మిస్తుండగా డబ్బులు లేకపోవటంతో వదిలి వేశారు. అయితే గ్రామానికి చెందిన యువత వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసుకుని రూ.30 లక్షల మేర వసూలు చేశారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ఇతర ఉద్యోగులు వివిధ రంగాల్లో స్థిరపడి వ్యాపారాల్లో రాణిస్తున్న యువత తమకు తోచిన విధంగా చందాల అందించారు. గుడి నిర్మాణంలో


నూతనంగా నిర్మిస్తున్న పోలేరమ్మ అమ్మవారి దేవాలయం


గ్రామంలో నిర్మించిన బ్రహ్మంగారి దేవాలయం

పాలు పంచుకున్నారు. ఇది చూసిన గ్రామంలోని ఇతరులు సైతం తాము కూడా తమకు తోచిన రీతిలో సహాయం చేశారు.

రాజకీయాల్లోనూ ఊరంతా ఏకతాటిపై..

2013లో జరిగిన ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో పార్టీలను సైతం పక్కన బెట్టి ఊరు మొత్తం ఒకే ఏకతాటిపై నిలిచి ఆ రెండు పదవులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యేటట్టు చేసుకున్నారు. సర్పంచ్ అభ్యర్థి రూ.15 లక్షలు, ఎంపీటీసీ అభ్యర్థి రూ.7.50 లక్షలు చొప్పున ఇచ్చిన నగదును సైతం గ్రామంలో పోలేరమ్మ అమ్మవారి ఆలయానికి వెచ్చించారు. దీంతో గ్రామంలో పోలేరమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణం జరుగుతోంది. మరో రెండు నెలల్లోనే ఆలయ నిర్మాణం పూర్తి కానుంది. కొట్లాటలు, కక్షలు కార్పణ్యాలను వదిలి భక్తిబాట పట్టి ప్రశాంతంగా ఉంటున్నారు.

'పల్లెవనం'కు పూర్వవైభవం

● గత వైసీపీ పాలనలో అధ్వానంగా పార్క్ ● కూటమి ప్రభుత్వంలో మెరుగుపడిన వసతులు ● పెరిగిన సందర్శకులు


దర్శిలోని ఎన్టీఆర్ పల్లెవనం పార్క్

దర్శి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : దర్శి పట్టణంలోని ఎన్టీఆర్ పల్లెవనం పార్క్‌కు పూర్వవైభవం వచ్చింది. ప్ర స్తుతం ఉదయం, సాయంత్రం సందర్శకులు అధికసం ఖ్యలో వస్తున్నారు. మహిళలు, యువకులు, చిన్నారులు ఆహ్లాదకరంగా కాలక్షేపం చేస్తున్నారు. గత టీడీపీ ప్రభు త్వ హయాంలో దర్శి-కురిచేడు రోడ్డులో ఎన్టీఆర్ పల్లె వనం పార్క్ ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నంతకాలం పార్క్ నిర్వహణ బాగుంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిర్వహణ గురించి పట్టించుకోలేదు. మొక్కలు, పచ్చిక బయళ్లు ఎండిపోయాయి. చిన్నారులు ఆడుకునే పరిక రాలు, జిమ్ పరికరాలు విరిగిపోయాయి. సిబ్బంది జీతా లు కూడా సక్రమంగా ఇవ్వలేదు. దీంతో పార్క్ పరిస్థితి అధ్వానంగా మారింది. అభివృద్ధి పనుల కోసం రూ.35 లక్షలు కేటాయించినప్పటికీ కొంతమంది అటవీశాఖ అధికారులు వైసీపీ నాయకుల అండతో పనులు చేయకుండానే బిల్లులు మార్చు కున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎట్టకేలకు పనులు పూర్తిచేశారు. గతంలో సాయంత్రం పూట పార్క్ తెరచేవారుకాదు. కేవలం ఒక్కపూట మా త్రమే మొక్కుబడిగా తీసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నియోజకవర్గ ఇన్ చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఎన్టీఆర్ పల్లెవనం పార్క్‌ను పరిశీలించారు. అక్కడి పరిస్థితుతులను గమనించి అటవీశాఖ అధికారులతో మాట్లాడారు. ప్రతిరోజు రెండు పూటలా పార్క్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచాల ని స్పష్టం చేశారు. అప్పటినుంచి పూర్తిస్థాయిలో పార్క్ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. చెడిపోయిన వస్తు వులను బాగు చేయించారు. ఆటపరికరాలన్నీ అందుబా టులోకి రావటంలో చిన్నారులు ఆనందంగా ఆడుకుంటు న్నారు. యువకులు జిమ్ చేసుకుంటున్నారు. వృద్ధులు, మధ్యవయస్సువారు వాకింగ్ చేసుకుంటున్నారు. ప్రస్తు తం ఎన్టీఆర్ పల్లెవనం పార్క్ పూర్తిస్థాయిలో అందు బాటులోకి రావటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తు న్నారు.


పార్క్‌లో ఆటలాడుకుంటున్న చిన్నారులు



పరదానే పందిరి.. నిచ్చెనే పాన్పు!

చుట్టూ పల్లేరుకాయ ముళ్లు, పైగా అది గ్రామానికి శివారు ప్రాంతం. వసతులు లేమి. అయినా చక్కగా ఆలోచించారు. హాయిగా కునుకు తీశారు. ఆ సన్నివేశం ఆంధ్రజ్యోతి కెమెరాకు చిక్కింది. గుంటూరు జిల్లా నంబూరుకు చెందిన వెంకటరావు రోజువారి కూలీ. అయితే యజమానికి సంబంధించి చీరాల మండలం ఈపూరుపాలెం శివారులో కొంత స్థలం ఉంది. ఈక్రమంలో యజమాని అందులో ప్రహరీ నిర్మించేందుకు వెంకటరావును పురమాయించారు. ఈక్రమంలో ఆదివారం పని ప్రారంభించి మధ్యాహ్నానికి బాగా అలసిపోయిన వెంకటరావు కింద పడుకుందామంటే ముళ్లు ఘోరంగా ఉన్నాయి. నిద్రేమో ముంచుకొస్తోంది. దీంతో తెలివిగా ఆలోచించి పని కోసం తెచ్చుకున్న ఇనుప స్టాండ్‌కు నిచ్చెనను పాన్పుగా ఏర్పాటు చేసుకుని ఎంచక్కా నిదురించారు. ఈ సన్నివేశం చూసిన వాహనదారులు వెంకటరావు తెలివికి ఫిదా అయ్యారు. - ఈపూరుపాలెం (చీరాల), ఆంధ్రజ్యోతి

వైభవంగా పృథులగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు


లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్

మర్రిపూడి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పృథులగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడోరోజైన సోమవారం ఆలయ ప్రధాన అర్చకుడు నారాయణం వికానస ఆచార్యుల ఆధ్వర్యంలో ఉదయాన్నే హోమం నిర్వహించారు. మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. స్వామికి నైవేద్యం సమర్పించి ఉత్సవ మూర్తులను మాడవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఉభయ దాతలు శ్రీకంఠం సుబ్బారావు, హరిప్రసాద్, వినయ్, భవానీప్రసాద్ పాల్గొన్నారు.


పృథులగిరి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

అధ్యక్షా..!

అభివృద్ధికి నిధులు కేటాయించాలి

● ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



కనిగిరి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కనిగిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి కోరారు. సోమవారం అసెంబ్లీలో పలు సమస్యలను ప్రస్తావించారు. నియోజకవర్గంలో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, కనిగిరి ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. కనిగిరి పట్టణ సమీపంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఇటీవల మంత్రి సవిత సందర్శించినట్లు చెప్పారు. హాస్టల్‌లోని పరిస్థితులను గమనించిన ఆమె విద్యార్థినులకు సరైన వసతులు లేవని గుర్తించినట్లు చెప్పారు. మూడేళ్ళుగా హాస్టల్ అద్దె భవనంలో నడుస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. 200 మంది విద్యార్థినులు ఉంటున్న ఈ హాస్టల్‌కు శాశ్వత భవనం నిర్మించాలని కోరారు. సీహెచ్‌సీలో అధునాతన వైద్య పరికరాలు అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. మరిన్ని నిధులు కేటాయిస్తే ప్రభుత్వాసుపత్రిలో పేద వారికి మరిన్ని వైద్యసేవలు అందించవచ్చునని చెప్పారు.

ఆలయ అభివృద్ధికి ఆటంకాలు లేకుండా చూడాలి

● ఎమ్మెల్యే ముత్తుముల



గిద్దలూరు, మార్చి 10 (ఆంధ్ర జ్యోతి) : రాచర్ల మండలం జెల్లి వారి పుల్లలచెరువు సమీప నల్ల మల అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీనెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవాలయ అభివృద్ధికి అటవీశాఖ నుంచి ఆటంకాలు లేకుండా చూడాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి కోరారు. సోమవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ ప్రతి శనివారం వేలాది మంది భక్తులు స్వామిని దర్శించుకుంటారని, గర్భగుడిని పెద్దదిగా చేసేందుకు వీలుగా పనులు జరగాలంటే అటవీశాఖ అధికారులు అనుమతి ఇవ్వడం లేదని, మంజూరైన రూ.6 కోట్ల నిధులు వృథాగా ఉన్నాయని తెలిపారు. అటవీ శాఖ మంత్రి అయిన పవన్‌కల్యాణ్ ప్రత్యేక చర్యలు తీసుకుని దేవస్థాన గర్భగుడిని, ఇతరత్రా పనులకు ఆటంకం కలగకుండా అటవీశాఖ అనుమతులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు.



సై'రన్'

● పోలీస్ సైరన్‌లతో ప్రైవేటు వాహనాల రణగొణధ్వనులు
● రాత్రి ఏడు దాటితే పట్టణంలో హల్‌చల్ చేస్తున్న వ్యక్తులు
● కన్నెత్తి చూడని పోలీసులు

చీరాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : చీరాలలో ఇటీవల కాలంలో రాత్రి ఏడుగంటలు దాటితే చాలు ప్రైవేటు వ్యక్తులు పోలీస్ సైరన్‌లతో కార్లను వేగంగా నడుపుతూ హల్‌చల్ చేస్తున్నారు. సాధారణంగా సైరన్‌లు అత్యవసర సమయంలో, ఆపదలో ఉన్న ప్రజలను రక్షించేందుకు, వీఐపీల ప్రొటోకాల్ వాహనాలు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకోసం వచ్చే అంబులెన్స్‌లకు మాత్రమే ప్రత్యేక సైరన్‌ను ఉపయోగిస్తారు. వాటికి తప్ప ఉన్నత స్థానాల్లో ఉన్న పాలకులకు సైతం సైరన్‌కు అనుమతి లేదు. కానీ చీరాల్లో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఎవరుపడితే వారు ఇష్టారీతిగా కార్లకు పోలీస్ సైరన్‌లను అమర్చుకొని రయ్‌రయ్ మంటూ పోతున్నారు. నిత్యం రాత్రి సమయాల్లో చీరాల రైల్వేస్టేషన్ పరిసరాల్లో ఇటువంటి వాహనాలు ఎక్కువగా తిరుగుతున్నాయి. ఒకవైపు విపరీతంగా పెరిగిన వాయు కాలుష్యం, శబ్ద కాలుష్యంతో ప్రజలు రోగాలబారిన పడుతుంటే ఇలా ఎవరో ఒకరు వీఐపీల పేర్లు ఉపయోగించుకుని పట్టణంలో హల్‌చల్ చేస్తున్నారు. ఏదో కొంపలు మునుగుతున్నట్లు వేగంగా దూసుకువచ్చి తాపీగా సిగరెట్లు కొనుక్కొని ఎంచక్కా ఎంజాయ్ చేస్తున్నారు. అలా వాహనాలు వస్తున్న సమయంలో సామాన్యులు ఆందోళనకు గురవుతున్నారు. మరోవైపు ఘోరమైన శబ్దాలతో ద్విచక్ర వాహనాలు, ఆకతాయిల త్రిబుల్ రైడింగ్‌లు, పొగ గొట్టం నుంచి షాట్స్ వేస్తూ అలజడి సృష్టిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అటువైపు పోలీసులు కన్నెత్తి కూడా చూడటం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సైరన్ గోల వేగానికి కళ్లెం వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రైవేటు వాహనాల సైరన్‌లపై నిఘా

ప్రైవేటు వ్యక్తుల వాహనాల సైరన్‌లకు అనుమతులు లేవు. ఇటువంటి వారు శిక్షార్హులు. వారిపై ప్రత్యేక నిఘా ఉంచుతాం. నిత్యం తనిఖీలు నిర్వహిస్తాం. ఏదయినా మా దృష్టికి వస్తే చర్యలు తప్పవు. అవసరమైతే కార్లు కూడా సీజ్ చేస్తాం. నిబంధనలకు భిన్నంగా వ్యవహరించవద్దు.

- శ్రీనివాసరావు, సీఐ వన్‌టౌన్

కేంద్ర పథకాలపై విస్తృత ప్రచారం చేయాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు


సమావేశంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సూర్య కల్యాణ్ చక్రవర్తి, పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు నాయకులు

జరుగుమల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం చేపడుతున్న పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసరావు పార్టీ కేడర్‌కు పిలుపునిచ్చారు. జరుగుమల్లిలో గ్రామ పార్టీ నాయకులు, బూత్ స్థాయి బాధ్యులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సూర్యకల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ పార్టీని బూత్ స్థాయిలో బలోపేతం చేయాలని, కూటమి ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పథకాలు పేదలకు అందేలా నాయకులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మిడసల బాలకోటయ్య, మండల అధ్యక్షుడు చాగంటి కోమలరావు తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ



అసిస్టెంట్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న కళాకారులు

బండారు విగ్రహాన్ని పరిరక్షించాలి

ఒంగోలు కల్చరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి) నెల్లూరు బస్టాండ్ వద్ద ఉన్న ప్రముఖ పౌరాణిక రంగస్థల నటుడు బండారు రామారావు విగ్రహ ప్రాంగణం అన్యాక్రాంతం అయిందని, ఆక్రమణలు తొలగించి విగ్రహ ప్రాంగణాన్ని పరిరక్షించాలని బండారు రామారావు శ్రీరామ నాట్యమండలి వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీపతి ప్రకాశం సోమవారం ఒంగోలు మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1982లో బండారు మారావు విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించగా మాజీ శాసనసభ్యులు వేమా ఎల్లయ్య సహకారంతో విగ్రహాన్ని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. విగ్రహం చుట్టుపక్కల స్థలాన్ని ఆక్రమించి షాపులు నిర్మించారని, వీటిని తొలగించాలని ఆయన కోరారు. నాట్యమండలి ఉపాధ్యక్షుడు వేమా శ్రీనివాసరావు, కండే శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి యాదాల రాజశేఖర్, యు.ప్రభుదాసు, మల్లిఖార్జున, పాలేటి కోటేశ్వరరావు, గడ్డం కృష్ణయ్య, బత్తుల శేషయ్య పాల్గొన్నారు.



మిల్లులో ఉన్న బియ్యాన్ని పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ, అధికారులు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- జేసీ గోపాలకృష్ణ

మద్దిపాడు, మార్చి 10(ఆంధ్రజ్యోతి):రైస్ మిల్లర్లు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ హెచ్చరించారు. సోమవారం మురళీకృష్ణ రా బాయిల్డ్ రైస్ మిల్లును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేషన్ బియ్యం కొనుగోలు చేస్తే కేసు నమోదు చేస్తామని, ప్రభుత్వ నిబంధనల మేరకే బాయిల్డ్ రైస్‌ను ఉత్పత్తి చేయాలని అన్నారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన వడ్ల ద్వారా బియ్యాన్ని తయారు చేయాలని, అవకతవకలు జరిగితే చర్యలు తప్పవని అన్నారు. ప్రభుత్వానికి కావాల్సిన లెవీ బియ్యాన్ని సరఫరా చేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో మద్దిపాడు తహసీల్దార్ సుజన్ కుమార్, ఆర్ఐ రమణయ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.



బ్రిడ్జిని పరిశీలిస్తున్న సీపీఎం నగర కమిటీ నాయకులు

కాలనీల్లో సీపీఎం ప్రజా చైతన్య యాత్ర

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రమైన ఒంగోలు పలు కాలనీల్లో ప్రజాచైతన్య యాత్రను నిర్వహించారు. కేశవరాజుకుంట, చినమల్లేశ్వర కాలనీ, ఉదయంకాలనీ, బలరాం కాలనీ, మిలటరీ కాలనీ, పొనుగుపాటి కాలనీ, భరత్‌కాలనీ, ఎన్‌టీఆర్ కాలనీ, కరుణా కాలనీ ప్రాంతాల్లో పర్యటించి స్థానికులను అడిగి సమస్యలు తెసుకున్నారు. ఈసందర్భంగా కరుణాకాలనీలో సామాజిక భవనం నిర్మించాలని ధర్నా నిర్వహించగా మోటూరి ఉదయంకాలనీలో పెరిగిన కరెంటు చార్జీల బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ కాలనీల్లో అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి. రమేష్, తంబి శ్రీనివాసరావు, టి. మహేష్, హుస్సేన్, కంకణాల రమాదేవి, కల్పన, జి. ఆదిలక్ష్మి, వినోద్, సురేష్, విజయమ్మ, గోపి తదితరులు ఉన్నారు.



డీఎంహెచ్‌వోకు సమస్యలను వివరిస్తున్న ఏపీ తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ నాయకులు

వైద్య శాఖలో పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్రఅధ్యక్షుడు పీవీ రవి కోరారు. సోమవారం కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లును యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు కలిసి తమ సమస్యలను విన్నవించారు. 40 రకాల యాప్‌లతో ఉద్యోగులకు పనిభారం ఎక్కువై అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖలో ఉన్న ఏఎన్‌ఎంలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, అందువల్ల వారి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సచివాలయ ఏఎన్‌ఎంలు వైద్య ఆరోగ్యశాఖ పనులే కాకుండా పీ4 సర్వే, వర్క్ ఫ్రం హోంలాంటి ఎంప్లాయ్ మొబైల్ యాప్ అప్లికేషన్‌లో ఉన్న 9 రకాల సర్వేలతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి. ఆదిలక్ష్మి ఉన్నారు.

పొగాకు వేలం ప్రారంభం

- తొలిరోజు ధర రూ.280

సంతనూతలపాడు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేర్నమిట్ట సమీపంలో ఒంగోలు-1 వేలంకేంద్రంలో పొగాకు అమ్మకాలను సోమవారం బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి అద్దంకి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. తొలుత రైతుల సమక్షంలో పూజల అనంతరం నిర్వహించిన వేలంలో పొగాకు కిలో అత్యధిక ధర రూ.280లు పలికింది. మొదటిరోజు చిలంకూరు నుంచి 18 బేళ్లను వేలానికి అనుమంతించారు. ఈసందరర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది ఆక్షన్ సీజన్‌లో వచ్చిన సరాసరి ధర కన్నా ఈసంవత్సరం సరాసరి ధరపెరగాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఆందోళన పడవలసిన అవసరం లేదని, ఆశించిన మేరకు ధరలు లభిస్తాయని బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి అద్దంకి శ్రీధర్‌బాబు భరోసా ఇచ్చారు.



రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్‌బాబుకు ఘన సత్కారం

సోమవారం ఒంగోలు-1 వవేలం కేంద్రంలో రైతులంతా కలిసి బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి అద్దంకి శ్రీధర్ బాబును ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈసందర్భంగా రైతు కమిటీ నాయకులు, ఫ్లోర్ కమిటీ నాయకులు సూరం గురవారెడ్డి, అళ్ల సుబ్బారావులు మాట్లాడుతూ బోర్డు ఈడీగా పనిచేసిన అద్దంకి శ్రీధర్‌బాబు ఏడేళ్ల కాలంలో చేసిన సేవలు మరువలేనివని అన్నారు. అనంతరం రూ.4కోట్ల విలువగల రైతు సంక్షేమభవనం, బోర్డు కార్యాలయాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆక్షన్ సూపరింటెండెంట్ రవికాంత్, బోర్డు మేనేజర్ లక్ష్మణరావు, డైరెక్టర్ వరప్రసాదరావు, మాజీ డైరెక్టర్ బద్రిరెడ్డి, ఐటీసీ లీఫ్ మేనేజర్ శివకుమార్, జీపీఐ ప్రతినిధులు ప్రభాకర్,శ్రీనివాసుల రెడ్డి, రైతు కమిటీ నాయకులు పాల్గొన్నారు.



వేలాన్ని పరిశీలిస్తున్న పొగాకు బోర్డు ఈడీ శ్రీధర్‌బాబు, రైతునాయకులు

కొండపిలో వేలాన్ని పరిశీలించిన బోర్డు చైర్మన్

కొండపి : కొండపి వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. అత్యధిక ధర కిలోకు రూ.280 లభించింది. అత్యల్ప ధర రూ.278 దక్కింది. తొలిరోజు ఆనవాయితీగా జువ్విగుంట గ్రామానికి చెందిన రైతులు ఎంపిక చేసిన 18 ఎఫ్-1 రకం బేళ్లను వేలానికి ఉంచగా అన్నింటినీ వ్యాపారులు కొనుగోలు చేశారు. వేలాన్ని బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో సమావేశమై పలు సూచనలు ఇచ్చారు. పరిస్థితులకు అనుగుణంగా పొగాకును వేలం కేంద్రంలో అమ్ముకోవాలన్నారు.

కొండపి వేలం కేంద్రం పరిధిలో రైతులు పదేళ్ల క్రితం 10 మిలియన్ కిలోల పంట పండించేవారన్నారు. గడచిన ఏడాది 17 మిలియన్ కిలోల ఉత్పత్తి జరిగిందన్నారు. ప్రస్తుత సీజన్‌లో దాదాపు 19 మిలియన్ కేజీల పొగాకును రైతులు పండించారని అంచనా వేశామని చెప్పారు. కార్యక్రమంలో బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య, వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్, రైతు నాయకులు పోటు శ్రీనివాసమురళి (పెదబాబు), నాగినేని భాస్కర్, కొల్లూరి హరిబాబు, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, నన్నూరి సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

దాడిచేసిన వారిని అరెస్టు చేయాలి

- కలెక్టరేట్ ఎదుట వీహెచ్‌పీ ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీహెచ్‌పీ నేతలు, కార్యకర్తలు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : రాయచోటిలో వీరభద్రస్వామి ఊరేగింపుపై దాడి చేసిన అన్యమతస్థులను అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి ఈమని బలరాం డిమాండ్ చేశారు. ఊరేగింపుపై దాడి చేయడాన్ని నిరసిస్తూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. వీరభద్రస్వామి వారోత్సవాల్లో భాగంగా ఊరేగింపుపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేయాల్సిన ఏఎస్ఐ అందుకు భిన్నంగా హిందువులపై అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గంగా ఉందన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు తూనుగుంట మల్లికార్జునరావు, ఇనమనమెళ్లూరి సీతారామయ్య, త్రిపురభైరవానంద స్వామి, పసుమర్తి వెంకటేశ్వర్లు, సాధు శ్రీనివాస్ గుప్తా, వేమూరి చక్రధర పెరుమాళ్ల, పబ్బిశెట్టి హరిబాబు, ఏడుకొండలు, వెంకటేశ్వరరెడ్డి, చంద్రశేఖర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి యోగయ్య యాదవ్, పీవీ కృష్ణారెడ్డి, బొద్దులూరి ఆంజనేయులు, విజయరావు, తీగల సత్యవతి, తానికొండ సురేష్, ధనిశెట్టి రాము తదితరులు ఉన్నారు.

సావిత్రిబాయి ఫూలే సేవలు చిరస్మరణీయం



ఒంగోలులో సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న నేతలు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీనవర్గాలకు విద్యాభ్యాసం నేర్పిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని ద్రావిడదేశం అధ్యక్షుడు కృష్ణారావు అన్నారు. సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఒంగోలులోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అడకాస్వాములు, పెరుమామిళ్ల గోపికృష్ణ, మల్లెబోయిన రాజు, సాదం నరసింహారావు, కాలేషా, చిరంజీవి ఉన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో..

ఒంగోలు కల్చరల్ : సంఘ సంస్కర్త, తొలి ఉపాధ్యాయిని సావిత్రి బాయి పూలే 128వ జయంతిని స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా సావిత్రి బాయ్ పూలే చిత్రపటానికి సిబ్బంది, పాఠకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

సావిత్రిబాయిపూలేని ఆదర్శంగా తీసుకోవాలి

సంతనూతలపాడు : పేద వర్గాల విద్యాసేవకు కట్టుబడిన మాతృమూర్తి సావిత్రిబాయిపూలేని ఆదర్శంగా తీసుకోవాలని సంతనూతలపాడు ప్రైమరీహెల్త్‌సెంటర్ వైద్యురాలు డాక్టర్ పమిడిహరిణి అన్నారు. సోమవారం స్థానిక ప్రైమరీహెల్త్‌సెంటర్‌లో జరిగిన కార్యక్రమానికి సీహెచ్‌వో ఆర్.ప్రసాద్ వ్యవహరించారు. ఈసందర్భంగా డాక్టర్ హరిణిని ఘనంగా సత్కరించారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి

చీమకుర్తి : నిమ్నవర్గాల అభ్యున్నతికి కృషిచేసిన తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలేకు బీసీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘననివాళులు అర్పించారు.పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంఘనాయకులు సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

రాష్ట్ర యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

- వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మయ్య మాదిగ డిమాండ్

ఒంగోలు, కార్పొరేషన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ జిల్లాల వారీగా అమలవడం వల్ల తీరని అన్యాయం జరుగుతుందని, రాష్ట్ర యూనిట్‌గానే అమలు చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ డిమాండ్‌చేశారు. సోమవారం ఒంగోలులోని అంబేడ్కర్ భవనంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1996లో చంద్రబాబు రామచంద్రరాజు కమిషన్ ఏర్పాటు చేయగా, 2007లో వేసి ఉషా మెహ్రా కమిషన్ జనాభా దామాషా ప్రకారం ఎస్సీ వర్గీకరణ జరగాలని కేంద్రానికి నివేదిక సమర్పించిందన్నారు. ప్రస్తుతం ఎస్సీ వర్గీకరణ రాష్ట్రాలే అమలు చేసుకోవచ్చని గత ఏడాది ఆగస్టు 1న సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఏపీలో నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ కూడా జనాభా దామాషా ప్రకారమే వర్గీకరణ చేయాలని వినతి పత్రాలు అందించామన్నారు. అయితే నేడు జిల్లా యూనిట్‌గా వర్గీకరణ చేయాలని చూస్తున్నారని, ఇది రాజ్యాంగంలోని 371-డి ఆర్టికల్‌ను ఉల్లంఘనే అవుతుందని అన్నారు. ఏపీలో మాల, మాదిగల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ ఫలాలు దక్కాలని కోరారు. జిల్లాల యూనిట్ గా కాకుండా రాష్ట్ర యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ చేయాలని బ్రహ్మయ్య కోరారు. మీడియా సమావేశంలో జిల్లా అధ్యక్షులు రావినూతల కోటి, ముప్పవరపు గోపి, పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాళ్లపాలెం రోడ్డులో పూడికతీత

కొండపి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : కొండపి పంచాయతీ పరిధి జాళ్లపాలెం రోడ్డులోని సైడు కాల్వల్లో పూడిక తీత పనులను పంచాయతీ కార్యదర్శి ఉన్నం రామ్మోహన్ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టారు. జేసీబీతో సైడు కాల్వల్లో పూడిక తీయించారు. స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో మురుగునీరు లేకుండా చర్యలు తీసుకున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలలో నిర్లక్ష్యం

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యాదీవెన విడుదలలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి విమర్శించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫీజుల విషయమై ఈనెల 12వతేదీన ఒంగోలులో జరిగే యువత పోరు ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన కోరారు. జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, వైసీపీ ఒంగో లు నియోజకవర్గ ఇన్‌చార్జీ చుండూరి రవిబాబు, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న నాయకులు బ్రహ్మానందరెడ్డి,ప్రసాద్ ఉన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

టంగుటూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొణిజేడు గిరిజనులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా వారు సోమవారం కొణిజేడులో పర్యటించారు. గిరిజనులు తమ సమస్యలను వారి వద్ద ఏకరువు పెట్టారు.



ప్రజాసమస్యల వేదికలో అర్జీదారుల సమస్యలను వింటున్న కలెక్టర్ అన్సారియా

అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్‌అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజలు పలు సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు. ఆయా అంశాలపై జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ త్వరగా పరిష్కరించాలన్నారు. ప్రతి అర్జీని ఆడిటింగ్ చేయడం జరుగుతుందన్నారు. అర్జీల పరిష్కారంలో క్షేత్ర స్థాయిలో అధికారులు సిబ్బందిని సమన్వయం చేసుకొని సమాధానాలు ఇవ్వాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కార ప్రగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని తెలిపారు. అర్జీలు రీఓపెన్ అయినట్లయితే వాటికి గల కారణాలను వివరించాల్సి ఉంటుందన్నారు.

గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజా సమస్యల వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు 237 వినతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, డీఆర్వో చిన ఒబులేషుతో పాటు ప లుశాఖల అధికారులు ఉన్నారు.

ఒంగోలు రూరల్ పంచాయతీ మాజీ సర్పంచ్ మృతి



చిరుకూరి పాపయ్యచౌదరి (ఫైల్)

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు రూరల్ పంచాయతీ మొట్టమొదటి, చివరి సర్పంచ్‌గా పనిచేసిన ప్రముఖ రాజకీయనాయకుడు చిరుకూరి పాపయ్యచౌదరి ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆయన 1981 నుంచి 1991 వరకు పంచాయతీ సర్పంచ్‌గా పనిచేశారు. ఆయన కాలంలో గుంటూరు రోడ్డు నుంచి కర్నూలు రోడ్డు, శ్రీనివాస కాలనీ అభివృద్ధి చేయడంలో ప్రముఖ పాత్ర పోషించారు. కర్నూలు రోడ్డుకు మంచినీటి సరఫరా పైపులైన్ ఏర్పాటు కూడా చేయించారు. సోమవారం పాపయ్యచౌదరి భౌతికకాయానికి పలువురు రాజకీయ ప్రముఖులు నివాళులు అర్పించారు. మంగళవారం మధ్యాహ్నం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని గజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ రాజారావు కోరారు. స్థానిక వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం డీఎంహెచ్‌వో డాక్టర్ టి. వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయనను శాలువతో సత్కరించారు. కోరారు.

ముఖాముఖి

లైబ్రరీలో అన్ని రకాల పుస్తకాలు

ఎస్.ఎం.ప్రసన్నకుమారి, గ్రంథపాలకురాలు, గిద్దలూరు



ప్రశ్న : లైబ్రరీకి వచ్చే పాఠకుల సంఖ్య ఎందుకు తగ్గింది ?

జవాబు : రెండేళ్ల క్రితం వరకు నిత్యం 100 నుంచి 200 మంది పాఠకులు వచ్చేవారు. ఇప్పుడు వారపత్రికలు, మాస పత్రికలు, ఇంగ్లీషు దినపత్రికలు స్థానికంగా అందుబాటులో లేకపోవడం వలన పాఠకుల సంఖ్య రోజుకు 30 మందికి మించడం లేదు.

ప్ర : లైబ్రరీలో అన్నిరకాల పుస్తకాలు ఉన్నాయా ?

జ : 16వేల పుస్తకాలు ఉన్నాయి. విద్యార్థులకు కాంపిటేషన్ పుస్తకాలు, చిన్నపిల్లల కథల పుస్తకాలు, అన్ని రకాల నవలలు ఉన్నాయి.

ప్ర : బుక్ డిపాజిటర్స్ ఎంతమంది ఉన్నారు ?

జ : ఇంటికి పుస్తకాలను తీసుకుని వెళ్లి మళ్ళీ తెచ్చి ఇచ్చే వారి సంఖ్య 600 దాకా ఉంది. ఇందులో 300 మంది తరచూ పుస్తకాలను తీసుకెళుతుంటారు.

ప్ర : చదవడం మాకు ఇష్టం కార్యక్రమం జరుగుతుందా ?

జ : ప్రతి ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రత్యేకంగా చదవడం మాకు ఇష్టం కార్యక్రమం ప్రతి లైబ్రరీలో నిర్వహిస్తున్నాం. అన్ని పాఠశాలలకు వెళ్లి విద్యార్థులను రావాలని కోరాం. కానీ హోంవర్కు ఉందని, ఆడుకోవాలని తదితర కారణాలు చెప్పి విద్యార్థులు రావడం లేదు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చొరవ తీసుకుని ఆదివారం తమ పిల్లలను లైబ్రరీలకు పంపితే అదనపు విజ్ఞానం పొందవచ్చు.

మాజీ సర్పంచ్ గుండెపోటుతో మృతి

పెద్దదోర్నాల, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంటవానిపల్లెకి చెందిన మాజీ సర్పంచి గోనావత్ కాశీనాయక్(62) గుండెపోటుతో సోమవారం మృతిచెందారు. ఈయన 2014-19వ సంవత్సరంలో గంటవానిపల్లె గ్రామ సర్పంచిగా పనిచేశారు. మరణ వార్త తెలుసుకున్న మండల వైసీపీ కన్వీనర్ ఘంటా వెంకట రమణారెడ్డి, మాజీ ఎంపీపీ జీసీహెచ్ ధర్మానాయక్, ప్రస్తుత సర్పంచి భర్త వెంకటేశ్వరరెడ్డి, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గాలయ్య నాయక్, వైసీపీ నాయకులు లాలూనాయక్, తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

చోరీకి గురైన ఆటో గుర్తింపు

గిద్దలూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాచర్లలోని కస్తూరిబా విద్యాలయం వద్ద ఆదివారం చోరీకి గురైన ఆటోను గుర్తించినట్లు ఎస్సై కోటేశ్వరరావు చెప్పారు. విద్యాలయం వద్ద ఉన్న ఆటోను కంభానికి చెందిన ఓ వ్యక్తి దొంగతనం చేసి తీసుకుని వెళుతుండగా సాంకేతిక పరిజ్ఞానంతో అనంపల్లి వద్ద ఆటోను స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

20న ఉచిత కంటి పరీక్షలు

కంభం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల శాంతిరాం సూపర్ స్పెషాలిటి వారిచే ఈనెల 20వ తేదీన కంభంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు పింఛనర్ల సంఘం అధ్యక్షుడు షేక్ మహమ్మద్ ఇబ్రహీం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9గంటల నుంచి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో కంటి పరీక్షలు నిర్వహిస్తారని, శుక్లాలు ఉంటే అదే రోజు ఉచితంగా వాహనంలో నంద్యాల శాంతిరామ్ ఆసుపత్రికి తీసుకెళ్లి ఆపరేషన్లు చేసి మళ్లీ కంభంలో వదిలిపెడతారని వివరించారు. కంభం, బేస్తవారపేట, అర్ధవీడు విశ్రాంత ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు.

15 నుంచి జాతీయ స్థాయి బండలాగుడు పోటీలు

గిద్దలూరు టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నరవ గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా జాతీయ స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 15వ తేదీ ఉదయం 7గంటలకు రెండు పండ్ల విభాగం పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విజేతలైన యడ్ల యజమానులకు వరుసగా రూ.25వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.7వేలు, రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు ఇవ్వనున్నట్లు వివరించారు. అలాగే సీనియర్ విభాగానికి 16వ తేదీ ఉదయం 7గంటలకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలైన ఎడ్ల యజమానులకు బహుమతులు వరుసగా 1,11,111 రూపాయలు, 77,777 రూపాయలు, 55,555 రూపాయలు, 33,333 రూపాయలు, 22,222 రూపాయలు, 11,111 రూపాయలు గెలు అందజేయనున్నట్లు వివరించారు. వివరాలకు 9866432566, 9959138036, 9177269331 సంప్రదించాలని సూచించారు.

పొదిలిలో పొగాకు వేలం ప్రారంభం

గరిష్ఠ ధర రూ.280

పాల్గొన్న తొమ్మిది కంపెనీలు

పొదిలి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పొదిలి వేలం కేంద్రంలో సోమవారం పొగాకు అమ్మకాలు ప్రారంభమయ్యాయి. గుంటూరు, పొదిలి ఏఎస్‌లు సురేఖ, గిరిరాజకుమార్‌లు వేలాన్ని ప్రారంభించారు. అనంతరం సురేఖ మాట్లాడుతూ పొగాకుకు మంచి ధరలు రావడానికి ముఖ్యకారణం గ్రేడింగ్‌లో మెళకువలు పాటించాలని చెప్పారు. పంట పండించడం ఎంత ముఖ్యమో దాన్ని జాగ్రత్త చేసి అమ్మడం కూడా అంతే ముఖ్యమన్నారు. గిరిరాజ్‌కుమార్ మాట్లాడుతూ పొగాకు బేళ్లలో అన్యపదార్థాలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. అనంతరం పూజలు చేసి కొబ్బరికాయ కొట్టి కాటాలు ప్రారంభించారు. అనంతరం వేలానికి వచ్చిన 27 బేళ్లను అమ్మకంలో ఉంచారు. గరిష్ఠంగా కిలో పొగాకు రూ.280 పలికింది. మొత్తం 9 కంపెనీల చెందిన ప్రతినిధులు వేలంలో పాల్గొన్నారు. అందులో ఆరు కంపెనీలు కొనుగోలు చేశారు. వేలం అనుకున్న సమయం కంటే 5 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభించారు. బయ్యర్ల చేతిలో ఉన్న ఈవేలం నిర్వహించే పరికరాలు హ్యాంగ్ అవడంతో సుమారుగా 5 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది.



పొగాకు వేలం నిర్వహిస్తున్న ఏఎస్‌లు సురేఖ, గిరిరాజ్‌కుమార్

మార్కాపురం పట్టణాభివృద్ధికి నిధులు కేటాయించండి

మున్సిపల్ మంత్రి నారాయణను తిరుమలలో కలిసిన ఎమ్మెల్యే కందుల

మార్కాపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పురపాలక సంఘం అభివృద్ధిలో ఎంతో వెనుకబడి ఉన్నందున తగినన్ని నిధులు కేటాయించి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సోమవారం మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణను కోరారు. కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల దైవదర్శనానికి వెళ్లిన ఎమ్మెల్యే కందుల అక్కడ దర్శనానికి వచ్చిన మంత్రి నారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలు వారి మధ్య చర్చకు వచ్చాయి. ప్రధానంగా సీసీ రహదారులు, మురుగు నీటి డ్రెయిన్ల కోసం ప్రతిపాదనలు పంపామని, నిధులు కేటాయిస్తే వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే కోరారు. మార్కాపురం మున్సిపాలిటీ అభివృద్ధికి తప్పకుండా తగినన్ని నిధులు కేటాయిస్తానని మంత్రి నారాయణ హామీ ఇచ్చారని ఆయన చెప్పారు.



మంత్రి నారాయణతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల

చలో పిఠాపురం పోస్టర్ల ఆవిష్కరణ

మార్కాపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ ఆవిర్భావాన్ని పురస్కరించుకుని ఈ నెల 14వ తేదీన పిఠాపురంలో జరగనున్న కార్యక్రమాన్ని వేలాదిగా తరలివెళ్లి జయప్రదం చేయాలని పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్ కోరారు. స్థానిక కంభం రోడ్డులోని పార్టీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం చలో పిఠాపురం వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 14న పార్టీ ఆవిర్భావ సభ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు భారీస్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ రాంసింగ్, జిల్లా కార్యదర్శి సిరిగిరి శ్రీనివాసరావు, చేతుల శ్రీనివాసులు, విజయారావు నరసింహారావు, మట్టం శ్రీను, మార్కెట్ శ్రీను, పిన్నెబోయిన లక్ష్మీరాజ్యం పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి కాశీనాథ్

హిందువులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

మార్కాపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): హిందువులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని వీహెచ్‌పీ, హిందూ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ఉదయం నిరసన కార్యక్రమం చేపట్టారు.

ఈ సందర్భంగా వీహెచ్‌పీ జిల్లా నాయకులు ఐ.వీరారావు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా రాయచోటిలో వీరభద్రస్వామి పార్వేట ఉత్సవం జరిగిందన్నారు. ఈ క్రమంలో పార్వేట ఉత్సవం ఎలా చేస్తారంటూ కొందరు ముస్లిం మతస్థులు హిందువులపై దాడి చేశారన్నారు. దాడి చేసిన వారిని తప్పకుండా పోలీసులు అరెస్ట్ చేసి శిక్షించాలని చెప్పారు.

అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో శాసనాల సరోజిని, పీవీ కృష్ణారావు, వాసు, మద్దెల లక్ష్మి, వాసవి ప్రియ తదితరులు పాల్గొన్నారు.



నిరసన చేపట్టిన వీహెచ్‌పీ, హిందూ సంఘాల నేతలు

సావిత్రీబాయి పూలేకు నివాళులు

గిద్దలూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖాగ్రంథాలయం ఆవరణలో యువ ప్రగతి పథం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పూలె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, యువప్రగతి పథం సంస్థ ప్రతినిధులు వేణుగోపాల్, సిద్ధయ్య, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వెనుకబడిన మహిళల జీవితాల్లో వెలుగులు నింపిన సంఘ సంస్కర్త

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సంఘ సంస్కర్త, తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 128 వర్ధంతి కార్యక్రమాలు సోమవారం ఎర్రగొండపాలెంలో ఘనంగా జరిగాయి. స్వామి వివేకానంద యువజన సేవా సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. యువజన సేవా సమితి అధ్యక్షుడు పోసాని శ్రీరాములు మాట్లాడుతూ దేశంలో వెనుకబడిన వర్గాల మహిళల జీవితాల్లో విద్య అనే వెలుగులు నింపారన్నారు. ఆమె సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.



నివాళులు అర్పిస్తున్న వివిధ వర్గాల ప్రతినిధులు

వాసవీమాత ఆలయంలో 25 వసంతాల వేడుకలు

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయం ప్రతిష్ఠ జరిగి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆలయంలో సోమవారం పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో విగ్రహాల దాతలు గోళ్ల వీర వెంకట సుబ్బారావు, గోళ్ల సుబ్బారావు, గోళ్ల సుబ్రమణ్యం కుటుంబ సభ్యులతో కలసి అమ్మవారికి ఆలయ అర్చకులు రెంటచింతల శ్రీరామ చంద్రమూర్తి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సూరే ప్రసాద్, కొత్తమాసు క్రిష్ణయ్య, సూరే శ్రీనివాసులు పాల్గొన్నారు.



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, విగ్రహాల దాతలు

వైభవంగా కల్యాణ మహోత్సవం

గిద్దలూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నరవ గ్రామంలో కొండపై వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం తెల్లవారుజామున స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. సూర్యవాహనం, సాయంత్రం శేషవాహనంలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

దిగజారిన మిర్చి ధర

» లబోదిబోమంటున్న రైతులు

» ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

చినగంజాం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మిర్చి ధర రోజురోజుకూ దిగజారుతుండడంతో మిర్చి రైతులు లబోదిబోమంటున్నారు. గత ఏడాది మిరప కాయలకి మంచి ధర వచ్చి రైతులు లాభాలను ఆర్జించారు. ఈ ఏడాది కూడా లాభాలు ఆర్జించవచ్చని ఆశించిన రైతులకు భంగపాటు ఎదురైంది. గతంలో కంటే మిర్చి సాగు అధికమైంది.

మండలంలోని మోటుపల్లి, చినగంజాం, కడవకుదురు, రాజుబంగారుపాలెం, పెదగంజాం తదితర గ్రామాల్లోని ఇసుక భూముల్లో రైతులు మిర్చి పంటను సాగు చేస్తున్నారు. గతంలో లాభాలు ఆర్జించిన రైతులను చూసి మనకు కూడా బాగా లాభాలు వస్తాయని ఆశించి వేరుశనగ వేసే భూమిని సైతం మిర్చి తోటలు వేశారు. హైబ్రిడ్ మిర్చి రకం కావడంతో దిగుమతులు కూడా ఆశాజనకంగానే ఉన్నాయి. అంగట్లో అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు మిర్చి రైతుల పరిస్థితి మారింది. దిగుబడులు బాగా ఉన్నా రేటు సక్రమంగా లేకపోవడంతో రైతుల పరిస్థితి దీనంగా మారింది. గతంలో కిలో ధర రూ.20 ఉండగా నేడు కిలో రూ.11లకే పడిపోవడంతో కోత కూలికి కూడా రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక మిరప మొక్క ఖరీదు రూపాయన్నర ఉంది. కౌలు, మొక్కలు వాటి సంరక్షణ, క్రిమిసంహారాలు, కూలి రేట్లు తడిచి మోపుడు అవుతున్నాయిని, పంట చేతికి వచ్చే సరికి ధర తగ్గుదల వచ్చిందని రైతులు వాపోతున్నారు. కొనబోతే కొరివి, అమ్మబోతే అడవిలా రైతుల పరిస్థితి దాపురించిందని రైతులు అంటున్నారు. ఎకరానికి సాగు ఖర్చులు రూ.70-80వేల వరకు అవుతున్నాయని, మార్కెటులో రేటు లేకపోవడంతో, ఇలాంటి పరిస్థితి ఉండడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. మిర్చి రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



కడవకుదురు ప్రాంతంలో సాగు చేస్తున్న మిర్చి తోటలు

అవీఇవీ

వైశ్యులు సమాజ సేవలో పాల్గొనడం అభినందనీయం



ఐతా కృష్ణను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

కంభం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఆర్యవైశ్యులు అన్ని రకాల వ్యాపార రంగాలలో ముందుండడమే కాక తాము సంపాదించిన దానిలో కొంతభాగాన్ని సమాజ సేవకు ఉపయోగించడం అభినందనీయమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి చెప్పారు. ఆదివారంరాత్రి కంభం మండల ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ వైశ్యులు క్రమశిక్షణతో సమాజానికి ఉపయోగపడేందుకు ముందుంటారన్నారు. తొలుత ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా ఎన్నికైన ఐతా కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా సోమిశెట్టి రాజా, కోశాధికారిగా కటకం ప్రదీప్‌కుమార్, మిగిలిన సభ్యులచేత ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డొండి రాకేష్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో అఖిల శ్రీశైల, కాణిపాక నిత్య అన్నదాన సత్రాల అధ్యక్షులు గోళ్ల సుబ్బరత్నం, సలహా సంఘం సభ్యులు ముత్యాల కిశోర్ పాల్గొన్నారు.

టెన్నిస్ విజేత కోటయ్యగౌడ్



ట్రోఫీ అందుకుంటున్న కోటయ్యగౌడ్

గిద్దలూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : చిలకలూరిపేటలో సీవీఆర్ క్లబ్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న ఇన్విటేషన్ టెన్నిస్ టోర్నమెంటులో గిద్దలూరుకు చెందిన క్రీడాకారుడు కంచర్ల కోటయ్య గౌడ్ విజేతగా నిలిచారు. 65 ఏళ్ల వయస్సు గ్రూపులో కనిగిరికి చెందిన మనోహర్‌రెడ్డితో కలిసి కోటయ్య గౌడ్ డబుల్స్ విభాగంలో పోటీపడి 3 రౌండ్లలో విజయం సాధించి ఫైనల్స్‌కు వచ్చారు. ఫైనల్ మ్యాచ్‌లో హనుమంతరావు, రామక్రిష్ణ జట్టును 6-2 స్కోరు తేడాతో ఓడించి విన్నర్స్‌గా నిలిచారు. విన్నర్‌గా నిలిచిన కోటయ్యగౌడ్‌ను స్థానిక టెన్నిస్ క్లబ్‌లో జిల్లా లాన్‌టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జి.కె.మోహన్‌రెడ్డి, రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సిహెచ్.రంగారెడ్డి, క్లబ్ కోశాధికారి త్రిమూర్తిరెడ్డి అభినందించారు.

యువత పోరును జయప్రదం చేయాలి

మార్కాపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): యువత భవిష్యత్తు కోసం ఈ నెల 12వ తేదీన వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైసీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు పిలుపునిచ్చారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని వైసీపీ పట్టణ కార్యాలయంలో సోమవారం యువత పోరు పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర నాయకులు, ముస్లిం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మీర్జా షంషీర్‌అలీబేగ్, మాజీ కౌన్సిలర్ పఠాన్ అమీరుల్లాఖాన్, మందటి మహేష్‌రెడ్డి, చదలవాడ రామిరెడ్డి, పార్టీ సోషల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

దాడిలో దంపతులకు గాయాలు

ముండ్లమూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కెల్లంపల్లి పంచాయతీ పలుకురాళ్ళ తండా గ్రామానికి చెందిన పాలితె పెదసుందర్ నాయక్, అతని సోదరులు భూ వివాద విషయమై ఆదివారం ఘర్షణ పడ్డారు. పెద సుందర్‌నాయక్‌ను, అతని భార్య సామ్రాజ్యంను వెంకటరావు నాయక్, పూర్ణాబాయి, మల్లినాయక్, వాసు నాయక్‌లు మూకుమ్మడిగా కర్రలతో దాడి చేశారు. దీంతో దంపతులు పెద సుందర నాయక్, సామ్రాజ్యంలకు తీవ్ర గాయాలు కావటంతో చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. వారి ఫిర్యాదు మేరకు ముండ్లమూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

వైభవంగా ఉరుసు మహోత్సవం

గిద్దలూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపేట గ్రామంలోని శ్రీహజరత్ జమాల్ వలి దర్గాలో సోమవారం ఉరుసు మహోత్సవం వైభవంగా జరిగింది. ముస్లింలు దర్గాలో ప్రార్థనలు చేశారు. దర్గా పీఠాధిపతి జమాల్ వలి, అంజుమన్ కమిటీ చైర్మన్ షేక్ నాయబ్‌రసూల్, వివిధ దర్గాల పెద్దలు ఉరుసు మహోత్సవంలో పాల్గొన్నారు.

రామాలయంలో హుండీల చోరీ

పామూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనిమెర్ల గ్రామంలోని రామాలయంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రెండు హుండీలను ఎత్తు కెళ్లారని గ్రామస్థులు తెలిపారు. ఈ విషయంపై పామూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సోమవారం ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.లక్షా 25వేలు

సీఎస్‌పురం(పామూరు), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆదివారం హుండీ ఆదాయం రూ.1,24,925 వచ్చినట్లు ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.57,830, లడ్డు ప్రసాదం అమ్మకం ద్వారా రూ.22,550, అన్న దానానికి విరాళాల ద్వారా రూ.30,029, ఇతర విరాళాల ద్వారా రూ.9వేలు వచ్చినట్లు తెలిపారు. కాగా, అన్నదానానికి బెంగుళూరుకు చెందిన ఎస్.రామచంద్ర, పుష్ప దంపతులు రూ.10 వేలు అందజేసినట్టు ఈవో తెలిపారు.

మారిన పీసీపల్లి రూపురేఖలు

- గత వైసీపీ పాలనలో అధ్వానంగా రోడ్లు
- కూటమి ప్రభుత్వంలో సీసీ రోడ్ల నిర్మాణం
- గుంతలతో అవస్థలు పడిన ప్రజలకు తీరిన ఇక్కట్లు



నాడు గుంతలతో ఉన్న ప్రధాన రోడ్డు



నేడు సిమెంట్ రోడ్డుగా మారిన పీసీపల్లి ప్రధానరోడ్డు

పీసీపల్లి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో పీసీపల్లి మండలం రూపురేఖలు మారుతున్నాయి. ఇందులో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ప్రధానపాత్ర వహిస్తున్నారు.గత వైసీపీ పాలనలో మండల కేంద్రమైన పీసీపల్లి ప్రధాన రహదారి గుంతలమయంగా ఉంది. బ్యాంకు సెంటరు నుండి ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ప్రధానరోడ్డులో మూరకో గుంత అడుగుకో గొయ్యి ఏర్పడి రోడ్డు అధ్వానంగా ఉండేది. రైతుసేవా కేంద్రం, సచివాలయ భవనం ఉండే ప్రాంగణం పది అడుగుల లోతుకు పైగా గుంతలో నిర్మించడంతో వర్షాకాలంలో కార్యాలయాలకు వెళ్లేందుకు ఉద్యోగులు, ప్రజలు తీవ్రఇబ్బందులు పడేవారు. నాటి వైసీపీ ప్రభుత్వంలో తట్ట మట్టి కూడా పోసిన పాపాన పోలేదు. అధ్వాన రోడ్లు, అపరిశుభ్రతకు మండలకేంద్రమైన పీసీపల్లి కేరాఫ్‌గా ఉండేది.

ఉగ్ర నరసింహారెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక మండల సమావేశంలో పాల్గొనేందుకు పీసీపల్లికి వచ్చారు. ఈక్రమంలో రోడ్ల దుస్థితిని చూశారు. వెంటనే రూ.1.9కోట్ల నిధులు మంజూరు చేసి పీసీపల్లిలో రోడ్లన్నీ సిమెంట్‌రోడ్లుగా వేయించారు. సచివాలయం, రైతుసేవాకేంద్రం ప్రాంగణం వద్ద కూడా గుంతను పూడ్పించి మెయిన్‌రోడ్డు నుంచి కార్యాలయం వరకు సిమెంట్‌రోడ్డును వేయించారు. ఈ అభివృద్ధి పనులు చూస్తున్న మండల ప్రజలు గ్రామాలు అభివృద్ధి చెందా లంటే కూటమి ప్రభుత్వం వల్లే సాధ్యమని పేర్కొం టున్నారు. గత ప్రభుత్వంలో అధ్వాన రోడ్లతో ఇబ్బందులు పడిన ప్రజలు కూటమి ప్రభుత్వంలో రోడ్లు బాగుపడటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నాడు బురదగుంతలో ఉన్న రైతుసేవాకేంద్రం



నేడు రైతుసేవాకేంద్రం వద్ద గుంతను పూడ్చి వేసిన సిమెంట్‌రోడ్డు

అస్తవ్యస్తంగా చేతిపంపుల నిర్వహణ

- మరమ్మతులకు నోచుకోని వైనం
- నీటికోసం ఇబ్బందులు పడుతున్న ప్రజలు

పామూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పామూరు పట్టణంలో చేతి పంపుల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. పంచాయతీ కుళాయిల ద్వారా నీరు సక్రమంగా సరఫరా కాని సమయంలో చేతి పంపులే దిక్కు. అయితే, పలుచోట్ల చేతి పంపుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. గత వైసీపీ ప్రభుత్వం చేతి పంపుల నిర్వహణ గురించి పట్టించుకోకపోవడంతో మరమ్మతులకు గురయ్యాయి. దీంతో ప్రజలు నీటికోసం ఇబ్బందులు పడుతున్నారు.

ఆకులవీధిలోని బావి వద్ద ఉన్న చేతి పంపు మూడేళ్లుగా మరమ్మతులకు గురై నిరుపయోగంగా ఉంది. ఆప్రాంతంలో సుమారుగా 50కు పైగా గృహాలు ఉన్నాయి. వారందరికి పంచాయతి వీధి కుళాయిల ద్వారా మూడు రోజులకొకమారు నీరు సరఫరా అవుతుంది. ఏదైనా అంతరాయం కలిగితే ప్రత్యామ్నాయంలేక డ్రమ్ము నీటిని రూ.100 వెచ్చించి కొనుగోలు చేసుకుంటున్నారు. అలాగే, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంతంలో ఉన్న చేతిపంపు పనిచేయడంలేదు. పామూరు పంచాయతీలో 18 వార్డులు ఉన్నాయి. పట్టణ పరిధిలో 75 నుంచి వంద వరకు చేతి పంపులు ఉండగా, వాటిలో 80 శాతం మరమ్మతులకు గురై నిరుపయోగంగా ఉన్నాయి. వీటి గురించి సంబంధిత అధికారులు పట్టనట్టుగా వ్యవహరిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా అంకాలమ్మవీధి, ఆకులవీధి, దేవాలయం వీధి, తూర్పువీధి, చెన్నకేశవనగర్, సీతరాముని తోట, ఆరే మరాఠ నగర్, తదితర ప్రాంతాల్లో బోర్లు మోరాయించి పనిచేయడం లేదు.

వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడకముందే సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. మరమ్మతులకు గురైన చేతిపంపులను బాగుచేయించి వినియోగంలోకి తీసుకురావల్సిన అవసరం ఉంది.



ఆకులవీధిలో మరమ్మతులకు నోచుకోని చేతి పంపు

నీటి కుంటలతో రైతులకు ప్రయోజనం

తాళ్లూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో ఏర్పాటుచేస్తున్న నీటి కుంటలతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని డ్వామా విజిలెన్స్ అధికారిణి జాన్సీరాణి తెలిపారు. మండలంలోని మల్కాపురం, దోసకాలయపాడు గ్రామాల్లో ఉపాధి పథకం కింద నిర్మిస్తున్న నీటి కుంటల పనులను సోమవారం పరిశీలించారు. రైతులకు ఉపయోగపడే నీటికుంటల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. వీటితో కుంట నిర్మాణాలు జరుగుతున్నాయా, పక్కదారి పడుతున్నాయా అనేది క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పనులు చేస్తున్న ఉపాధి కూలీలతో పనుల విషయమై ప్రశ్నించారు. జిల్లా విజిలెన్స్ పర్యవేక్షకులు వెంకటస్వామి మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టే పనులు రైతులకు, ఉపాధికూలీలకు ఉపయోగ కరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో బి.మురళి, ఈసీ గురుబాబు, టీఏలు కోటేశ్వర రావు, రమేష్, ఫీల్డ్‌అసిస్టెంట్ శ్యాంసన్, సుజాత, తదితరులు పాల్గొన్నారు.



కుంటలను పరిశీలిస్తున్న డ్వామా విజిలెన్స్ అధికారిణి జాన్సీరాణి

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.లక్షా 25వేలు

సీఎస్‌పురం(పామూరు), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని మిట్టపాలెం నారా యణస్వామి ఆదివారం హుండీ ఆదాయం రూ.1,24,925 వచ్చినట్లు ఈవో శ్రీగిరిరాజు నరసింహాబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.57,830, లడ్డు ప్రసాదం అమ్మకం ద్వారా రూ. 22,550, అన్న దానానికి విరాళాల ద్వారా రూ.30,029, ఇతర విరాళాల ద్వారా రూ.9వేలు వచ్చినట్లు తెలిపారు.

కాగా, అన్నదానానికి బెంగుళూరుకు చెందిన ఎస్.రామచంద్ర, పుష్ప దంపతులు రూ.10 వేలు అందజేసినట్లు ఈవో తెలిపారు.

ముఖాముఖి

రీసర్వేతో ప్రభుత్వ భూములకు హద్దుల ఏర్పాటు

కోటంరాజు, మండల సర్వేయర్, ముండ్లమూరు



ప్రశ్న: రీసర్వేతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందా?

జవాబు: ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వేతో రైతులకు మేలు జరుగుతుంది. ప్రధానంగా రికార్డుల్లో భూమి ఎంత ఉందో, పొలంలో కొలతలు తీసి హద్దులు నిర్ణయిస్తున్నాం. ప్రతి రైతుకు ఒక నెంబరు ఇవ్వటం వల్ల భూములు అమ్ముకోవాలన్నా, భాగ పంపకాలు చేసుకోవాలన్నా, రికార్డుల్లో ట్యాంపరింగ్ జరగకుండా, డబుల్ రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేకుండా ఉంటుంది.

ప్ర: రీసర్వేతో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా ఉంటాయా?

జ: భూములను రీసర్వే చేయటం వల్ల ప్రభుత్వ భూములు, పట్టా భూములను గుర్తించవచ్చు. ప్రభుత్వ భూములు గుర్తించి హద్దులు నిర్ణయించడవల్ల ఆక్రమణలకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉంది.

ప్ర: మండలంలో ఇప్పటివరకు ఎన్ని గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశారు?

సర్వేయర్: మండలంలో పది గ్రామాల్లో రీ సర్వే నిర్వహించాం. శంకరాపురం, అవిశనవారిపాలెం, తమ్మలూరు, వేములబండ, కొమ్మవరం, సింగనపాలెం, చింతలపూడి, భట్లపల్లి గ్రామాల్లో చేపట్టాం. 12వేల ఎకరాలను కొలచి హద్దులు నిర్ణయించాం.

ప్ర: రీసర్వేలో విస్తీర్ణం తగ్గుతున్నట్టు రైతులు ఆరోపిస్తున్నారు?

జ: అలాంటిదేమి లేదు. గతంలో అన్నదమ్ముల భాగ పంపకాలు, కొలతలు తేడా ఉండటం వల్ల ప్రస్తుతం రీసర్వే లో కొంత సమస్యలు వచ్చాయి. అలాం టి రైతుల భూములను కొలిరచి సక్రమంగా చేశాం.

భవిత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

దొనకొండ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రత్యేకావసరాల పిల్లల కోసం ఏర్పాటుచేసిన భవితా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహిత విద్య సమన్వయకర్త నాగేంద్రనాయక్, ఏపీవో జాలిరత్నం పేర్కొన్నారు. సోమవారం స్థానిక కేంద్రాన్ని అకస్మిక తనిఖీ చేశారు. కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగ పిల్లల్లో సామర్థ్యాలను పెంచేందుకు భవిత కేంద్రాలు ఎంతగానో తోడ్పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎం.ఉష, సీఆర్‌పీ చెంచిరెడ్డి పాల్గొన్నారు.

హిందువులకు రక్షణ కరువు

దొనకొండ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): హిందువులకు రక్షణ కరువైందని స్థానిక ఆనంద ఆశ్రమ ధర్మకర్త కాకర్ల భైరవానంద స్వామి ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల అన్నమయ్య జిల్లా రాయచోటిలో వీరభద్రస్వామి పారువేట ఊరేగింపుపై ఒకవర్గంవారు రాళ్లతో దాడి చేయటాన్ని ఆయన ఖండించారు. దొనకొండలో సోమవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన నిరసన ర్యాలీలో ఆయన మాట్లాడారు. హిందువుల పండుగల సందర్భంగా నిర్వహించే ఊరేగింపులకు ఆటంకాలు కల్గించటం ఆనవాయితీగా మారిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలి

పామూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పారిశుధ్య కార్మికుల మూడు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే మంజూరు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.మాల్యాద్రి డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై సోమవారం పంచాయతీ కార్యదర్శి జీవీ అరవిందకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా 5వ తేదీనే వేతనాలు మంజూరు చేయాలన్నారు. నిరుపేద కార్మికులకు ఇంటి స్థలాలు, గుర్తింపు కార్డులు, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్మికుల సమస్యలపై ఈనెల 17న నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. .

నిరుపయోగంగా ప్రభుత్వ వాహనం

దొనకొండ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): దొనకొండ మండలానికి ఎస్సీ కార్పొరేషన్ కేటాయించిన వాహనం నాలుగేళ్లుగా ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిరుపయోగంగా దర్శనమిస్తుంది. పారిశుధ్యంపై ప్రచారం నిమిత్తం కేటాయించిన వాహనాన్ని పట్టించుకునే వారులేకపోవడంతో తుప్పుపట్టిపోయింది. పారిశుధ్యం నిమిత్తం ప్రజల్లో అవగాహన కల్గించేలా మంచి ఉద్దేశంతో కేటాయించిన వాహనాన్ని ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉంచారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్య ప్రచార వాహనాన్ని అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

‘మీకోసం’కు అధికారుల గైర్హాజరు

ముండ్లమూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే మీ కోసం కార్యక్రమానికి మండలస్థాయి గైర్హాజరవుతున్నారు. వివిధ సమస్యలపై వచ్చే ప్రజల నుంచి వివిధశాఖల అధికారులు అర్జీలు స్వీకరించి పరిష్కరించాలి. అయితే, ముండ్లమూరు తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన మీ కోసం కార్యక్రమానికి తహసీల్దార్ లక్ష్మీనారాయణ తప్ప మిగతా మండల స్థాయి అధికారులు రావడంలేదు. దీంతో వివిధ సమస్యలపై వచ్చిన అర్జీదారులు సంబంధిత అధికారులు లేకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు. సోమవారం ఉదయం 11.10 గంటలకు మాత్రం మండల వ్యవసాయ అధికారి మాత్రమే వచ్చారు. కొంతమంది అధికారులకు తహసీల్దార్ లక్ష్మీనారాయణ ఫోన్ చేసినా కూడా రాలేదు.

అంగన్‌వాడీల నిరసన

పామూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలు చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని ప్రభుత్వం అడుగడుగునా ఆటంకం పరచడాన్ని నిరసిస్తూ స్థానిక మహ్మీడాడి సెంటర్‌లో అంగన్‌వాడీలు సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.మాల్యాద్రి మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచమని అడిగితే అణగదొక్కుతున్నారన్నారు. గత పాలకులు అనుసరించిన విధానాలనే కూటమి ప్రభుత్వం కొనసాగిస్తే ఐక్య పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజ్యలక్ష్మి, భాగ్యలక్ష్మి, ఫణిదకుమారి, కృష్ణవేణి, కవితవాణి, రామసుబ్బులు, తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌కవేటర్ ద్వారా కాలువల్లో మురుగు తొలగింపు



కాలువల్లోని మురికిని తొలగిస్తున్న కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కార్యదర్శి

పామూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రోడ్లకు ఇరువైపులాఉన్న సైడు కాలువల్లో పేరుకుపోయిన మురికిని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్ ద్వారా తొలగించే కార్యక్రమం సోమవారం చేపట్టారు. సీఎస్‌పురం రోడ్డులో కాలువలపై ఉన్న అడ్డంకులను ఎక్స్‌కవేటర్ ద్వారా తొలగిస్తున్నారు. ఆతర్వాత కాలువలలోని మురుగును తొలగిస్తున్నారు. కాలువల్లో మురుగు పేరుకుపోవడంతో మురుగునీరు ముందుకు కదలడంలేదు. దీంతో దుర్వాసనతోపాటు దోమల ఉధృతి కూడా పెరిగింది. ఈనేపథ్యంలో పంచాయతీ కార్యదర్శి జీవీ అరవింద ఆదేశాలతో కాలువల్లో మురుగు తొలగించే కార్యక్రమం చేపట్టారు.

స్వామివార్లకు వెండి కిరీటాలు బహూకరణ



స్వామి మూలవిరాట్‌కు కిరీటాన్ని అందజేస్తున్న వాకా చినసత్యనారాయణ దంపతులు

సీఎస్ పురం (పామూరు), మార్చి 10 (ఆంధ్ర జ్యోతి): సీఎస్ పురం మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలో నిర్మించిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా వరంగల్ మేనక జ్యూయలర్స్ అధినేత, వెంగన కుంట గ్రామానికి చెందిన వాకా చినసత్యనారాయణ దంపతులు స్వామి మూల విరాట్‌కు వెండి కిరీటం, కర్ణాభరణాలు, ఉత్సవ విగ్రహాలకు వెండికిరీటాలను మూడు కేజీల వెండితో తయారు చేయించి ఆలయ నిర్మాణదాత, విశ్రాంత జాయింట్ కలెక్టర్ పిడుగు బాబురావుకు సోమవారం అందజేశారు. ఈసందర్భంగా దాతలకు స్వామివారి చిత్రపటాన్ని, తీర్థప్రసా దాలను అందజేశారు.

వైభవంగా నరసింహస్వామి వార్షికోత్సవం



స్వామివారికి ఉత్సవ పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు, దేవాలయం చైర్మన్ కేటీఆర్, సభ్యులు

కనిగిరి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణ సమీపంలోని కేటీఆర్ టెక్నో స్కూల్ ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం స్వామి వారి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. హోమాలు, అర్చనలు, కల్యాణం కన్నుల పండువగా జరిగాయి. అనంతరం స్వామి వారికి పల్లకీ ఉత్సవం నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో దేవాలయం చైర్మన్ కుందురు తిరుపతిరెడ్డి, మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి, దేవాలయం కార్యదర్శి కొప్పరపు కోటా వెంకటసత్యనారాయణ, కోశాధికారి ఉప్పాల నరసింహారావు, దేవికి సుబ్రమణ్యం, వాగిచర్ల వెంకటేశ్వర్లు, దూళిపాళ వీరభద్రరావు, శింగరాజు మాలకొండేశ్వరరావు, మారెళ్ళ ఉమాకాంత్, ఉప్పాల సుబ్బారావు, మాలకొండయ్య, హనమంతరావు, ఎంసీకే రెడ్డి, రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం

సీఎస్‌పురం(పామూరు), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఎంఈవో జె.ప్రసాదరావు పేర్కొన్నారు. మండలంలోని నల్లమడుగుల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఓవర్‌హెడ్ ట్యాంకు, ఇతర నిర్మాణాలను పాతూరి వెంకటరెడ్డి, సుశీల దంపతులు రూ.40 వేలు వెచ్చించి నిర్మించగా సోమవారం ఎంఈవో జె.ప్రసాదరావు ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హమ్మద్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అలాగే మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలో గల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థులకు ఎస్‌ఎంసీ చైర్మన్ మూరం మస్తానయ్య ఆధ్వర్యంలో రామసాయి శాండిల్ ప్రాజెక్టు అధినేతలు కేత రాఘవరావు, శ్రీనివాసరావులు వేసవి సెలవులు ముగిసేవరకు ఉచితంగా మజ్జిగ అందజేస్తామని ప్రకటించారు. పాఠశాల పూర్వవిద్యార్థి ముత్యాల నరేష్ రెడ్డి 32 మంది విద్యార్థులకు పరీక్షలు వ్రాసేందుకు సామగ్రిని అందజేశారు. దాతలకు హెచ్‌ఎం నాగినేని తిరుపతయ్య కృతజ్ఞతలు తెలిపారు.

రైతుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

సీఎస్‌పురం(పామూరు), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యల పరిష్కారంలో రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతు సంఘం నాయకుడు యు.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం సీఎస్‌పురం తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పించకుండా జాప్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పామూరి నారాయణ, బి.రత్నం, వై.వెంకట సుబ్బయ్య, ఎస్.అల్లూరయ్య, వెంకటరత్నం పాల్గొన్నారు.

దాడిలో దంపతులకు గాయాలు

ముండ్లమూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కెల్లంపల్లి పంచాయతీ పలుకురాళ్ళ తండా గ్రామానికి చెందిన పాలితె పెదసుందర్ నాయక్, అతని సోదరులు భూ వివాద విషయమై ఆదివారం ఘర్షణ పడ్డారు. పెద సుందర్‌నాయక్‌ను, అతని భార్య సామ్రాజ్యంను వెంకటరావు నాయక్, పూర్ణాబాయి, మల్లినాయక్, వాసు నాయక్‌లు మూకుమ్మడిగా కర్రలతో దాడి చేశారు. దీంతో దంపతులు పెద సుందర నాయక్, సామ్రాజ్యంలకు తీవ్ర గాయాలు కావటంతో చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. వారి ఫిర్యాదు మేరకు ముండ్లమూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

17న పూజసామగ్రి విక్రయానికి వేలం

తాళ్లూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): గుంటిగంగా భవాని ఆలయం వద్ద దేవదాయశాఖ ఆధ్వర్యంలో పూజా సామగ్రి విక్రయించే హక్కు కోసం ఈనెల 17న వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈవో జి.వాసుబాబు సోమవారం తెలిపారు. ఆరోజు గుంటిగంగ ఆలయం వద్ద మధ్యాహ్నం మూడు గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు చెప్పారు. 2025 ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31వరకు గుంటిగంగ సన్నిధిలో కొబ్బరికాయలు, పూజా ద్రవ్యాలు అమ్ముకునేందుకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్‌లో జరుగనున్న గుంటిగంగ తిరుణాళ్ల రెండు రోజులు మినహాయింపు ఉంటుందన్నారు. కొబ్బరికాయలు, పూజా ద్రవ్యాలు అమ్ముకోవడానికి రూ.50 వేలు, కొబ్బరిచిప్పలపోగుకు రూ.25వేలు, తినుబండారాలు, హోటల్ నిర్వహణకు రూ.25వేలు డిపాజిట్ చెల్లించిన తరువాతనే వేలంపాటలో పాల్గొనాలని తెలిపారు.

ప్రకృతిసాగుతో పండించిన కూరగాయల విక్రయం

ముండ్లమూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగులు మందులు లేకుండా ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయల సంతను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, స్థానిక ప్రభుత్వ కార్యాలయం వద్ద సోమవారం ఏర్పాటుచేశారు. ప్రకృతి వ్యవసాయ శాఖలో పనిచేస్తున్నవారు 20 సెంట్ల భూమిలో ఆకు కూరలు, తీగ జాతి, దుంప జాతి కూరగాయలు పండించారు. ఏటీఎం మోడల్ కూరగాయల పంటల సాగులో ఎలాంటి పురుగు మందులు లేకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో తయారు చేసిన కషాయాలు, ఘన జీవామృతం పిచికారి చేసి కూరగాయలను పండించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎక్కువ మంది ఆకు కూరలు కొనుగోలు చేశారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్‌లు ఎం. కోటయ్య, వేణుగోపాల్, డీఎంఎం టి.నరేష్, ఐసీఆర్‌పీలు పేరయ్య చౌదరి, వాణి, చంద్రలీల, అశోక్ కుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

రామాలయంలో హుండీల చోరీ

పామూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనిమెర్ల గ్రామంలోని రామాలయంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రెండు హుండీలను ఎత్తు కెళ్లారని గ్రామస్థులు తెలిపారు. ఈ విషయంపై పామూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సోమవారం ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

పవర్ గ్రిడ్‌ల వద్ద మంటలు వేయవద్దు

ముండ్లమూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో పవర్ గ్రిడ్ లైన్‌ల కింద ఎలాంటి మంటలు వేయవద్దని డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద పవర్ గ్రిడ్ సంస్థల్లో పనిచేసే సిబ్బందితో కలసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఇటీవల కాలంలో కొందరు రైతులు ఎండిపోయిన చెత్తాచెదారం, పత్తి, కంది, మిరప, మినుము, మొక్కజొన్న, చెరుకు, వేరుశనగ, ముళ్ళచెట్లు పవర్ గ్రిడ్ లైన్‌కింద వేసి మంట పెడుతున్నారని శ్రీకాంత్ పేర్కొన్నారు. వీటివల్ల తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ పి.శేషగిరిరావు, వీఆర్‌వోలు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

దర్శి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలోని అద్దంకి రోడ్డులో నెలకొన్న శ్రీకనకదుర్గ అమ్మవారి 13వ వార్షికోత్సవ ఉత్సవాలు సోమవారం వైభవంగా జరిగాయి. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు కోలాటం ప్రదర్శించారు. ఆలయ పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



గుర్రపుడెక్క, తూటుకాడ కమ్మేసిన ఆర్.ఎం డ్రెయిన్

కృష్ణాడెల్టాకు..

- కన్నీటి కష్టాలకు అడ్డుకట్ట వేసేందుకు కూటమి ప్రభుత్వం సంసిద్ధత
- డ్రెయిన్‌ల ఆధునికీకరణకు శ్రీకారం ఇప్పటికే రూ. 680 కోట్లతో ప్రతిపాదనలు
- ఒక్క నల్లమడ డ్రెయిన్‌కే రూ. 480 కోట్లు
- పశ్చిమ డెల్టా సాగునీటి కాల్వలకూ 2007 తర్వాత మళ్లీ ఆధునికీకరణ ఆలోచన
- రూ. 1500 కోట్లతో కొత్త ప్రతిపాదనలకు నీటిపారుదల శాఖ రంగంలోకి..

మళ్లీ మహర్దశ!

ఎటు చూసినా కట్టలు కుంగిపోయి గండ్లు పడుతూ... కాల్వలు, డ్రెయిన్‌లలో పూడిక పేరుకుపోయి చివరి భూములవరకు నీరు అందక... షట్టర్‌లు, తూములు దెబ్బతినిపోయి ప్రతి నీటి బొట్టు విలువైనదైన పరిస్థితుల్లో వృధాగా మురుగు కాల్వల్లో కలసిపోయి... వర్షం పడితే చుక్కనీరు కిందికి పోకుండా పొలాలను ముంచెత్తుతూ రైతులకు కడ'గండ్లే' మిగిలితే... ఎంత కష్టమో కదా!. ఒకటో, రెండో సీజన్‌లు కాదు... కొన్ని దశాబ్దాలుగా కృష్ణా డెల్టా పరిధిలోని వరి రైతులకు వీటి ఫలితంగా మిగులుతోంది కన్నీటి కష్టాలే. పంట వేసిన ప్రతి సంవత్సరం వర్షాలు పడకపోతే నీరందక పంటలెండి, వరుణుడు కరుణిస్తే డ్రెయిన్‌ల కట్టలు తెంచుకుని వరద నీరు పొలాలపైపడి పంట మొత్తాన్ని ముంచేస్తుంటే, ఆ దేవునిపై భారం వేయటం మినహా రైతులు చేయగలిగిందేమీ లేకుండాపోయింది. కృష్ణా డెల్టాలో సాగు నీటి కష్టాలు, డ్రెయిన్‌ల దుస్థితితో ఏర్పడుతున్న సమస్యలతో గత కొన్ని దశాబ్దాలుగా తీవ్ర నష్టాలను చవిచూస్తున్న రైతులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. మళ్లీ డెల్టా కాల్వల ఆధునికీకరణకు శ్రీకారం చుడుతున్నట్టు తీపికబురు చెప్పటంతో రైతుల్లో సంతోషం కనిపిస్తోంది.

తెనాలి, మార్చి 10, (ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలో 5,71,351 ఎకరాలు సాగవుతుంటే, ఈ విస్తీర్ణం మొత్తం గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లా పరిధిలో ఉంది. ఒక సీజన్‌లో ఖరీఫ్ పంట సాగవ్వాలంటే 69 టీఎంసీల నీరు అవసరం అవుతుంది. అయితే ఈ నీరు అందించటానికి 8,200 క్యూసెక్కుల సామర్థ్యంతో ప్రకాశం బ్యారేజి దగ్గర నుంచి ప్రధాన కాల్వ వస్తున్నా, దాని నుంచి నీటిని పంట పొలాలకు అందించే కృష్ణా పశ్చిమ బ్యాంక్ కెనాల్, తూర్పు, పశ్చిమ, నిజాంపట్నం కాల్వలు, కొమ్మమూరు, హైలెవల్ ఛానల్స్ కీలకంగా ఉన్నాయి. అయితే వీటిపై ఎప్పుడో 2007లో డెల్టా కాల్వల ఆధునికీకరణ చేపడితే, అవి 2012 వరకు సాగుతూనే వచ్చాయి. వీటిలోనూ పూర్తిశాతం పనులు జరగలేదు. సాగునీటి కాల్వల పనుల్లో 50 నుంచి 60 శాతం మేర పనులు జరిగితే, డ్రెయినేజి పనులు మాత్రం 70 శాతం వరకు జరిగాయి. ప్రకాశం జిల్లా వరకు ఉన్న కొమ్మమూరు కాల్వపైన అయితే రూ. 408 కోట్ల ఆధునికీకరణ పనులు అసలు జరగనేలేదు. ఆ నిధులు రద్దయిపోవటంతో రైతులకు ఇబ్బందులు మరింత పెరిగిపోయాయి. అయితే తాజాగా నీటిపారుదల శాఖ డ్రెయినేజి పనులకు సంబంధించిన కొన్ని పనులకు ఇప్పటికే నాబార్డ్‌కు ప్రతి పాదనలు పంపితే, మరికొన్ని పనులకు సంబంధించి మరోసారి మరికొన్ని పనులకు సంబంధించిన ప్రతిపాదనలు పంపేందుకు సిద్ధమవుతోంది. ఇదిలా ఉంటే, డెల్టా కాల్వల ఆధునికీకరణ పనులకోసం మళ్లీ రంగం సిద్ధం చేస్తున్నామని, దీనికి సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన ప్రతిపాదనలు పంపాలని నీటిపారుదల శాఖకు ఆదేశాలు కూడా అందాయి. అయితే వీటిని సిద్ధం చేయటానికి మాత్రం నీటిపారుదల శాఖకు మరో మూడు సీజన్‌ల కాలం పట్టే పరిస్థితి ఉంది.

డ్రెయిన్‌ల మరమ్మతుల కోసం రూ. 680 కోట్లతో ప్రతిపాదనలు

కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని డ్రెయిన్‌ల మరమ్మతులకోసం నీటిపారుదల శాఖ రూ. 680 కోట్లతో ప్రతిపాదనలను తాజాగా నాబార్డ్‌కు పంపింది. వీటిలో ఒక్క నల్లమడ వాగుకే సంమే రూ. 480కోట్ల ప్రతిపాదనలు పంపితే, మిగిలిన రూ. 200 కోట్లతో 60 కి.మీటర్ల పొడవున్న రేపల్లె మెయిన్ డ్రెయిన్, 51 కి.మీటర్ల పొడవున్న భట్టిప్రోలు మెయిన్ డ్రెయిన్‌ల, మరి కొన్ని చిన్న డ్రెయిన్‌ల మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. వీటిలో రూ. 140 కోట్ల ప్రతిపాదనలు ఇప్పటికే నాబార్డ్‌కు చేరిపోతే, మిగిలిన ప్రతిపాదనలు పంపే పనిలో ఉన్నామని అధికారులు చెబుతున్నారు. ఆర్.ఎం డ్రెయిన్‌పై నిజాంపట్నం దగ్గరున్న పాలరేవు ఔట్‌ఫాల్ స్లూయిజ్ వెడల్పు పెంచే ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. ఇక్కడ సముద్రం నీరు వెనక్కు రాకుండా ఆపేందుకు స్లూయిజ్ నిర్మించారు. అయితే దీనికి 10 ఖానాలు మాత్రమే ఉండటంతో సామర్థ్యం సరిపోవటంలేదని, దానిని మరో 10 ఖానాలు పెంచి, మొత్తం 20 ఖానాలతో స్లూయిజ్‌ను వెడల్పు చేయాలని నిర్ణయించారు. ముంపునీరు త్వరగా సముద్రంలోకి వెళ్లటానికి ఇది ఉపయోగపడుతుంది. ఇవికాక మిగిలిన డ్రెయిన్‌ల కట్టలు బలపరచటం, డ్రెయిన్‌లలో ప్రధాన సమస్యగా ఉన్న పూడిక తీయటం, వంటి పనులు చేయాల్సి ఉంది.



పి.వి.పాలెం దగ్గర సబ్ డెయిన్ షట్టర్ ధ్వంసమై కాంక్రీట్ దిమ్మెలు పగిలిపోయిన చిత్రం



బుర్రిపాలెం వద్ద డ్రెయిన్ అడ్డుగా ఉన్న తూములు

నల్లమడకు మోక్షం లభించినట్టేనా!

నల్లమడ డ్రెయిన్ కిందున్న లక్ష ఎకరాల ముంపు సమస్యకు శాశ్వత

(మిగతా 6వ పేజీలో)

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం

కృష్ణా డెల్టా కాల్వల ఆధునికీకరణ పనులు చేపట్టటానికి అవసరమైన ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వం సూచించింది. వీటిని ఈ సీజన్ నుంచే మొదలు పెడుతున్నాం. అయితే డ్రెయిన్‌ల మరమ్మతులకు, ఆధునికీకరణ పనులకు సంబందించి ఇప్పటికే ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. సుమారు రూ. 680 కోట్ల వరకు ఖర్చవుతుందని ప్రతిపాదనల్లోకోరాం. ఇవికాక వచ్చే సీజన్‌లో చేయాల్సిన అత్యవసర మరమ్మతులకోసం ఓ అండ్ ఎం కింద రూ. 40 కోట్ల ప్రతిపాదనలు కూడా ఇప్పటికే పంపించేశాం. మరి కొద్ది రోజుల్లో నిధుల మంజూరు ఉత్తర్వులు రావచ్చు. వచ్చిన వెంటనే పనులకోసం టెండర్లు పిలుస్తాం.

- వెంకటరత్నం, నీటిపారుదల శాఖ ఎస్ఈ గుంటూరు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.22 (మంగళవారం)
సహరి : 5.02 (బుధవారం)







- గుంటూరు (ఆంధ్రజ్యోతి)

గుంటూరు చుట్టుగుంట చెరువులో కనిపించే తెల్ల కొంగలు ఒక కొత్త అందాల లోకాన్ని తలపిస్తుంటాయి. చేపల వేటలో భాగంగా చెరువులో వాటి విన్యాసాలు కనువిందు చేస్తున్నాయి. మార్నింగ్ వాక్‌కు వచ్చే ప్రతి ఒక్కరూ ఈ తెల్ల బంగారు లోకం చూసి కొత్త అనుభూతికి లోనవుతుంటారు.

అక్రమార్కులకు అందలం

అటకెక్కిన రూ. 347 కోట్ల అవినీతి నివేదిక

గత ప్రభుత్వ హయాంలో గుంటూరు మిర్చియార్డులో భారీ అవినీతి జరిగింది. అక్కడ జరిగిన అవినీతి, అక్రమాలపై అందిన ఫిర్యాదు మేరకు విజిలెన్స్ అధికారులు విచారణ జరిపి రూ.347 కోట్ల మేర అవినీతి జరిగిందని గత ఏడాది నవంబర్‌లో ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. అప్పటి యార్డు ఛైర్మన్,మార్కెటింగ్ అధికారులు,ఉద్యోగుల పై చర్యలకు సిఫార్సు చేశారు. ఇదంతా గత ఏడాది డిసెంబర్ లో వెలుగులో కి వచ్చింది. అప్పట్లో సంచలనం సృష్టించిన ఈ వ్యవహారంలో ఇక ఏదో జరిగిపోతుందని అందరూ భావించారు. .కానీ అలా ఏమీ జరగలేదు. ఎవరిపైనా ఏ చర్య తీసుకోలేదు. పైగా విజిలెన్స్ నివేదిక వచ్చిన తరువాత కొందరికి కొత్తగా పోస్టింగ్‌లు ఇచ్చారు. మరికొందరిని ఉన్నత స్థానాల్లో కూర్చోబెట్టారు. టోటల్ గా చెప్పాలంటే మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు విజిలెన్స్ ఇచ్చిన నివేదికను,చేసిన సిఫార్సు లను అటకెక్కించారు.

- నెలలు దాటినా చర్యలు శూన్యం
- అక్రమాలకు పాల్పడిన వారికి అందలాలు
- మార్కెటింగ్ శాఖలో చిదంబర లీలలు



గుంటూరు ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం

గుంటూరు సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గడచిన ఐదేళ్లలో గుంటూరు మిర్చి యార్డు ను అవినీతి,అక్రమాలకు అడ్డాగా మార్చిన వారిపై మార్కెటింగ్ శాఖ ఉదాసీనత ప్రదర్శిస్తున్నదనే విమర్శలు ఉన్నాయి. వారి అక్రమాలపై విజిలెన్స్ నివేదిక వచ్చిన తరువాత కూడా చర్యలకు ఉపక్రమించకపోవటం పట్ల విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. గత ఏడాది నవంబర్‌లోనే విజిలెన్స్ అండ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఆ తర్వాత జరిగిన పరిణామాలు చూస్తుంటే విజిలెన్స్ నివేదికను మార్కెటింగ్ శాఖ పూర్తిగా పక్కన పెట్టేసినట్లు అర్థం అవుతున్నది. ఇందుకోసం ఉన్నత స్థాయి లాబీయింగ్ నడిచినట్లు ఆరోపణలు వస్తున్నాయి. యార్డులో జరిగిన అవినీతిలో మొత్తం 20 మంది పాత్ర పోషించినట్లు విజిలెన్స్ నిర్ధారించింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో మార్కెటింగ్ శాఖలోని ఉన్నతాధికారులు కూడా ఉన్నారు. పలువురు యార్డు సెక్రటరీలు, సూపర్ వైజర్లు ప్రధాన పాత్రధారులుగా ఉన్నట్లు తేల్చారు. వారి వల్లనే వివిధ రూపాల్లో యార్డుకు రావాల్సిన రూ.347 కోట్ల ఆదాయానికి గండి పడినట్లు నిర్ధారించారు. ఒక సెక్రటరీ లైసెన్స్ రెన్యువల్ వ్యవహారంలో పూర్తి స్థాయి గుత్తాధిపత్యం ప్రదర్శించినట్లు కూడా నివేదిక లో విజిలెన్స్ స్పష్టం చేసింది.

మెమో ఇంకా రాలేదా ..?

విజిలెన్స్ నివేదిక ప్రభుత్వానికి చేరిన తరువాత బాధ్యులైన అధికారులు, ఉద్యోగుల పై చర్యలు నిమిత్తం మెమో జారీచేస్తుంది. ఆ మెమో ఆధారంగా నే మార్కెటింగ్ శాఖ చర్యలకు ఉపక్రమించటం జరుగుతుంది. ప్రభుత్వానికి నివేదిక చేరిన అతి తక్కువ సమయంలోనే ఈ మెమో జారీ అవుతుంది. యార్డు వ్యవహారం మాత్రం అందుకు భిన్నంగా జరిగింది. నివేదిక వెళ్లిన నాలుగు నెలల తర్వాత కూడా ఏ విధమైన స్పందన కనపడటం లేదు.ప్రభుత్వం అసలు మెమోనే జారీ చేయలేదా. ఒక వేళ ప్రభుత్వం మెమో జారీచేసిన తర్వాత కూడా చర్యలకు మార్కెటింగ్ శాఖ మీనమేషాలు లెక్కిస్తుందా..? అన్న దానిపై చర్చ జరుగుతున్నది. గత ప్రభుత్వ హయాంలో యార్డు లో ఏకచత్రాధిపత్యం సాగించిన కొందరికి మంచి స్థానాల్లో పోస్టింగ్ ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది. ఎవరిపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా ఏవిధమైన చర్యలు చేపట్టకుండా ఉండేందుకు వాళ్లే పావులు కదుపుతున్నారన్న ప్రచారం జరుగుతున్నది. విజిలెన్స్ నివేదికను అటక్కెకించటంలో కూడా వాళ్ల పాత్రే కీలకంగా ఉన్నట్లు సమాచారం. వేరే వ్యవహారంలో రూ. కోట్ల ముడుపులు ముట్టజెప్పినందుకు నజరానాగా ఈ వ్యవహారం పక్కన పెట్టమని కోరినట్లు ప్రచారం సాగుతోంది.

20 రోజులు.. రూ. 50 కోట్ల లక్ష్యం



- మార్కెట్ ఫీజుల వసూళ్లలో ఏఎంసీల వెనకడుగు
- బాపట్లలో ప్రకృతి విపత్తులు
- పల్నాడులో సాగునీటి కష్టాలు
- గుంటూరులో కొనుగోళ్ళ సెస్సు పెండింగ్

గుంటూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ)లలో మార్కెట్ ఫీజు వసూళ్లు ఈ ఏడాది అంత ఆశాజనకంగా లేవు. మరో 20 రోజుల్లో 2024-25 ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనుండగా నేటికీ 76 శాతం మధ్యనే వసూళ్లు జరిగాయి. ఇప్పటినుంచి కేవలం ఒక్క గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో మిర్చి లావాదేవీలు కారణంగా కొంతవరకు మార్కెట్ ఫీజు వ సూళ్లకు అవకాశం ఉన్నది. మిగతా ఏఎంసీల పరిధిలో కలెక్షన్స్ నామమాత్రంగానే జరుగుతాయి. ఈ నేపథ్యంలో మార్కెటింగ్ రాష్ట్ర శాఖ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఏఎంసీలకు కేటాయిం చిన లక్ష్యాన్ని అధిగమించే పరిస్థితి కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో మంగళవారం మార్కెటింగ్ కమిషనరేట్‌లో ఆ శాఖ డైరెక్టర్ అండ్ కమిషనర్ విజయ సునీత ఏఎంసీల సెక్రెటరీలు, ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్లు, డీడీ, ఏడీలతో సమావేశం కావాలని నిర్ణయించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గుంటూరు జిల్లాకు మార్కెట్ ఫీజు వసూళ్లను రూ. 133.69 కోట్లుగా మార్కెటింగ్ శాఖ లక్ష్యాన్ని నిర్దే శించింది. అందులో ఇప్ప టివరకు 102.81 కోట్లు వసూలు చేసి 76.91 శాతం లక్ష్యానికి చేరుకొన్నది. పల్నాడు జిల్లా లోని 12 ఏఎంసీలైన నరసరావుపేట, చిలకలూరిపేట, రొంపిచర్ల, సత్తెనపల్లి, క్రోసూరు, రాజుపాలెం, పిడుగురాళ్ల, గురజాల,మాచర్ల, ఈపూరు, వినుకొండ, దుర్గికి కలిపి రూ.32.14 కోట్లు లక్ష్యం నిర్దేశించగా ఇప్పటి వరకు కేవలం రూ. 21 కోట్లు వసూళ్లు మాత్రమే వసూళ్లు జరిగాయి. బాపట్ల జిల్లాలో ఏఎంసీలకు రూ. 30.21 కోట్లు లక్ష్యం ఇవ్వగా రూ. 22.65 కోట్లు వసూళ్లు చేశారు. ఈ విధంగా మూడు జిల్లాలకు కలిపి రూ. 196.08 కోట్లు లక్ష్యం కాగా రూ. 146.46 కోట్లు వసూలు చేశారు. ఇంకా రూ. 50 కోట్ల లోటు ఉన్నది.

మార్కెట్ ఫీజు కలెక్షన్ పైనే ఏఎంసీలు ఆధారపడి ఉన్నాయి. అయితే ఉమ్మడి జిల్లాలో కొన్ని మాత్రమే కార్యకలాపాలు జరిగే ఏఎంసీలు ఉండగా మిగతావాన్ని చెక్‌పోస్టులలో వసూలు చేసే సెస్సు పైనే ఆధారపడుతున్నాయి. గుంటూరు జిల్లాలో పేరుకు ఎనిమిది వ్యవసాయ మార్కెట్ కమిటీలుండగా వీటిల్లో గుంటూరు, దుగ్గిరాల, తెనాలి మాత్రమే కార్యకలాపాలు సాగిస్తున్నాయి. అలానే పల్నాడులో 12 ఏఎంసీలున్నప్పటికీ గురజాల ఒక్కటే కార్యకలాపాలు జరిపే యార్డుగా ఉన్నది. బాపట్లలో నాలుగు ఏఎంసీలుండగా ఇవన్ని ధాన్యం, అపరాలపై ఆధారపడుతున్నాయి. కాగా గతేడాది రబీ సీజన్‌లో సాగర్ కాలువలకు సాగునీరు విడుదల చేయలేదు. దాంతో పంట విస్తీర్ణం తగ్గి మార్కెట్ ఫీజు వ సూళ్లపై దాని ప్రభావం పడింది. బాపట్ల జిల్లా లో ఈ ఏడాది ప్రకృతి విపత్తులు సంభవించ డంతో ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో పంట లు దెబ్బతిన్నాయి. గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఈ సంవత్సరం మిర్చి ధర పతనం అయింది. గతేడాది క్వింటాల్ రూ. 18 వేల వరకు ఉంటే ఈ సంవత్సరం మార్కెట్ ప్రారంభంలో రూ. 9 వేల నుంచి రూ. 11వేల మధ్య నే ఉన్న ది. ఇది కూడా మార్కెట్ ఫీజు తగ్గడానికి కారణంగా మారింది. మరో వైపు పౌరసర పరాల సంస్థ చేస్తోన్న ధాన్యం కొనుగోళ్లు, సీసీఐ చేసిన పత్తి కొ నుగోళ్లపై ఇంకా ఏఎంసీలకు మార్కెట్ ఫీజులు జమ కాలేదు. మార్కెట్ ఫీజు వసూళ్ల తగ్గ డానికి వీటన్నింటిని కారణాలుగా మార్కె టింగ్ అధికారులు పేర్కొంటున్నారు.

ఉమ్మడి జిల్లా ఏఎంసీలలో ఫీజుల వసూళ్లు ఇలా...

మార్కెట్ కమిటీ	లక్ష్యం (రూ.కోట్లలో)	వసూళ్లు చేసిన మొత్తం (రూ.కోట్లలో)
ఫిరంగిపురం	1.95	1.19
మంగళగిరి	3.10	2.10
తాడికొండ	2.10	1.46
గుంటూరు	106	79.20
పొన్నూరు	6.95	6.10
ప్రత్తిపాడు	3.72	3.31
తెనాలి	6.60	6.18
దుగ్గిరాల	3.27	3.24
పల్నాడు (అన్ని ఏఎంసీలు)	32.14	21
బాపట్ల (అన్ని ఏఎంసీలు)	30.21	22.65
మొత్తం	196.08	146.46

90,000 టన్నుల.. ధాన్యం సేకరణ

- ముగింపుకొచ్చిన కొనుగోళ్లు
- నేడు సమీక్ష... అధికారిక ప్రకటన

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్‌లో మద్దతు ధరకు ధాన్యం సేకరణ ముగింపు కొచ్చింది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 90,000 టన్నుల ధాన్యాన్ని మద్దతు ధరకు అన్నదాతల నుంచి సేకరించినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ సీజన్‌లో జరిపిన ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష జరపడానికి వ్యవసాయశాఖతో పాటు సివిల్ సప్లయిస్ సంబంధిత విభాగాలు మంగళవారం సమావేశం కానున్నాయి. కొనుగోళ్లకు సంబంధించి చెల్లింపులు కూడా 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమ అయ్యే విధంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. గత ఏడాది ఇదే సీజన్‌లో డబ్బులు జమ గురించే పెద్ద ఎత్తున ఫిర్యాదులు అధికారులకు అందేవి. కానీ ఇప్పటి వరకు ధాన్యం సొమ్ముల గురించి ఒక్క రైతు కూడా ఎలాంటి ఫిర్యాదు చేయకపోవడం ప్రభు త్వం సాధించిన ఘనతగా అధికారులు చెబు తున్నారు

ఐదు దఫాలుగా ప్రతిపాదనలు...

మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు విషయంలో ఈ దఫా తీవ్రస్థాయిలో కసరత్తు చేయాల్సి వచ్చింది. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి తొలుత ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం 50,000 టన్నులే కావడం, మరో వైపు కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం రాశులు బారులు తీరడంతో లక్ష్యం కాస్తా నెల రోజులకే తరిగిపోయింది. ఇక అప్పటి నుంచి రాష్ట్రస్థాయిలో ఉన్న కమిషనర్‌కు జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి మరింతగా అనుమతులు ఇవ్వాలన్న ప్రతిపాదనలను దశలవారీగా పంపడం, దాదాపుగా వాటిని సాధించుకోవడంలో యంత్రాంగం సఫలమైంది. స్థానిక పరిస్థితులు ఆధారంగా ఈ ప్రతిపాదనలను ఆమోదించుకోవడంలో నేతల కృషి తోడవడంతో రైతులకు మెరుగ్గా మద్దతుధర ప్రయోజనం అందడంలో విజయం సాధించారు. తొలుత ఇచ్చిన 50,000టన్నులకు తోడు దఫదఫాలుగా మరో 40,000 వరకు అనుమతులు తేగలిగారు. దీంతో ఇప్పటి వరకు రికార్డుస్థాయిలో 90,000 టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించగలిగింది.



విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి

ఒక్క పాఠశాలా మూతపడకూడదు

- మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల పునరుద్ధరీకరణ సమయంలో కచ్చితంగా విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ప్రతినిధుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచించారు. అద్దంకి నియోజకవర్గంలో పాఠశాలల పునరుద్ధరణపై సోమవారం అమరావతిలో మంత్రి ఛాంబర్‌లో అన్ని మండలాల ఎంఈవోలతో చర్చించారు. ప్రస్తుతం ఉన్న ఏ ఒక్క పాఠశాల మూత పడకుండా చూడాలన్నారు. 15 ప్రాథమిక పాఠశాలలను ఫౌండేషన్ స్కూల్స్ (1, 2 తరగతులు మాత్రమే) మార్చే ప్రతిపాదనలపై ఎస్ఎంసీ ల నుంచి అభ్యంతరాలు వచ్చిన విషయాన్ని ఎంఈవో లు మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకు వచ్చారు. దీనికి స్పందించిన మంత్రి స్కూల్ మేనేజిమెంట్ కమిటీ (ఎస్ఎంసీ)ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని ఎలాంటి మార్పులు చేయకుండా కచ్చితంగా ప్రాథమిక పాఠశాలలుగా కొనసాగించాలన్నారు. నియోజకవర్గంలో 9 ఉన్నత పాఠశాలలు 68 మోడల్ స్కూల్స్‌గా మా రనున్నట్లు మంత్రి రవికుమార్‌కు వివరించారు. మంత్రిని కలిసినవారిలో చీరాల డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ గంగాధరరావు, ఎంఈవోలు సుధాకరరావు, పున్నయ్య, రమేష్, వీరాంజనేయులు, దినేష్ ఉన్నారు.

సూర్యలంకకు సొబగులు

రూ.40 లక్షలు కేటాయించిన ప్రభుత్వం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సూర్యలంక బీచ్‌కు మహర్దశ పట్టనుంది. పర్యాటక అభివృద్ధిలో భాగంగా కేంద్రం ఎంచుకున్న ప్రదేశాలలో సూర్యలంక తీరం ఉండగా రూ.100 కోట్ల నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఓ వైపు అందుకు సంబంధించి కసరత్తు జరుగుతుండగానే ప్రభుత్వం కూడా పర్యటక రంగం మీద దృష్టి పెట్టి వారికి సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేసే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. రూ.40 లక్షల రూపాయల గ్రాంటు నిధులను ఖర్చు చేసి సూర్యలంక తీరంలో వసతులు కల్పించాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకుంది. ఆటవిడుపుకు వారాంతాల్లో ఇక్కడకు వచ్చే పర్యాటకుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. రోజుకు రెండు నుంచి మూడు వేల మంది పర్యాటకులు సూర్యలంక తీరానికి వస్తుండగా, ఈసంఖ్య శని, ఆదివారాల్లో 5,000 వరకు ఉంటోంది. పర్యాటకులకు మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీరు అందు బాటులో లేకపోవడం, స్పీడ్ బోట్లను గ్రాంటు నిధులతో ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు సూర్యలంక బీచ్‌లో సౌకర్యాలపై తొలుత ప్రభుత్వం దృష్టి పెట్టింది. ముందుగా పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు లేని వాతావరణం కల్పించే దిశగా అడుగులు వేస్తోంది. డ్రెస్సింగ్ రూమ్స్, మంచినీటి సౌకర్యం, టాయిలెట్స్ తో పాటు స్పీడ్‌బోట్లను ఏర్పాటు చేయడం వంటివన్నీ తొలి దశలో భాగంగా యుద్ధ ప్రాతిపదికన చేపట్టనున్నారు.

దిగజారిన మిర్చి ధర

» లబోదిబోమంటున్న రైతులు

» ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

చినగంజాం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మిర్చి ధర రోజు రోజుకూ దిగజారుతుండడంతో మిర్చి రైతులు లబోదిబోమంటున్నారు. గత ఏడాది మిరప కాయలకి మంచి ధర వచ్చి రైతులు లాభాలను ఆర్జించారు. ఈ ఏడాది కూడా లాభాలు ఆర్జించవచ్చని ఆశించిన రైతులకు భంగపాటు ఎదురైంది. గతంలో కంటే మిర్చి సాగు అధికమైంది. మండలంలోని మోటుపల్లి, చినగంజాం, కడవకుదురు, రాజు బంగారుపాలెం, పెదగంజాం తదితర గ్రామాల్లోని ఇసుక భూముల్లో రైతులు మిర్చి పంటను సాగు చేస్తున్నారు. గతంలో లాభాలు ఆర్జించిన రైతులను చూసి మనకు కూడా బాగా లాభాలు వస్తాయని ఆశించి వేరుశనగ వేసే భూమిని సైతం మిర్చి తోటలు వేశారు. హైబ్రిడ్ మిర్చి రకం కావడంతో దిగుమతులు కూడా ఆశాజనకంగానే ఉన్నాయి. అంగట్లో అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు మిర్చి రైతుల పరిస్థితి మారింది. దిగుబడులు బాగా ఉన్నా రేటు సక్రమంగా లేకపోవడంతో రైతుల పరిస్థితి దీనంగా మారింది. గతంలో కిలో ధర రూ.20 ఉండగా నేడు కిలో రూ.11లకే పడిపోవడంతో కోత కూలికి కూడా రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక మిరప మొక్క ఖరీదు రూపాయన్నర ఉంది. కౌలు, మొక్కలు వాటి సంరక్షణ, క్రిమి సంహారాలు, కూలి రేట్లు తడిసిమోపుడు అవుతున్నాయిని, పంట చేతికి వచ్చే సరికి ధర తగ్గుదల వచ్చిందని రైతులు వాపోతున్నారు. కొనబోతే కొరివి, అమ్మబోతే అడవిలా రైతుల పరిస్థితి దాపురించిందని రైతులు అంటున్నారు. ఎకరానికి సాగు ఖర్చులు రూ.70-80వేల వరకు అవుతున్నాయని, మార్కెటులో రేటు లేకపోవడంతో, ఇలాంటి పరిస్థితి ఉండడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. మిర్చి రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


కడవకుదురు ప్రాంతంలో సాగు చేస్తున్న మిర్చి తోటలు

కోత కూలి కూడా రావడం లేదు



మిరపకాయలు కిలో ధర రూ.8ల నుంచి రూ.11 ఉండడంతో కోత ఖర్చు కూడా రావడం లేదని అన్నారు. మిరప మొక్కకు ఉన్న డిమాండ్ కాయకు లేకుండా పోయిందని వాపోయారు.పంట మార్పిడి చేసిన ఫలితం లేకుండా పోయిందని అన్నారు.

\- పిల్లల పండు, రైతు, కడవకుదురు

ప్రభుత్వమే ఆదుకోవాలి



ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలి. గతంలో వేరుశనగ వేసే భూముల్లో వేరుశనగ కంటే మంచి లాభాలు ఆశించి మిరప పంట వేశాం. గిటుబాటు ధర లేకపోవడంతో నష్టపోయాం.

\- నాగబోయిన ఆదాం, రైతు, కడవకుదురు


ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పండ్ల తోటలను పరిశీలిస్తున్న అధికారులు

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

బల్లికురవ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని జోయిన్ కూప్ ప్రతినిధి (జర్మనీ) ప్రతిమ కోరారు. సోమవారం ప్రకృతి వ్యవసాయ విభాగం రైతు సాధికారిక సంస్థ తరఫున మండలంలోని నక్కబొక్కలపాడు, బల్లికురవ, చెన్నుపల్లిలో స్వయం సహాయక సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రైతులకు ప్రకృతి వ్యవసాయ చేయడం వల్ల ఎదురవుతున్న సమస్యల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు రావాలంటే రైతులు గ్రామాలలో అందుబాటులో ఉండే కషాయాల ద్వారా పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. అనంతరం బల్లికురవ గ్రామంలో పావులూరి దానారావు అనే రైతు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పండ్ల తోటలను పరిశీలించి ఆయన్ని అభినందించారు. చెన్నుపల్లిలో మువ్వా ఆంజనేయులు, ఈమని నాగరాజులు సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. పురుగు మందు అవశేషాలు లేని పంటలను సాగు చేసుకుని పంట ఉత్పత్తులను వాడితే ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రకృతి విభాగం ప్రాజెక్టు మేనేజర్ వాణిశ్రీ, రైతు సాధికార సంస్థ రాష్ట్ర ప్రతినిధి సౌమ్య, అడిషనల్ డీపీఎం మోహన్, ఎస్ఎఫ్‌పి చందనదుర్గ, ట్రైనర్ అప్పారావు, యూనిట్ ఇన్‌చార్జి సీహెచ్ కల్పన, నాగాంజలి, నాగరాజు పాల్గొన్నారు.

పోషకలోపంతో రాలుతున్న మామిడి పిందె


మామిడి పెంపకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వేటపాలెం(చీరాల), మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మామిడిలో పోషకలోపంతో పిందె రాలుతుందని, దానిని నివారించడానికి కచ్చితంగా ప్రాధాన్యత కలిగిన పిచికారీ చేయాలని గుంటూరు కీటక శాస్త్రవేత్త నాగేంద్రరెడ్డి, డీహెచ్‌వో జెన్నమ్మ అన్నారు. సోమవారం పందిళ్లపల్లి రామన్నపేటలో గల మామిడి తోటలను వారు పరిశీలించారు. ఈసందర్భంగా తేనె మంచు పురుగులు ఉన్నట్లు గుర్తించారు. పంటను దెబ్బ తీసే పురుగు చేరుతున్నట్లు రైతులకు వివరించారు. పూతను ఆసించే గొంగళి పురుగులు, ఆకుతినే పురుగుల ఉధృతి లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి కాశీవిశ్వనాథ్, హెచ్‌వో అలేఖ్య, రైతులు పాల్గొన్నారు.

అర్హులైన నిరుపేదలకు స్థలాలు కేటాయించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

చీరాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన నిరుపేదలకు నివేశన స్థలాలు కేటాయించాలని దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ జిలానీ అన్నారు. సోమవారం తహసీల్దార్ గోపీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలో అధిక శాతం మంది సొంత ఇళ్లు లేక అద్దె నివాసాల్లో మగ్గుతున్నట్లు వివరించారు. ఈక్రమంలో సామాన్యులకు స్థలాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి ఫూలేకు నివాళి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

అద్దంకిటౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలను బడిలోకి అనుమతించని రోజులలో సావిత్రీబాయి ఫూలే ఇంటిలోనే చదువుకొని ఇతర బాలికలకు చదువు చేప్పే ఉపాధ్యాయినిగా ఎదిగారని ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు అన్నారు. సోమవారం సావిత్రీబాయి ఫూలే వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక చైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సావిత్రీబాయి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రతి విద్యార్థినీ సావిత్రిబాయిని ఆదర్శంగా తీసుకుని ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నక్కా కాంతారావు, చెన్నుపల్లి నాగేశ్వరరావు, జ్యోతి చంద్రమౌళి, రామాంజనేయులు, కోటేశ్వరరావు, సుబ్బారావు, పాఠశాల నిర్వాహకురాలు పూనూరి ఆరోగ్యం, ప్రిన్సిపాల్ సురేంద్రబాబు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు స్వీట్లు, పండ్లను పంపిణీ చేశారు.

బీసీ, ఈబీసీ రుణాలకు దరఖాస్తులు చేయాలి

అద్దంకిటౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల్లో అర్హులైన బీసీ, ఈబీసీ వర్గాలకు చెందిన వారు కార్పొరేషన్‌ల సబ్సిడీ రుణాల కోసం ఈనెల 22వ తేదీలోపు దరకాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో బత్తిని సింగయ్య సోమవారం ప్రకటన తెలిపారు. వివరాలకు సచివాలయంలోని వెల్ఫేర్ అసిస్టెంట్‌లను సంప్రదించాలని సూచించారు.

క్రీడాకారుడు గోపీచంద్ అమ్మమ్మ మృతి


అమ్మమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న గోపీంద్, కుటుంబీకులు

ఇంకొల్లు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఇండియా బ్యాడ్మింటన్ కోచ్, తెలంగాణ రాష్ట్ర బ్యాడ్మంటన్ అసోసియేషన్ కార్యదర్శి పుల్లెల గోపీచంద్ అమ్మమ్మ గోరంట్ల ఆదెమ్మ (89) మృతి చెందారు. ఇంకొల్లు మండలం నాగండ్ల గ్రామానికి చెందిన ఆదెమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు కాగా పెద్దకుమార్తె సుబ్బాయమ్మ కుమారుడు పుల్లెల గోపీచంద్. అమ్మమ్మ మృతి చెందడంతో సోమవారం నాగండ్లలో జరిగిన అంత్యక్రియల కార్యక్రమంలో గోపీచంద్ పాల్గొన్నారు. ఆదెమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి రాష్ట్రాల బ్యాడ్మింటన్ అసోసియేషన్‌ల తరుపున సంతాపం తెలిపారు. ఆదెమ్మ నివాళులర్పించినవారిలో కరణం చెంచుపున్నయ్య, రావి సత్యనారాయణ, సోమేపల్లి రామ్మోహనరావు, మార్కెండెయులు, గోరంట్ల హరిబాబు, బాబు, శ్రీనివాసరావు, కుమార్, పీవీలక్ష్మీ ఉన్నారు.

మరింత తగ్గిన చికెన్ ధరలు

అమ్మకాలు పెంచుకునేందుకు వ్యాపారుల ప్రయత్నాలు

అద్దంకి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : అద్దంకిలో చికెన్ ధరలు మరింత తగ్గాయి. ధరలు తగ్గడం ఒక కారణం అయితే చికెన్ ప్రియులను ఆకర్షించేందుకు వ్యాపారులు మరింత ధర తగ్గించి అమ్మకాలు చేస్తున్నారు. రెండు నెలల కిందట రూ.200పైనే ఉన్న చికెన్ ధర బర్డ్‌ఫ్లూతో కోళ్ల మృతి చెందుతుండడంతో చికెన్ అమ్మకాలు ఒక్కసారిగా తగ్గిపోయాయి. దీంతో ధరలు ఒక్కసారిగా తగ్గిపోయాయి. గత వారం పది రోజులుగా కిలో రూ.100కే అమ్మకాలు చేస్తున్నారు. సాధారణంగా పట్టణంలో ప్రతి ఆదివారం 50 క్వింటాళ్ల చికెన్ అమ్మకాలు జరుగుతాయి. ఒక్క సారిగా పదో వంతు అమ్మకాలకు పడిపోయాయి. ఈ నేపథ్యంలో తగ్గిన చికెన్ ధరలకు తోడు స్థానిక వ్యాపారులు మరి కొంత ధర తగ్గించి అమ్మకాలను ప్రారంభించారు. దీంతో చికెన్ అమ్మకాలు మళ్లీ పుంజుకుంటున్నాయి. ప్రస్తుతం 20 క్వింటాళ్ల చికెన్ అమ్మకాలు జరుగుతున్నాయి.



అద్దంకిలో చికెన్ దుకాణాల వద్ద కిలో రూ.100గా ఏర్పాటు చేసిన బోర్డులు

ధర తక్కువ ఉండడంతో తిరిగి అమ్మకాలు మొదలు



బర్డ్‌ఫ్లూతో చికెన్ అమ్మకాలు భారీగా తగ్గిపోయాయి. రోజుకు ఇద్దరు, ముగ్గురు కూడా కొనుగోళ్లు చేయని పరిస్థితి. ప్రస్తుతం కిలో చికెన్ రూ.100 కావడంతో ఇప్పుడిప్పుడే కొనుగోలుకు ముందుకు వస్తున్నారు. గతంలో ప్రతి ఆదివారం అద్దంకి పట్టణంలో 50 క్వింటాళ్ల చికెన్ అమ్మకాలు జరిగేవి. ప్రస్తుతం 20 క్వింటాళ్ల అమ్మకాలు జరుగుతున్నాయి. అమ్మకాలు సాధారణ స్థాయికి చేరడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉంది.

\- యేజెండ్ల బాబు, చికెన్ దుకాణ యజమాని, అద్దంకి

కృష్ణా డెల్టాకు మళ్లీ మహర్దశ !


(5వ పేజీ తరువాయి)

పరిష్కారాన్ని చూపే దిశగా కూటమి ప్రభుత్వం తొలి అడుగు వేసింది. ఆధునికీకరణ పనులు దశాబ్దాలుగా ప్రతిపాదనలకే పరిమితమయిన తరుణంలో ఏకంగా డ్రెయిన్ వెడల్పు చేయటం కీలకం కావటంతో, ఆ పనులను చేయాలని నిర్ణయించటంతో ఇక్కడి రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. పొన్నూరు, బాపట్ల, పెదనందిపాడు, కాకుమాను, పర్చూరు మండలాల పరిధిలో ఉన్న ఈ డ్రెయిన్ సమస్య ఇప్పటి కాదు. దీనిపై 1964 నుంచి ప్రభుత్వాలు కమిటీలు వేస్తూనే వచ్చాయి. అప్పటి మిత్ర కమిటీ దగ్గర నుంచి 2006 వరకు సాగిన నిపుణుల కమిటీలు అనేక సూచనలు చేస్తే, వాటిని ఇప్పటి వరకు బుట్టదాఖలు చేస్తూ వచ్చారు. అయితే తాజాగా కూటమి ప్రభుత్వం అప్పటి మిత్ర కమిటీ నుంచి తాజా కమిటీలు చూపిన వాటిలో ప్రధానమైన ఆధునికీకరణ పనులకే ప్రాధాన్యం ఇచ్చారు. దీనికి రూ. 480 కోట్ల ఖర్చవుతున్నప్పటికీ వాటిని పూర్తిచేయాలనే నిర్ణయానికి రావటంతో, ప్రతిపాదనలుకూడా ప్రభుత్వానికి నీటిపారుదల శాఖ పంపింది. నల్లమడ డ్రెయిన్ ఇప్పటి వరకు 300 సీ (కోఎఫిషియంట్ అఫ్ డిశ్చార్జ్) వ్యాల్యూ ప్రకారం ఉంది. అయితే దీనిని 500 సీ వాల్యూ ప్రకారం వెడల్పు చెయ్యాలి. దీనికోసం అదనంగా భూమినికూడా సేకరించాల్సి ఉంటుంది. ఈ రూ. 480 కోట్లలో రూ. 300 కోట్లు డ్రెయిన్ ఆధునికీకరణ పనులకు కేటాయిస్తే, మిగిలిన రూ. 180 కోట్లు భూ సేకరణ కోసం కేటాయించారు. ఈ 500 సీ వాల్యూ ప్రకారం డ్రెయిన్ వెడల్పు జరిగితే పంట ముంపునకు గురవకుండా చేతికి అందుతుంది. ఈ పనులను గత చంద్రబాబు ప్రభుత్వం ఉన్నప్పుడు 2016లోనే చెయ్యాలని నిర్ణయించారు. అయితే అప్పట్లో నిధులు మంజూరు చేయటం, టెండర్లు పిలవటం వరకు జరిగినా, పనులు మాత్రం మొదలు కాలేదు. తర్వాత వచ్చిన ప్రభుత్వం అసలు దీనిని పక్కన పెట్టేసింది. దీంతో రైలకు కష్టాలు మరింత పెరిగాయి. అయితే మళ్లీ కూటమి సర్కారు వచ్చాక ఈ పనుల్లో కదలిక రావటంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు.


బీఎం డ్రెయిన్ కట్టలు జారిపోవడంతో పాడైన మట్టి మూటలు

మళ్లీ డెల్టా ఆధునికీకరణకు శ్రీకారం

కృష్ణా డెల్టా ఆధునికీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2007లో ఆధునికీకరణ జరగటం మినహా తర్వాత వీటిపై పెద్దగా పనులేవీ జరిగిన దాఖలాలు లేవు. దీంతో డెల్టాలోని కాల్వలన్నీ శిథిల స్థితికి చేరిపోయాయి. ఈ తరుణంలో ఆధునికీకరణ ఒక్కటే మార్గం కావటంతో దీనికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. దీనికోసం ప్రతిపాదనలు పంపాలను నీటిపారుదల శాఖకు ఆదేశాలు పంపింది. ఈ మేరకు అంచనాలు రూపొందించే పనిలో నీటిపారుదల శాఖ ఉంది. గతంలో డెల్టా కాల్వల ఆధునికీకరణ రూ. 1024 కోట్లు కేటాయించారు. అయితే వీటిలో 60 శాతం నిధులే సద్వినియోగం అయ్యాయి. రూ. 408 కోట్ల విలువైన కొమ్మమూరు కాల్వ పనులు మాత్రం ఒక్కటి కూడా జరగలేదు. దీంతో ఈ కాల్వపై సాగునీటి కష్టాలు మరింత పెరిగిపోయాయి. నీరు పుష్కలంగా ఉన్నప్పుడు కట్టలకు గండ్లు పడుతున్న పరిస్థితి కూడా ఉంది. అయితే ఆధునికీకరణ చేస్తే ఈ కాల్వ కిందున్న రైతులకు కష్టాలు తీరినట్టే. అయితే ఈసారి ఆధునికీరణ చేపట్టాలంటే కనీసం రూ. 1500 కోట్ల వరకు ఖర్చవుతుందని నీటిపారుదల శాఖ అంచనా వేస్తోంది. అయితే అంత మొత్తం ఇప్పుడున్న పరిస్థితుల్లో మంజూరవుతుందా! లేక కుదింపు వంటి కార్యక్రమం ఉంటుందా అనే అనుమానాలు కూడా ఉన్నాయి. ఏదిఏమైనా దీనికి సంబంధించిన డిటైల్డ్ ఎస్టిమేషన్స్ పూర్తి కావాలంటే కనీసం మూడు ఖరీఫ్ సీజన్‌లు పడుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రతి కాల్వపైనా క్షుణ్ణంగా పరిశీలించి, బ్రాంచి కాల్వలతో సహా అన్ని పనులను గుర్తించాల్సి ఉంటుంది. అయితే ఈ తరుణంలో నీటి సంఘాల పాత్ర కూడా కీలకం కానుంది. ఈ మూడేళ్లలో ప్రతిపాదనలు సిద్ధం చేస్తే, నిధుల మంజూరు ప్రక్రియ కీలకం అవుతుంది. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం ఏవిధంగా ముందుకు వెళుతుందనేది చూడాల్సిందే.


పెదనందిపాడు మండలంలో నల్లమడ డ్రెయిన్ కట్టకు గండ్లు పడడంతో నీట మునిగిన పంట పొలాలు (ఫైల్)


చెత్త కుప్పలో వృథాగా ఉన్న చెత్త సేకరణ రిక్షా

చెత్తకుప్పలో చెత్తబండి

వేటపాలెం (చీరాల), మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఎక్కడా కూడా చెత్త సేకరణలో సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని సూచిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులు, వస్తువుల జాగ్రత్తలపై ప్రత్యేక సూచనలు చేస్తున్నారు. అయితే వేటపాలెం మండలం రామన్నపేట పంచాయతీలో అందుకు భిన్నంగా పరిస్థితులు కనిపిస్తున్నాయి. చెత్త సేకరణలో చిత్తశుద్ధి లేదని ప్రజలు అంటున్నారు. ప్రధాన మార్గాల్లో తప్ప అంతర్గత రహదారుల్లో విధిగా చెత్త సేకరణ జరగడం లేదని విమర్శిస్తున్నారు. పైగా పంచాయతీల్లో సిబ్బంది కొరత, నిధులు కొరత వేధిస్తుంటే రామన్నపేటలో చెత్త సేకరించే రిక్షాను ఏకంగా చెత్త కుప్పలకే పరిమితం చేసి తమ నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు. దీంతో వాహనం వారాల తరబడి మూలనపడి శిథిలమవుతుంది. దీనిపై అధికారులు స్పందించి ప్రభుత్వ ఆస్తులు, వస్తువులపై జాగ్రత్తలు పాటించాలని ప్రజలు కోరుతున్నారు.

నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై కేసు

విద్యాధరపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): డబ్బులు పెట్టుబడి పెడితే పొలం కొనుగోలు చేసి వచ్చిన లాభాలలో ప్లాట్లు ఇస్తానని మోసం చేసిన వ్యక్తిపై సోమవారం భవానీపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. భవానీపురం గుడివాడ రామారావు వీధిలోని శ్రీరామకస్తూరిబాయి అపార్టుమెంట్‌లో శ్యామల కోటేశ్వరి అలియాస్ రెడ్డమ్మ (54)కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నారు. ప్రకాశం జిల్లా అద్దంకి సమీపంలోని కుర్రవానిపాలెం ప్రాంతానికి చెందిన కాకాని రాధాకృష్ణమూర్తితో ఐదేళ్లను నుంచి పరిచయం ఉండటంతో అతను అద్దంకి సమీపంలోని మోదేపల్లి గ్రామంలో 9 ఎకరాల భూమిని కొనుగోలు చేస్తున్నానని, డబ్బులు పెట్టుబడి పెడితే దానిని అభివృద్ధి చేసి ప్లాట్ల రూపంలో 20సెంట్లు చొప్పున రిజిస్ట్రేషన్ చేస్తానని రెడ్డమ్మను నమ్మించాడు. అతని మాటలు నమ్మిన కోటేశ్వరి అయిదేళ్లుగా మొత్తం రూ.36 లక్షలు, స్థలం డెవలప్‌మెంట్ కోసం మంటూ మరో రూ.8లక్షలు అతనికి ఇచ్చింది. ఆ తరువాత ప్లాట్లు తన పేరుతో రిజిస్ట్రేషన్ చేయమని బాధితురాలు కోరింది. అందుకు రాధాకృష్ణమూర్తి ఆమెను అసభ్యకరంగా దూషించి, దాడి చేయడమే కాక, చంపుతానని బెదిరించాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేస్తాననడంతో రెండు వారాలు గడువు కోరాడు. ఆ తరువాత నుంచి రాధాకృష్ణమూర్తికి ఫోన్ చేసినా స్పందించటం లేదు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో పోలీసులు రాధాకృష్ణమూర్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరంభం అదుర్స్

» కిలో రూ.280 పలికిన ప్రారంభ ధర

» బోర్డు చరిత్రలో ఇదే అత్యధికం

» దక్షిణాదిలో ప్రారంభమైన ప్రస్తుత సీజన్ పొగాకు కొనుగోళ్లు

ఒంగోలు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పొగాకు మార్కెట్ ఆరంభం అదిరిపోయింది. కొనుగోళ్ల ప్రారంభం రోజున కిలో రూ.280 గరిష్ఠ ధర పలికింది. గత ఏడాది వేలం ప్రారంభం రోజున కిలో రూ.230 ఇచ్చిన వ్యాపారులు ఈ ఏడాది ఎవరి ఊహలకు అందని విధంగా ఏకంగా రూ 280 ఇచ్చారు. అలా గత ఏడాది కన్నా ఈ ఏడాది ఏకంగా ప్రారంభ ధర కిలోకు రూ.50 పెంచి ఇవ్వగా పొగాకు బోర్డు చరిత్రలో కొనుగోళ్ల ప్రారంభం రోజున లభించిన గరిష్ఠ ధర ఇదే. రాష్ట్రంలో 16 వేలం కేంద్రాలలో ప్రస్తుత సీజన్ పొగాకు కొనుగోళ్లను మూడు విడతలలో చేపట్టాలని పొగాకు బోర్డు నిర్ణయించింది. అందులో దక్షిణాది ప్రాంతంగా పిలిచే మన జిల్లా, నెల్లూరు జిల్లాలో ఉన్న 11 కేంద్రాలలో తొలుత నాలుగు చోట్ల, రెండవ దశలో మిగిలిన ఏడు చోట్ల వేలం ప్రారంభానికి నిర్ణయించారు. తదనుగుణంగా సోమవారం దక్షిణాదిలో తొలిదశ పొగాకు కొనుగోళ్ల ప్రారంభమయ్యాయి.

కొండపిలో ప్రారంభించిన చైర్మన్

జిల్లాలోని ఒంగోలు-1, కొండపి, పొదిలి కేంద్రాలతో పాటు నెల్లూరు జిల్లాలోని కందుకూరు-1 కేంద్రంలో వేలం ప్రక్రియ ప్రారంభమైంది. కొండపి కేంద్రంలో పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ ప్రారంభించగా ఒంగోలు-1 కేంద్రంలో బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. కొండపిలో చైర్మన్‌తోపాటు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య స్థానిక అధికారులు హాజరు కాగా ఒంగోలు-1లో ఆర్ఎం లక్ష్మణరావు ఇతర అధికారులు, రైతు నాయకులు ఉన్నారు. అలాగే పొదిలి, కందుకూరు-1లలో అక్కడి పొగాకు వేలం అధికారులు, స్థానిక రైతు, వ్యాపార ప్రతినిధుల సమక్షంలో వేలం ప్రారంభించారు. అన్నిచోట్ల తొలిరోజున 18 బేళ్ల వంతున వేలంకు తీసుకురాగా అన్నింటిని వ్యాపారులు కొన్నారు. నాలుగు కేంద్రాల్లోను గరిష్ఠ ధర కిలో రూ.280 లభించింది.

అయోమయంలో నల్లబర్లీ రైతులు

- భారీగా పెరిగిన సాగు
- ఇళ్లు, పొలాల వద్ద పేరుకున్న మండెలు
- కొనుగోలు ప్రారంభించని కంపెనీలు
- అమ్మకానికి నోచుకోకపోవడంతో ఆందోళన



పంగులూరులో షామియానాల కింద మండెగా వేస్తున్న ఎండిన నల్లబర్లీ పొగాకు.. కొనుగోలు ప్రారంభంకాక పరదాల మాటున ఉన్న పొగాకు మండెలు.. రేకుల షెడ్డులో గుట్టగా పడేసిఉన్న ఎండిన బర్లీ పొగాకు తాళ్లు

పంగులూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : బర్లీ పొగాకు సాగు రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. రైతులు ఇబ్బడిముబ్బడిగా బర్లీ పొగాకు సాగును చేపట్టి నప్పటికీ పొగాకు కంపెనీలు కొనుగోళ్లు నేటికీ ప్రారంభం కాకపోవడంతో దిక్కుతోచనిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. గత ఏడాది 1500 ఎకరాల్లో బర్లీ పొగాకును సాగుచేయగా, ఈ ఏడాది సుమారు 5 నుంచి 6వేల ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుతం మంచి దిగుబడితో చేతికి అందివచ్చిన పొగాకును ఎక్కడ నిల్వ చేయాలో అర్థంకాక అవస్థలు పడుతున్నారు. పెరిగిన పొగ తోటలో అందివచ్చి వొలిచిన ఆకును ఎండబెట్టిన కొద్ది సమయానికే కొనుగోలు ప్రారంభం అవుతాయని, అమ్ముకున్న సొమ్ము పెట్టుబడికి ఆసరాగా ఉపయోగ పడుతుందని ఆశించినా అవి ఆవిరవుతున్నాయి. చేతికి అందివచ్చిన పొగాకు దిగుబడులను నిల్వ చేసే వీలు లేక షామియానాల కింద, ఖాళీ స్థలాలు, పొలాల్లో మండెలు వేసి కాపలా కాస్తున్నారు. కంపెనీలు ఎప్పుడు కొనుగోలు చేస్తాయో తెలియక, ఎంత ధర వస్తుందోనని తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

వెంటనే కొనుగోలు చేయాలి



ఈ ఏడాది ఎకరాకు లక్షన్నర వరకూ పెట్టిబడి పెట్టి నల్లబర్లీ పొగాకును సాగు చేశాం. కవులు, ఖర్చులు పెరిగాయి. సుమారు రూ.లక్షన్నర వరకూ పెట్టుబడి ఖర్చులు అయ్యాయి. కనీస ధర రూ.12వేల నుంచి రూ.15వేలు చెల్లించాలి. వెంటనే కంపెనీల వారు వచ్చి కొనుగోలు చేయాలి. లేకుంటే రైతులు తీవ్రంగా నష్టపోతారు. గత ఏడాది ఈ సమయానికి కొనుగోళ్లు పూర్తయ్యాయి. మంచి లాభాలను కూడా చూశాం.

- అడ్డగడ సతీష్, రైతు, చందలూరు

ఇబ్బడిముబ్బడిగా పెరిగిన సాగు విస్తీర్ణం

గత ఏడాది బర్లీ సాగు లాభదాయకంగా ఉండటం, మిరపకు వస్తున్న తెగుళ్లతో పతనమైన మిరప ధరలతో అధికంగా నష్టపోయిన రైతులు ఈ ఏడాది సుమారు 6వేల ఎకరాల్లో నల్ల బర్లీ సాగును చేపట్టారు. ఎకరాకు 30 నుంచి 35 వేల కౌలు చెల్లించి చేపట్టారు. గత ఏడాది నల్ల బర్లీకి, తెల్ల బర్లీకీ ధరలలో పెద్ద వ్యత్యాసం లేకపోవడంతో అధిక దిగుబడితో పాటు సాగు తేలికగా ఉంటుందన్న ఆశతో ఎక్కువ మంది రైతులు నల్లబర్లీని సాగు చేశారు. అన్ని ప్రాంతాలలో విపరీతంగా పెరిగిన నల్లబర్లీ సాగుతో రైతులకు తీరని కష్టాలొచ్చాయి. నాటు వేసే సమయంలో ఆకాశాన్నంటిన నారు ధరలు, నాటు కూలీ, పైరు పెరిగే దశలో కురిసిన వర్షాలతో సతమతమయిన రైతులు ఆకు వొలిచే సమయానికి ఏర్పడిన కూలీల కొరత, పెరిగిన కూలి రేట్లు రైతులను కుంగదీశాయి. అష్టకష్టాలు పడి పండించిన పొగాకు కొనుగోలుకు నోచుకోక పోవ నిల్వఉంచేందుకు అనువైన స్థలాలు లేక, మండెల వద్ద కాపలాకాయలేక సతమతమవుతున్నారు.

కంపెనీల కొర్రీలతో తెల్లబర్లీ అమ్మకాల్లో ఇబ్బందులు

గత ఏడాది దొరికిన ప్రతి పొగాకు చెక్కును వెంటబడి కొన్న కంపెనీలు ఈ ఏడాది మార్కెట్లో పుష్కలంగా సరుకు ఉండడంతో తమకు మేలిమి బంగారం కావాలంటూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. తెల్ల బర్లీ కొనుగోళ్లు జరుగుతున్న తీరు ఇందుకు అద్దం పడుతుంది. ఆరుగాలం కష్టపడి పండించిన తెల్లబర్లీ పొగాకు చెక్కులు అమ్మకానికి పెడితే మచ్చ ఉందని, రంగు ఆశాజనకంగా లేదని, తేమ శాతం పేరుతో విధిస్తున్న ధరల కోత, వెనుకకు పంపుతున్న పొగాకు బేళ్లతో రైతులు కుంగిపోతున్నారు. మార్కెట్ మాయాజాలంలో తెల్లబర్లీ రైతులు అవస్థలు పడుతుంటే, నల్లబర్లీ కొనుగోళ్ల ఊసే లేని పరిస్థితితో రైతులు కంటతడి పెడుతున్నారు. కంపెనీలు కొనుగోళ్లు ప్రారంభించేలా ప్రభుత్వం తగు చర్యలు చేపట్టి తమను ఆదుకోవాలని బర్లీ రైతులు వేడుకుంటున్నారు.

కంపెనీలు రంగంలోకి దిగాలి



పొగాకు కంపెనీలు పొగాకు సాగు చేయాలని రైతులను ప్రోత్సహించాయి. ఈ మేరకు మండలంలో సుమారు 5 నుంచి 6వేల ఎకరాల్లో బర్లీ పొగాకును సాగు చేశారు. ఏవైతే కంపెనీలు చెప్పాయో ఆ ప్రతినిధులు వెంటనే రంగంలోకి వచ్చి రైతుల వద్ద ఉన్న పొగాకు ఉత్పత్తులను కొనుగోలు చేయాలి. ఈ విషయంలో జాప్యం జరిగితే రైతులు నష్టపోతారు.

- డీ.సుబ్బారెడ్డి, వ్యవసాయాధికారి



కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో స్వరూపారాణి

పీ-4 సర్వేకు సహకరించాలి

పంగులూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం స్వర్ణాంధ్ర - 2047లో భాగంగా ప్రతి ఇంటికీ అభివృద్ధి, ప్రతి జీవితానికి ప్రగతి అనే నినాదంతో నిర్వహిస్తున్న పీ-4 సర్వేకు ప్రజలు సహకరించాలని ఎంపీడీవో స్వరూపారాణి కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం పీ4 సర్వేకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన పోస్టర్‌ను ఎంపీడీవో ఆవిష్కరించారు. పేదల ప్రగతికి పరస్పర సహకారంతో ప్రభుత్వం, దాతలు, ప్రజల భాగస్వామ్యంతో చేపడుతున్న పీ-4 సర్వేపై ప్రజలు క్యూఆర్ కోడ్ ద్వారా అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు. ఈ నెల25 వరకు చేపట్టే సర్వేను ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీవో సూచించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ హనుమంతరావు, ఈవోఆర్డీ సుమంత్, ఏవో సుబ్బారెడ్డి, కార్యాలయ సూపరింటెండెంట్ రమేష్, కార్యదర్శి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశీలించిన ఎంపీడీవో

చినగంజాం : మండల పరిధిలో జరుగుతున్న పబ్లిక్, ప్రైవేట్ పీపుల్ పార్టనర్ షిప్ (పీ-4) సర్వేని ఎంపీడీవో ఏ శ్రీనివాసమూర్తి సోమవారం పరిశీలించారు. పలు గ్రామాల్లో జరుగుతున్న పీ-4 సర్వేని ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. సర్వేలోని ప్రశ్నలకు సంబంధించిన వివరాలను నమోదు చేయడంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పేదిరిక నిర్మూలన కోసం ప్రభుత్వం ఈ సర్వేని చేపట్టినట్లు తెలిపారు. ఈ సర్వే ద్వారా పేదకుటుంబాలను గుర్తించి వారి జీవనప్రమాణాలను మెరుగు పరచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులతో ఈ నెల 18వ తేదీ వరకు సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



ప్రమాదంలో పూర్తిగా కాలిపోయిన ఇల్లు

జరుబులవారిపాలెం(పర్చూరు), మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రేకుల షెడ్‌తో ఉన్న ఇల్లు దగ్ధమైన ఘటన కారంచేడు మండల పరిధిలోని జరుబులవారిపాలెంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మహాలక్ష్మి ఇల్లు ప్రమాదంలో కాలిపోయింది. ఇంట్లో ఎవరూలేని సమయంలో అగ్నిప్రమాదం జరగడంతో పెనుప్రమాదం తప్పింది. సుమారు రూ.2లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగిందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చినా సకాలంలో స్పందించకపోవడంతో తన ఇల్లు పూర్తిగా కాలిపోయిందని ఆమె విలపిస్తున్నారు. గ్రామస్థులు ట్యాంకర్ ద్వారా నీటిని తెచ్చి మంటలను అదుపుచేశారు.

ఆందోళనకు గురికాకుండా పరీక్షలు రాయండి

చీరాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా పదో తరగతి పరీక్షలను రాయాలని కృతి ఫౌండేషన్ చైర్మన్ ఆకురాతి వెంకట అశ్విని, భట్టు ప్రదీప్ దంపతులు సూచించారు. ఏపీ మోడల్ స్కూల్ నుంచి పది పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు పరీక్ష పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, ఎస్ఎంసీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి చైర్మన్ జైసన్‌బాబు, నాయకులు

చీరాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పరిపాలన విఫలమైందని ఇచ్చిన హామీలు విస్మరించి ప్రజలను మభ్య పెడుతున్నారని మునిసిపల్ ఇన్‌చార్జి చైర్మన్ బొనిగల జైసన్‌బాబు అన్నారు. సోమవారం చైర్మన్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈనెల 12వ తేదీన జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు యాతం మేరిబాబు, ప్రసాద్, రమణారెడ్డి, చిరంజీవి, వాసు పాల్గొన్నారు.

ఇంకొల్లు, : విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఈ నెల 12న తలపెట్టిన యువతపోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైసీపీ ఇన్‌చార్జి గాదె మధుసూదనరెడ్డి కోరారు. సోమవారం మండలంలోని పావులూరులో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

స్కూటీని ఢీకొన్న కంటైనర్ లారీ

పాస్టర్ మృతి



బాలసుందరం మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రవితేజ

అద్దంకి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : స్కూటీని పక్కగా వెళ్తున్న కంటైనర్ లారీ ఢీకొనడంతో పాస్టర్ అత్తోటి బాలసుందరం (72) అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కలవకూరు చెందిన బాలసుందరం సోమవారం సాయంత్రం స్కూటీపై వెళ్తుండగా అద్దంకి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆగి ఉన్న కారు పక్క గుండా వెళ్లే క్రమంలో వెనుక నుంచి వెళ్తున్న కంటైనర్ లారీ వెనుక భాగం స్కూటీని ఢీకొట్టింది. దీంతో బాలసుందరం అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనాస్థలాన్ని ఎస్సై రవితేజ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎన్ఆర్ఐ పవన్, ఎఫర్ట్ ప్రతినిధులు

పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తాం

కొమ్మినేనివారిపాలెంలో ఆర్వోప్లాంట్‌ను ప్రారంభించిన ఎన్ఆర్ఐ

బల్లికురవ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : తాను ఎంత ఉన్నత స్థానంలో ఉన్నా తనకు విద్యను అందించిన పాఠశాలను జీవితంలో మరిచిపోనని ఎన్ఆర్ఐ కరిశెట్టి పవన్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కొమ్మినేనివారిపాలెం ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ పవన్, ఎఫర్టు సంస్థ ద్వారా సుమారు రూ.3లక్షలు ఖర్చు చేసి విద్యార్థుల కోసం మినరల్ ఆర్వో ప్లాంట్, లైబ్రరీని ఏర్పాటు చేసి వారి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సభకు ప్రధానోపాధ్యాయుడు పాలపర్తి రామాంజనేయులు అధ్యక్షత వహించారు. ఎన్ఆర్ఐ, పీజీఎస్ఎఫ్ ప్రతినిధి అయిన పవన్ మాట్లాడుతూ తన జీతంలో 30 శాతాన్ని పాఠశాలల అభివృద్ధికి ఖర్చు చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎఫర్టు ప్రతినిధులు మురళీకృష్ణ, లక్ష్మయ్య, ఎంపీటీసీ సభ్యుడు మిన్నెకంటి రామారావు, టీడీపీ గ్రామ నాయకులు ఏల్చూరి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

యూత్ ఫెస్టివల్ పోటీల్లో సెయింట్ ఆన్స్ ప్రతిభ



విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

చీరాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయి యూత్ ఫెస్టివల్ వాలీబాల్ పోటీల్లో చీరాల సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి విన్నర్స్‌గా నిలిచారు. ఈనేపథ్యంలో సోమవారం కళాశాల ప్రాంగణంలో విజేతలను సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ప్రత్యేకంగా అభినందించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గుంటూరు ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వారు ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 26 జట్లు పాల్గొనగా ఉన్నతంగా రాణించి విజేతలుగా నిలువడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.జగదీష్, వ్యాయామ ఉపాధ్యాయుడు అన్నం శ్రీనివాసరావు క్రీడాకారులను అభినందించారు.

నేటి నుంచి దివ్యాంగులకు కంటి పరీక్షలు

చినగంజాం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో దృష్టి లోపంతో పెన్షన్లు పొందుతున్న దివ్యాంగులకు ఈ నెల 11, 12, 17వ తేదీల్లో చీరాల ఏరియా వైద్యశాలలో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి తెలిపారు. పెన్షన్ల రీ వెరిఫికేషన్‌లో భాగంగా దివ్యాంగులకు కంటి వైద్య పరీక్షలు జరుపుతున్నట్లు తెలిపారు. గతంలో వారు తీసుకున్న మెడికల్ సర్టిఫికెట్లను రీ వెర్ఫికేషన్ కోసం మరలా దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంటి వైద్య పరీక్షలకు దివ్యాంగులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీవో తెలిపారు.

రామాపురంలో సమస్యలు పరిష్కరించాం

- అభివృద్ధికి సహకరించండి
- అసెంబ్లీలో ఎమ్మెల్యే కొండయ్య



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా సముద్రతీరానికి వచ్చిన పర్యాటకులు తిరిగి వెళ్లే విషయమై ప్రశ్నార్థకమైన రోజులు ఎదురయ్యాయని, ఈనేపథ్యంలో పటిష్టమైన చర్యలు తీసుకుని సాధారణ పరిస్థితులను ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రామాపురంలో ఇప్పటికే అనేక సమస్యలు పరిష్కరించామని వివరించారు. చీరాల నియోజకవర్గంలోని సహజసిద్ధమైన సముద్రతీరానికి పోలీస్ పర్యవేక్షణ కచ్చితంగా ఉందని, ప్రస్తుతం ఎక్కువ భాగంలో పర్యవేక్షణ చేస్తున్న ఈపూరుపాలెం పోలీస్ స్టేషన్ సిబ్బంది కొరత కారణంగా సామర్థ్యం సరిపోదని, సముద్రతీరానికి ప్రత్యేక పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని సభలో కోరారు. అలా గే తాగునీరు, విద్యుత్ సౌకర్యం కోసం సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరా రు. అంతేకాకుండా రామాపురం నుంచి సూర్యలంక వరకు కనెక్టివిటీ రోడ్డును ఏర్పాటు చేయడం వలన ఆదాయంతో పాటు ప్రజలకు సౌకర్యాలు సక్రమంగా అందుతాయని వివరించారు.

వేంకటేశ్వరస్వామి పాదాల నిర్మాణానికి భూమిపూజ

బల్లికురవ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో వేంకటేశ్వర స్వామి పాదాలను ఏర్పాటు చేసేందుకు భక్తులు సమష్టి కృషితో ముందుకు వచ్చారు. సోమవారం పోలేరమ్మ దేవాలయం పక్కన నూతనంగా స్వామి పాదాలు, అరుగు నిర్మాణం చేపట్టేందుకు భూమి పూజ నిర్వహించారు. నెల రోజుల్లో పనులు పూర్తి చేయిస్తామని ఈసందర్భంగా భక్తులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన భక్తులు పాల్గొన్నారు.

కాలువలో కరెంట్ పోల్

- నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం
- పట్టించుకోని అధికారులు



ప్రాసంగులపాడు ఎస్సీ కాలనీలో స్తంభం ఉంచి కడుతున్న కాలువ

మేదరమెట్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం, పంచాయతీలు లక్షలు వెచ్చించి గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తుంటే, కాంట్రాక్టర్లు మాత్రం అస్తవస్తంగా నిర్మాణ పనులు చేపడుతున్నారు. నాణ్యత లేకుండా కొత్త నిర్మాణాలు చేపట్టడంతోపాటు ప్రజలకు ఉపయోగం లేకుండా చేస్తున్నారు. మండలంలోని ప్రాసంగులపాడు ఎస్సీ కాలనీలో మురుగునీరు, వర్షపు నీరు పోయేందుకు కాలువలను నిర్మిస్తున్నారు. విద్యుత్ స్తంభాన్ని మధ్యలో పెట్టి కాలువను నిర్మిస్తున్నారు. ఇలా కరెంట్ పోల్ అడ్డంగా ఉంటే మురుగు ఎలా పారుతుందని ప్రజలు ముక్కునవేలేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్, సర్పంచ్, వార్డు మెంబర్లు కనీస పర్య వేక్షణ లేకపోవడంవల్లే కాంట్రాక్టర్‌లు నిర్లక్ష్యంగా కాలువను నిర్మిస్తున్నారని ఎస్సీకాలనీ వాసులు విమర్శిస్తున్నారు. ఇలా నిర్లక్ష్యంగా ఈ విధంగా విద్యుత్ స్తంభాలను కాలువ మధ్యలో పెట్టి నిరిళిస్తే మురుగునీరు ఎ లా పారుతుందని, ఎస్సీ కాలనీ వాసులు కాంట్రాక్టర్‌లను ప్రశ్నించిన స్పందన కరువైయింది. ఎస్సీ కాలనీలో ఇలా నాసిరకంగా కాలువలు నిర్మించడం వలన పంచాయతీ నిధులు దుర్వినియోగం కావడంతో పాటు కాలువలకు ఉపయోగం లేకుండా పోయింది. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి కాలువల నిర్మాణాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఘనంగా సంప్రోక్షణ పూజలు

చినగంజాం, మార్చి 10(ఆంధ్రజ్యోతి) : సీతారామాలయంలో ప్రాంగణ సంప్రోక్షణ పూజలను సోమవారం ఘనంగా నిర్వహించారు. వందేళ్ల నాటి సీతారామాలయం శిథిలావస్థకు చేరడంతో ఇటీవల ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఆలయాన్ని తొలగించారు. నూతన ఆలయ నిర్మాణ కార్యక్రమంలో భాగంగా సంప్రోక్షణ పూజలు జరిపారు. ఆలయ అర్చకులు మోహనలక్ష్మీనరసింహాచార్యులు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వలివేటి రామానుజం, మోటుమర్రి రామసుబ్బారావు దంపతులచే శాస్త్రోక్తంగా సంప్రోక్షణ పూజలు చేశారు. అనంతరం గ్రామ పెద్దలు, మహిళా భక్తులు ఆలయ ప్రాంగణమంతా నవధాన్యాలను చల్లారు. ఆలయ ప్రాంగణంలోనే ఏప్రిల్ 6వ తేదీన శ్రీరామనవమి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

రేపు స్వామివార్ల కల్యాణ మహోత్సవం

ఉప్పుటూరు (పర్చూరు), మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఉప్పుటూరు గ్రామంలోని శ్రీ గంగా పార్వతీ సమేత అమరేశ్వర స్వామి, శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రేశ్వర స్వామి వార్ల కల్యాణ మహోత్సవం ఈనెల 12న జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి దామా నాగేశ్వరరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్ల కల్యాణ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

16న మాలల సాంస్కృతిక కళా జాతర



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వెంకట్రావు తదితరులు

అద్దంకిటౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మార్చి 16న ఒంగోలులోని అంబేద్కర్ కళా ఆడిటోరియంలో జరగనున్న మాలల సాంస్కృతిక కళా జాతరలకు నియోజకవర్గంలోని అందరు పాల్గొని జయప్రదం చేయాలని మాలల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు కోరారు. సోమవారం శింగరకొండలోని జై భీమ్ మాలల సత్రం ప్రాంగణంలో మాలల మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు అంకం కిరణ్‌కుమార్ అ ధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో లక్ష మాల కుటుంబాలు కళలపై ఆధారపడి దుర్భర జీవితాలను గడుపుతున్నాయన్నారు. వీరికి నేటి వరకూ ప్రభుత్వాల నుంచి ఎటువంటి పెన్షన్స్, పక్కా గృహాలు, సంక్షేమ పథకాలు అందలేదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చప్పిడి వెంగళరావు, డి.కృష్ణ, కోండ్రు వీరాంజనేయులు, రాజశేఖర్, పూర్ణచంద్రరావు, అంకమ్మరావు, శ్రీనివాసరావు, శ్రీకృష్ణ, రవి, వికాస్, మరియదాసు పాల్గొన్నారు.

టిప్పర్‌ను ఢీకొన్న మరో టిప్పర్

అద్దంకి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న టిప్పర్‌ను వెనుక నుంచి మరో టిప్పర్ ఢీకొనడంతో డ్రైవర్‌కు పున్నయ్యకు గాయాలయ్యాయి. పట్టణంలోని నామ్ రోడ్డులో పాత పెట్రోల్ బంక్ సమీపంలో సోమవారం ఆగి ఉన్న టిప్పర్‌ను వెనుక నుంచి మరో టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మార్టూరు మండలం తాటివారిపాలెంకు చెందిన టిప్పర్ డ్రైవర్ పున్నయ్యకు గాయాలు కావడంతో ఆసుపత్రిలో చేర్పించారు.


కార్యాలయ కౌంటర్‌లోనే పన్ను చెల్లించండి

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు

మున్సిపల్ కమిషనర్ రవీంద్ర

అద్దంకి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పన్నులు చెల్లింపు దారులకు పన్ను చెల్లించమని కమిషనర్ పేరుతో ఫోన్ చేసి ఫోన్‌పే చేయమని చెపితే ఎట్టి పరిస్థితులలో చెల్లింపులు చేయరాదని అద్దంకి మున్సిపల్ కమిషనర్ రవీంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ట్రేడ్ లైసెన్స్ చెల్లింపు దారులకు 7670906441 నెంబర్ నుంచి ఫోన్ చేసి మున్సిపల్ కమిషనర్‌గా చెప్పి ఆన్‌లైన్ పేమెంట్ చేయమని అడుగుతున్నట్లు పలువురు నుంచి ఫిర్యాదుల వచ్చాయని, ఆ ఫోన్‌నెంబర్ తనది కాదని కమిషనర్ వివరించారు. సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది మాత్రమే పట్టణంలో పన్నుల వసూలు చేస్తున్నారని తెలిపారు. ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా ఎట్టి పరిస్థితిలోనూ చెల్లింపుల చేయరాదన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఉన్న కౌంటర్‌లో ట్యాక్స్ చెల్లించి మోసాలకు గురి కాకుండా ఉండాలన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
మంగళవారం 11 మార్చి 2025



క్వింటం శనగ ధర రూ.5670

- రంగు మారిన, నాణ్యతలేనివి కొనం
- నేటి నుంచి రిజిస్ట్రేషన్లు : జేసీ



నెల్లూరు (వ్యవసాయం), మార్చి 10(ఆంధ్రజ్యోతి) : నాణ్యమైన శనగ దిగుబడులను క్వింటం రూ.5670 కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 8,666 ఎకరాల్లో శనగ సాగవగా, కనీస మద్దతు ధర లభించకపోతే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. రైతులు వీపీఏలను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. మార్చి 11 నుంచి 20వతేదీ వరకు ఈ ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. రోజుకు ప్రతి రైతు నుంచి 25 క్వింటాలు మాత్రమే కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. 15రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాకు నగదు జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. నాణ్యతా ప్రమాణాల విషయంలో 14శాతం తేమ, ఒకశాతం ఇతర వ్యర్థ పదార్థాలు, దెబ్బతిన్న పప్పు దినుసు గింజలు 3శాతం, కొద్దిగా దెబ్బతిన్న, రంగులేని పప్పు దినుసు గింజలు 4 శాతం, పక్వానికి రాని, ముడత పప్పు దినుసులు గింజలు 6శాతం, పురుగు పట్టిన పప్పు దినుసు గింజలు 4శాతానికి మించి ఉండరాదని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. కొనుగోలు విషయాల్లో ఇబ్బందులు ఎదురైతే 8978381839, 8985084988, 9908203264, 6309009805 నెంబర్లకు ఫోన్ చేయాలని జేసీ రైతులను కోరారు.

- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 3182.50 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు జేసీ మరో ప్రకటనలో తెలిపారు. సోమవారం 571.280 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు.

ఒకరి అవసరాలు మరొకరికి ఆదాయ వనరుగా మార్చుకుంటుంటారు. అక్రమ సంపాదన కోసం రకరకాల మార్గాలు ఎంచుకుంటూ అందినకాడికి దండేసుకుంటూ ఉంటారు. ఇది ప్రతిచోటా జరిగేదే. ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షల్లోనూ ఇదే తంతు జరుగుతోంది. కారుణ్య నియామకాలు పొందిన వారు, మధ్యలో చదువు మానేసిన వారు ఈ ఓపెన్ స్కూలు పరీక్షలు రాస్తుంటారు. అయితే, కారుణ్య నియామకాలు పొందిన వారి అవసరాలను అధికారులు సొమ్ము చేసుకుంటున్నారు. 'పరీక్షలు జరుగుతున్నప్పుడే కదా! మా జేబులు నిండేది' అన్న ధోరణిలో వ్యవహరిస్తూ మాస్ కాపీయింగ్‌కు సహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇందుకుగాను ఒక్కో అభ్యర్థి నుంచి రూ.వేలల్లో నగదు వసూలు చేస్తున్నట్లు సమాచారం. అదెలాగో ఈ కథనం చదవండి.

- కావలి, (ఆంధ్రజ్యోతి)

అంతా 'ఓపెనే'!

- 'ఓపెన్ స్కూల్' ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్
- కేంద్రాలకు చేరుతున్న సమాధానాల నకళ్లు
- ఒక్కో అభ్యర్థి నుంచి రూ.వేలల్లో వసూలు
- ఇన్విజిలేటర్ల నుంచి ఉన్నతాధికారుల వరకు పంపకాలు

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్‌స్కూల్) ఇంటర్ పరీక్షలు ఈ నెల 3వ తేదీన ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 20 కేంద్రాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతున్నాయి. మొత్తం 3,580 మంది పరీక్షలు రాస్తున్నట్లు సమాచారం. మాస్ కాపీయింగ్ జరగకుండా 200 మంది ఇన్విజిలేటర్స్, డిపార్ట్‌మెంటల్ అధికారులు, సిట్టింగ్ స్క్వాడ్స్, ఫ్లైయింగ్ స్క్వాడ్స్‌ను నియమించినట్లు అధికారులు చెప్పారు. ఏవైనా సమస్యలు ఉంటే 8341408109కు ఫోన్ చేయాలని కూడా ప్రకటించారు. అయితే, ఆచరణలో ఉన్నతాధికారులు చేతులెత్తేయగా స్థానికంగా ఉంటున్న అధికారులు మాత్రం పరీక్షలు జరుగుతుండగానే జేబులు నింపుకోవాలన్న ధోరణిలో వ్యవహరిస్తున్నారు.



కావలి : ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలు జరుగుతున్న జడ్పీ స్కూల్ ప్రధాన గేటుకు వేసి ఉన్న తాళం

కాపీయింగ్ ఇలా..

స్థానికంగా ఉంటున్న జెరాక్స్ సెంటర్ల నుంచి కనిష్ఠంగా 50 మార్కుల సమాధానాలతో కూడిన జిరాక్స్ కాపీలను ఆయా కేంద్రాలకు చేరవేస్తున్నట్లు సమాచారం. ఒక్కో అభ్యర్థి నుంచి రూ.10-15 వేల వరకు వసూలు చేసినట్లు సమాచారం. ఇలా సేకరించిన నగదును పరీక్ష కేంద్రంలో ఇన్విజిలేటర్ల నుంచి సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్, జిల్లాస్థాయి ఉన్నతాధికారుల వరకు చేరవేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసమే కొందరు ఉపాధ్యాయులు ఈ పరీక్షలకు ఇన్విజిలేటర్లుగా వచ్చేందుకు పైరవీలు కూడా చేయించుకుం టున్నట్టు సమాచారం. ఇక పరీక్ష కేంద్రాల ప్రధాన గేట్లు మూసివేసి, కాపలాగా ఓ వ్యక్తిని నియమించి లోపల కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్నారు. ఏదైనా స్క్వాడ్ తనిఖీలకు వస్తుంటే ముందుగానే వీరికి సమాచారం అందిపోతుంది. స్క్వాడ్ వచ్చి వెళ్లేంతవరకు మౌనం దాల్చి ఆ తర్వాత తిరిగి కాపీయింగ్‌కు సహకరిస్తున్నారు.

పాతూరు కేంద్రంగా..

జిల్లావ్యాప్తంగా 20 కేంద్రాలలో పరీక్షలు జరుగుతుండగా, కావలి పట్టణంలోనే ఐదు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఒక్కో కేంద్రంలో 120 నుంచి 150 వరకు అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. పాతూరు సెంటర్‌లోని ఓ జెరాక్స్ సెంటర్ నుంచి సమాధానాల నకళ్ల కాపీలు అభ్యర్థులకు అందిస్తున్నట్లు సమాచారం. పరీక్ష ప్రారంభమైన ఒక గంట తర్వాత అవి కేంద్రాలకు చేరతాయి. ఇటీవల కావలిలో కొన్ని కేంద్రాలను డీఈవో బాలాజీరావు తనిఖీ చేయగా ఆయన వచ్చి వెళ్లిన తర్వాత యథాప్రకారం కాపీయింగ్ జరిగిందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. కాపీయింగ్ జరుగుతున్నట్లు కొంతమంది డీఈవోకు ఫిర్యాదు చేసినా తాము పకడ్బందీగానే జరుపుతున్నట్లు తెలిపారు. అయితే, కాపీయింగ్ మాత్రం అడ్డూఅదుపులేకుండా జరుగుతూనే ఉంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఓపెన్ స్కూలు ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా జరిగేలా చూడాలి.



దేవతలారా.. రారండి!

రంగడు, ప్రసన్నుడి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం
వేడుకగా ధ్వజారోహణం.. తొలిరోజు శేషవాహనంపై దర్శనం

నెల్లూరు (సాంస్కృతికం)/బిట్రగుంట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : 'ఎంతో వైభవోపేతంగా నిర్వహించదలచిన స్వామివారి బ్రహ్మోత్సవాలకు దేవతల్లారా రారండి.' అంటూ ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ నెల్లూరులోని రంగనాథ స్వామి ఆలయం, బోగోలు మండలంలోని బిలకూట క్షేత్రంలో ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో సోమవారం ధ్వజారోహణ కార్యక్రమం వేడుకగా జరిగింది. నగరంలోని రంగనాథుడి ఆలయంలో ఉదయం ధ్వజారోహణం కనుల పండువగా జరిగింది. తొలుత గరుడ ధ్వజపటాన్ని పద్మశాలీ సంఘం ఊరేగింపుగా తీసుకొచ్చింది. అనంతరం విశేష పూజలు చేసి సకల దేవతలను బ్రహ్మోత్స వాలకు ఆహ్వానం చేశారు. అనంతరం ధ్వజస్తంభానికి కట్టారు. అనంతరం కోడిముద్దలను సంతానం లేని మహిళల కు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఏర్పా టు చేసి సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం రాత్రి స్వామివారు శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ధర్మకర్తలు, ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి, అర్చకులు సిబ్బంది పర్యవేక్షించారు.

- బిలకూట క్షేత్రంలో తిరుమంజన కార్యక్రమం వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం గర్భాలయాల శుద్ధి, మూలవిరాట్‌తో పాటు చిన్న ఉత్సవర్లకు అభిషేకాలు జరిగాయి. డాక్టర్ ప్రవీణ్ కుమార్, నరకూచి వెంకటనరస య్య జూటూరి శివరామకృష్ణమూర్తి దంపతులు స్వామి, అమ్మవార్లకు వస్త్రాలు అందజేశారు. సాయంత్రం జరిగిన ప్రత్యే క పూలంగి సేవ, రాత్రి ధ్వజారోహణ కార్యక్రమం జరిగొంది. కోడిముద్దల కోసం మహిళలు ఎగబడ్డారు. అనంతరం ప్రసన్న వేంకటేశ్వర స్వామి కృష్ణావతారంలో శేషవాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు.



శేషవాహనంపై దేవేరులతో కొలువుదీరిన రంగనాథుడు

బిట్రగుంట : ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పండితులు



బిట్రగుంట : కొడిముద్దల కోసం వేచిఉన్న భక్తులు

పక్కా గృహాలకు నగదు పెంపు

- కూటమి ప్రభుత్వం నిర్ణయం ● ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వరం

నెల్లూరు (జడ్పీ, ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. స్థలాలు ఇచ్చినా చాలీచాలని నిధులతో ఇళ్ల నిర్మించుకోలేకున్న పేదలు, పథకాన్ని పూర్తిగా సద్వినియోగం చేసేలా నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన జీవోను సోమవారం జారీ చేసింది. నిరుపేద కుటుంబానికి ఇప్పటి వరకు ప్రభుత్వం స్థలం ఇవ్వడంతోపాటు గృహ నిర్మాణానికి రూ.1.80 లక్షలు మంజూరు చేసేది. ఇంటి నిర్మాణానికి ఆ నిధులు చాలక ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన నిరుపేద కుటుంబాలు ఇళ్ల నిర్మించుకోలేక, ప్రభుత్వ సొమ్ము చాలక, అప్పులు చేయలేక నిర్మాణాలకు దూరంగా ఉంటున్నారు. ప్రభుత్వం కాంట్రాక్టర్ల చేత ఇళ్ల నిర్మాణాలు చేపడు తూ వస్తున్నా, అవి అసంపూర్తిగా, నాసిరకంగా ఉంటున్నాయి. దీంతో ప్రతి పేదకుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చాలని ఆలోచించిన కూటమి ప్రభుత్వం నిర్మాణాలకు నగ దు మంజూరును పెంచుతూ నిర్ణయం తీసుకుంది. నిరుపేద కుటుంబాలైన ఎస్సీ, బీసీలు, ఎస్సీలకు ఇచ్చే రూ.1.80లక్షలకు అదనంగా మరో రూ.50 వేలు ఇవ్వాలని నిర్ణయించిం ది. అలాగే ఎస్టీలకు రూ.75వేలు అదనంగా ఇవ్వనున్నది.

నీటిపారుదల పైపులకు రూ.35లక్షల మంజూరు

- రైతులకు 50శాతం రాయితీపై అందజేత

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ పోషకాహార పోషణ, ఆహార భద్రత, పప్పు దినుసులు, చిరు ధాన్యాలు, జాతీయ నూనె గింజలు.. తదితర పథకాల కింద రైతులకు నీటిపారుదల పైపులను 50శాతం రాయితీపై అందించేందుకు జిల్లాకు రూ.35లక్షలు మంజూరైనట్లు జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 70 వేల హెక్టార్లు లక్ష్యం కాగా, ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన(పీఎంకేఎస్‌వై) మార్గదర్శకాల ప్రకారం 50శాతంగానీ గరిష్ఠంగా రైతుకు ఐదు ఎకరాల వరకు రూ.15వేలు సబ్సిడీ అందుతుందని పేర్కొన్నారు. ఏపీ ఎంఐపీ ద్వారా గుర్తింపు పొందిన కంపెనీల నుంచి రైతులు నీటి పైపులు కొనుగోలు చేసి బిల్లులు అందజేయాల్సి ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని ఆమె తెలిపారు.



వీఎస్‌యూ వీసీ శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఎన్ఐవోటీ శాస్త్రవేత్తలు

సాంకేతికత రంగాల్లో ఎన్ఐవోటీ సహకారం అవసరం

వెంకటాచలం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : సముద్ర పరిశోధన, సాంకేతికత రంగాలలో ఎన్ఐఓటీ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ) సహకారం వీఎస్‌యూకు ఎంతో అవసరమని ఆ వర్సిటీ వీసీ అల్లం శ్రీనివాసరావు తెలిపారు. చెన్నైలోని ఎన్ఐఓటీ కేంద్రాన్ని సోమవారం వీఎస్‌యూ ప్రతినిధుల బృందంతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఎన్ఐఓటీతో కలిసి వీఎస్‌యూ పని చేసేందుకు అవగాహన ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్నాయన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా విద్యార్థులు, అధ్యాపకులు ఎన్ఐఓటీ ఆధునిక సౌకర్యాలను ఉపయోగించి పరిశోధనలు చేయగలరని ఆకాంక్షించారు. ఎన్ఐఓటీ నిపుణుల మార్గదర్శకత్వంలో మెరైన్ బయాలజీ సముద్ర సాంకేతికతలో కొత్త ప్రాజెక్టులు ప్రారంభించవచ్చన్నారు. ఈ సహకారంతో సముద్ర వనరుల వినియోగం, పరిరక్షణలో నూతన పరిజ్ఞానాన్ని అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం ఎన్ఐఓటీ డైరెక్టర్ బాలాజీ రామకృష్ణన్, శాస్త్రవేత్తలు జీ ధరణి, వినీత్‌కుమార్, సచితానందం, గర్లపాటి దేవిరామ్‌తో కలిసి పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ కే సునీత, ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, మెరైన్ బయాలజీ అధ్యాపకులు పాల్గొన్నారు.

బ్యాంకుల నుంచి అందుతున్న నోటీసులతో సతమతమవుతున్న టిడ్కో గృహాల లబ్ధిదారులకు భారీ ఊరట లభించింది. ఐదేళ్లుగా పడుతున్న బాధలను తీరుస్తూ కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇళ్లు పొందకపోయినా కొందరు లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి మాత్రం రుణాలు మంజూరయ్యాయి. ఈ రుణాలను ప్రభుత్వం జమ చేసుకుందే కానీ, లబ్ధిదారుడికి ఇంటిని అప్పగించలేదు. ఈఎంఐలు చెల్లించాలంటూ బ్యాంకర్ల నుంచి నోటీసులు అందుతుండటంతో పేదలపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. ఇప్పటికే కొంతమంది ఎన్‌పీఏగా (మొండి బకాయిదారులు) ముద్ర వేసుకున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఈ బకాయి ఈఎంఐలను బ్యాంకులకు చెల్లించేందుకు రూ.148 కోట్లు మంజూరు చేసింది. అందులో జిల్లాలో 3,427 మంది బాధితులు ఉండగా, వారికి సంబంధించి సుమారు రూ.20 కోట్ల వరకు బ్యాంకు రుణాలను చెల్లించనున్నది.

గృహ రుణం.. తప్పింది భారం!

- 'టిడ్కో' లబ్ధిదారులకు భారీ ఊరట
- ఈఎంఐల చెల్లింపులకు రూ.20 కోట్లు విడుదల
- అర్హుల జాబితాలో 3,427 మంది
- త్వరలోనే జమ చేస్తాం : ఈఈ

నెల్లూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): 2014-19 మధ్య కాలంలో జిల్లాలోని మున్సిపాలిటీల్లో టిడ్కో గృహాలను నిర్మించడం ప్రారంభించారు. 2019 ఎన్నికల నాటికి కొన్ని ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించారు. మరి కొన్ని ఇళ్లు చివరిదశలో ఉన్నాయి. 365 చదరపు అడుగులు, 430 చదర పు అడుగుల విస్తీర్ణం కలిగిన ప్లాట్లను ఎక్కు వ మంది పేదలు ఎంపిక చేసుకున్నారు. 365 చదరపు అడుగుల ప్లాటు యూనిట్ విలువ రూ.7.55 లక్షలుగా అందులో బ్యాంకు రుణం రూ.3.15 లక్షలు ఉంది. మిగిలినది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీ కాగా రూ.25 వేలను మాత్రం లబ్ధిదారుడు నేరుగా చెల్లించాలి. ఇక 430 చదరపు అడుగుల ప్లాటు యూనిట్ విలువ రూ.8.55 లక్షలు కాగా, అందులో బ్యాంకు రుణం రూ.3.65 లక్షలు ఉంది. ఇలా అర్హులైన పేదలను ఎంపిక చేసి బ్యాంకు రుణాలు కూడా ఇప్పించారు. పూర్తయిన ఇళ్లను కొంత మందికి అప్పగించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక టిడ్కో ఇళ్ల నిర్మాణాలను ఆపేసింది. దీంతో చివరి దశలో ఉన్న ఇళ్లు పూర్తి కాలేదు. కానీ అప్పటికే లబ్ధిదారులకు మంజూరైన బ్యాంకు రుణాలను మాత్రం ప్రభుత్వం జమ చేసుకుంది. ఈ క్రమంలో నెలవారీ కంతులు (ఈఎంఐలు) చెల్లించాలంటూ బ్యాంకుల నుంచి లబ్ధిదారులకు నోటీసులు రావడం ప్రారంభమైంది. ఇటు ఇళ్లు అందకపోవడం, అటు నోటీసులు మాత్రం అందుతుండటంతో లబ్ధిదారులు సతమతమయ్యారు. ఇళ్లు ఇవ్వకపోవడంతో ఈఎంఐలు కట్టేందుకు లబ్ధిదారులు ముందుకు రాలేదు. దీంతో చాలామంది మొండిబకాయిదారులుగా మారిపోయారు. ఒక్కొక్కరికి రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. జిల్లాలో 3,427 మంది టిడ్కో ఇళ్ల రుణగ్రహీతలు బ్యాంకులకు ఈఎంఐలు చెల్లించడం లేదని అధికారులు గుర్తించారు. వాస్తవానికి ఈ విషయంలో గత ప్రభుత్వానిదే తప్పు. అప్పుడు ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించి ఉంటే వారు ఈఎంఐలు కట్టుకునేవారు.





బకాయిల చెల్లింపులకు నిధులు

దీంతో ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ బకాయి ఈఎంఐలను చెల్లించేందుకు నిర్ణయించింది. ఇందుకు సంబంధించి నిధులను కూడా విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలోనే ఈ బకాయిలను బ్యాంకులకు జమ చేయనుంది. జిల్లాలో 23,888 ఇళ్లు నిర్మాణం జరుపుకుంటుండగా ఇప్పటికి 13 వేల ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించారు. మిగిలిన ఇళ్లను ఈ ఏడాది ఆఖరులోపు పూర్తి చేసి, పేదలకు అందించాలన్న లక్ష్యంతో అధికారులు పనులు చేయిస్తున్నారు. ఈ విషయంపై టిడ్కో నెల్లూరు ఈఈ మహేష్‌ను సంప్రదించగా ఇళ్లు అందుకోని లబ్ధిదారులు చెల్లించాల్సిన ఈఎంఐలను చెల్లించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎవరెవరికి ఎంత బకాయిలు ఉన్నాయన్నది లెక్కిస్తున్నామని, త్వరలోనే జమ చేస్తామని ఆయన పేర్కొన్నారు.

- కిలోకు రూ.280 ధర పలికిన మేలు రకం పొగాకు

కందుకూరు-1లో పొగాకు వేలం ప్రారంభం



పొగాకు వేలం ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు, రైతు ప్రతినిధులు

కందుకూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కందుకూరు-1 పొగాకు వేలం కేంద్రంలో సోమవారం పొగాకు వేలం ప్రారంభమైంది. ఈ కేంద్రం పరిధిలోని తిమ్మపాలెం నుంచి 18 బేళ్లు వేలానికి రాగా కిలో పొగాకుకు రూ.280 ధర లభించింది. వేలం నిర్వహణాధికారి ఎం. కిరణ్ తొలిరోజు అన్ని బేళ్లు నాణ్యమైనవే వేలంకు రప్పించడంతో అన్నిబేళ్లకు అదే ధర దక్కింది. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు కార్యదర్శి దివి వేణుగోపాల్ వేలం ప్రక్రియను పర్యవేక్షించారు. రైతు ప్రతినిధులు, రైతుసంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ తొలిరోజు ధర బాగానే ఉన్నా పొగాకు సాగుకి పెట్టుబడి వ్యయం పెరిగినందున మరింత ప్రోత్సాహకరమైన ధరలు ఇవ్వాలిలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో రైతు ప్రతినిధులు జీ. కొండారెడ్డి, తానికొండ రమణయ్య, బాలకోటయ్య, బీజేపీ నాయకులు గట్టమనేని హరిబాబు,మన్నేపల్లి వరప్రసాదరావు పాల్గొన్నారు.

నాటి భోక్తల పాపం..
నేటి ఆదాయానికి శాపం!
- 'డీఎంహెచ్‌వో' ప్రాంగణంలో పాత భవనాల కూల్చివేత
- నాడు రూ.30 లక్షల విలువైన కలప తరలింపు
- నేడు రూ.1.67 లక్షలకే టెండర్లు
8

న్యూస్ బాక్స్

గ్రీవెన్స్‌కి నాలుగు వినతులు

కొండాపురం, మార్చి10(ఆంధ్రజ్యోతి): ప్రజావిజ్ఞప్తులదినం సందర్భంగా సోమవారం మండల కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి 4వినతులు వచ్చినట్లు తహసీల్దార్ కోటేశ్వరరావు, ఎంపీడీవో ఆదినా రాయణ తెలిపారు. రెవెన్యూవిభాగంలోని రెండు వినతులలో పాసుపుస్తకాలపై వచ్చినట్లు తెలిపారు. అలాగే జీతాలు అందడం లేదని ఇస్కదామెర్ల పంచాయతీ గ్రీన్ అంబాసిడర్లు వినతులు అందజేశారు.

వైభవంగా సరస్వతీ పూజ



పరీక్ష సామగ్రిని అందజేస్తున్న వెంకటరమణయ్య, తదితరులు

కొండాపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నేకునాంపేట జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మారుతి సోమవారం సరస్వతీపూజ నిర్వహించారు. పాఠశాల ఆవరణలోని సరస్వతీ విగ్రహానికి పదో తరగతి విద్యార్థినులతో ప్రత్యేక పూజలు చేయించారు. తూర్పు పాలెంలోని శివనాగుల క్షేత్రం నిర్వాహకులు పైడి రాజేష్ సౌజన్యంతో గ్రామ టీడీపీ నాయకుడు మామిళ్లపల్లి వెంకట రమణయ్య 23మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలిగిరివాసికి పీహెచ్‌డీ



కలిగిరి, మార్చి, 10 (ఆంధ్రజ్యోతి):జాతీయ అత్యుత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత నందనవనం ప్రభాకరరావు కుమారుడు నందనవనం వెంకటసాయిచంద్ సీజర్ డిటెక్షన్ (మూర్ఛవ్యాధి)ని పసిగట్టు పరికరం అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పించి పీహెచ్‌డీ పట్టాను పొందారు. ఎలక్ట్రానిక్స్ విభాగంలో ఎస్.గోపీ నాయక్ గారి మార్గదర్శనంలో మైసూరు విశ్వవిద్యాలయంలో న్యూరోటిక్ డికంపోజిషన్ బేస్డ్ ఫ్రేమ్ వర్క్ ఆన్ సీజర్ డిటెక్షన్ అంశంపై ప్రతిభ చూపాడు. సీజర్ డిటెక్షన్ అంటే మానవ మెదడు లేదా శరీరంలో సంభవించే అసాధారణ విద్యుత్ సంకేతాలను లేదా శారీరక మార్పులను గుర్తించడం.మూర్ఛ, అపస్మారక (ఏపీలెప్సీ) స్థితిలోకి వెళ్లిన వక్తుల కోసం ఉపయోగించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురు సాయిచంద్‌కు అభినందనలు తెలిపారు.

ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త సేకరించాలి



చెత్తను సేకరిస్తున్న ఈవోపీఆర్డీ నయీమ్ తాజ్ హసన్

బిట్రగుంట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటినుంచి తడి, పొడి చెత్తను తప్పనిసరిగా సేకరించేలా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఈవోపీఆర్డీ నయీమ్ తాజ్ హసన్ అన్నారు. సోమవారం జక్కేపల్లి గూడూరు, సుందరగిరి వారి కండ్రిక, బోగో లులో కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇళ్లలోని చెత్తను రోడ్లపై పారపోయకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా గ్రీన్ అంబాసిడర్స్‌కు అందజేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శులు జహీర్, చైతన్య, నరసింహులు, గ్రీన్ అంబాసిడర్లు, సిబ్బంది ఉన్నారు.

15 మద్యం సీసాల స్వాధీనం



కావలి రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి):పెదపట్టపుపాలెంలోని బెల్టు దుకాణంపై సోమవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. అనధికారికంగా మద్యం అమ్మకాలు చేపడుతున్న ఆవుల మౌలాలిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 15సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ దేవిక, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నసైజు గుడ్లు సరఫరా..

● కేజీబీవీ, అంగన్‌వాడీ కేంద్రాలపై

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

వలేటివారిపాలెం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలకు కాంట్రాక్టర్లు చిన్నసైజు గుడ్లు సరఫరా చేస్తున్నారు. మండ లంలో 53అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భవతులు, బాలింతలు సుమారు 2వేల మందికి పైగానే ఉన్నారు. అలాగే కేజీబీవీలో 250మందికి పైగానే విద్యార్థినులు ఉన్నారు. వారందరికీ ప్రతి రోజూ మెనూలో భాగంగా గుడ్లు అందజేస్తున్నారు. నాణ్యత లేని నాసిరకం గుడ్లు సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత నెలలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయ్‌కు మార్‌రెడ్డి మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి గుడ్లు తూకం వేసి 40గ్రాములు లోపు బరువు ఉండటంతో కాంట్రాక్టర్‌కు స్వయంగా ఫోన్ చేసి చెప్పినా చిన్న సైజు గుడ్లు సరఫరా చేస్తూనే ఉన్నారు. ఎవరైనా లబ్ధిదారులు ఈ విషయంపై ప్రశ్నిస్తే తీసుకుంటే తీసుకో.. లేకపోతే వద్దని అంగన్‌వాడీ నిర్వాహకులు సమాధానమిస్తున్నట్లు సమాచారం. పర్యవేక్షణాధికారుల కనుసన్నలోనే ఈ వ్యవహారం నడుస్తుందని విమర్శలు ఉన్నాయి.

గుడ్ల మాయాజాలం..

గుడ్లు ఇస్తున్నారు కదా చిన్నదైతే నేమి అనుకోవచ్చు. జరిగే మాయాజాలం అంతా అందుల్లోనే ఉంది. సాధారణంగా నిర్ణీత బరువు 50 గ్రాములున్న గుడ్డును పంపిణీ చేయాలి. ఫారం కోళ్లు పెట్టే గుడ్లు చాలా వరకూ తగ్గుతుంటాయి. వీటిని సంబంధిత కాంట్రాక్టర్ ఏరివేసి కేంద్రాలకు చిన్నసైజు గుడ్లను సరఫరా చేస్తున్నారు. ఇవి అయితే తక్కువ ధరకే వస్తాయని వారి ఆలోచన. అందుకే చిన్న సైజు గుడ్లు సరఫరా చేస్తున్నారు. తక్కువ పరిమాణం కలిగిన గుడ్లతో లక్షల్లో కమిషన్ రూపంలో చేరుతోంది ఇప్పటికైనా పర్యవేక్షణాధికారులు స్పందించి చిన్న సైజు గుడ్ల సరఫరా చేసే కాంట్రాక్టర్లపై చర్య తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



జమీన్‌ఉప్పులపాడులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం



కాంట్రాక్టర్ సరఫరా చేసిన గుడ్డు

14 అడుగలకు పడిపోయిన నీటిమట్టం

● రాళ్లపాడు ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 50..

అవుట్ ఫ్లో 100 క్యూసెక్కులు

● ఈ వేసవిలో తాగునీటికి ఢోకా

లేదంటున్న అధికారులు



ప్రాజెక్టు పాత స్పిల్‌వేలో కిందపడిన ఒకటో నంబరు గేటు కౌంటర్ వెయిట్



రాళ్లపాడు ప్రాజెక్టులోని నీరు

లింగసముద్రం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టులో నీటిమట్టం 14 అడుగులకు పడిపోయింది. సోమశిల ప్రాజెక్టు నుండి ప్రస్తుతం ప్రాజెక్టులోకి 50 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తోందని, ప్రాజెక్టు కుడి కాలువ నుండి 80క్యూసెక్కులు, ఎడమ కాలువ నుండి 20 క్యూసెక్కుల నీటిని వరి పైరుకు విడుదల చేస్తున్నట్టు ప్రాజెక్టు ఏఈ జి.చంద్రమౌళి చెప్పారు. ప్రస్తుతం ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో ముందుగా వేసిన వరి పంట కోతలు ప్రారంభం అయినట్లు మరికొన్ని చిన్న పైర్లకు ఈ నెలాఖరు వరకు నీటిని సరఫరా చేస్తామన్నారు. అయినప్పటికీ ఈ వేసవిలో తాగు నీటికి ఢోకా లేదని భరోసా ఇస్తున్నారు. ప్రాజెక్టు ఆధారంగా పనిచేసే భారీ మంచినీటి పథకాల పరిధిలోని సుమారు 100 గ్రామాలకు రోజుకు 7క్యూసెక్కుల నీరు విడుదల అవుతోందని, ఆవిరి రూపంలో 10క్యూసెక్కుల నీరు వృథా అవుతుందని చెప్పారు. గతే డాది అక్టోబరు, నవంబరు నెలల్లో కురిసిన వర్షాలకు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 21.5 అడుగుల వరకు నీరు చేరింది. రెండుసార్లు కొద్ది మోతాదులో నీటిని ఒక గేటు మాత్రమే ఎత్తి మన్నేరుకు విడుదల చేశారు. వరి కోతలు వచ్చే నెల 15వ తేదీ నీటికి పూర్తి అవుతుందని, తర్వాత వేసే పత్తి పైరుకు ఒకటి రెండు తడుల నీరు నీరు ఇచ్చినా ఇబ్బంది లేదంటున్నారు.

కౌంటర్ వెయిట్ ఎప్పుడు తొలగిస్తారో..?

రాళ్లపాడు ప్రాజెక్టు పాత స్పిల్‌వేలో సుమారు 17ఏళ్ల కిందట 1,3గేట్ల కౌంటర్ వెయిట్ల చైన్లు తెగిపోవడంతో కౌంటర్ వెయిట్ ప్లాట్‌ఫాం పై కింద పడిపోయాయి. అప్పటినుండి అధికారులు వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోలేదు. 2007లో ప్రాజెక్టు పాత స్పిల్‌వేలోని క్రస్ట్‌గేట్లను అధికారులు ఆపరేట్ చేస్తుండగా 1, 3 గేట్ల చైన్లు తెగిపోవడంతో ఈ సమస్య నెల కొంది. పాత స్పిల్‌వేలోని గేట్లను అధికారులు ఆపరేట్ చేయక పోతుండడంతో వీటితో ఎలాంటి ఇబ్బంది తలెత్తలేదు. అయితే భవిష్యత్తులో ప్రాజెక్టుకు భారీగా వరద వస్తే ఈ గేట్లను కూడా ఎత్తి నీటిని విడుదల చేస్తే ప్లాట్‌ఫాంపై ఉన్న ఈ కౌంటర్ వెయిట్లతో నీరు మన్నేరులోకి నేరుగా ప్రవహించే వీలు ఉండదు. నీటికి ప్లాట్ ఫాం దెబ్బతినే అవకాశం ఉంది. వీటిని తొల గించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శ్మశాస స్థలం ఆక్రమణలు తొలగించాలి

ఉలవపాడు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కరేడు పంచాయతీ పరిధిలోని రామకృష్ణాపురం ఎస్టీలకు చెందిన శ్మశాన స్థలంలో ఆక్రమణలు తొలగించాలని సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ఎస్టీలతో కలిసి సీపీఎం నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జీవీబీ కుమార్ మాట్లాడారు. గిరిజనులకు ప్రభుత్వం 2.89ఎకరాలు స్థలం కేటాయిస్తే దాన్ని కాలక్రమేణ కొద్దిమంది రైతులు ఆక్రమించుకొని జామాయిల్ సాగు చేయడం విచారకరం అన్నారు. ఈ విషయంపై పలుమార్లు పంచాయతీ, రెవెన్యూ అధికారులకు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. అధికారుల వైపునుంచి స్పందన కరువడంతో గిరిజనులకు న్యాయం చేయాలని తహసీల్దారు కార్యాలయం ముందు ధర్నా చేపట్టామన్నారు. ఈ మేరకు తహసీల్దారు లావణ్యవేణికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకురాలు పొన్నం రామలక్ష్మమ్మ, అంకమ్మరావు, వెంకటేశ్వర్లు, సుభాషిణి, భాస్కర్, జ్ఞానయ్య, రత్నకుమారి పాల్గొన్నారు.



తహసీల్దారు లావణ్యవేణికి వినతిపత్రం ఇస్తున్న రామకృష్ణాపురం వాసులు

తాగునీటి సరఫరా



ట్యాంకర్ వద్ద తాగునీటిని పట్టుకుంటున్న మహిళలు

అల్లూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పూర్తిస్థాయిలో వేసవి సమీపించక ముందే తాగు నీటి సమస్య వెంటాడుతోంది. మండలకేంద్రంలోని కొన్ని కాలనీల్లో తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో కెవిఆర్ ఫౌండేషన్ సభ్యులు ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం ఆర్‌డీఆర్ కాలనీ, క్రిస్టియన్ పేట, ఇస్కపల్లి రోడ్డు ప్రాంతాల్లో తాగునీటిని సరఫరా చేస్తున్నారు. నీటి సమస్య ఏర్పడితే వేసవిలో ఏర్పడే సమస్య ఎంత జఠిలంగా ఉంటుందో అని స్థానికులు చర్చించు కుంటున్నారు.

పెరిగిన కరెంటు బిల్లులను తగ్గించాలి

కందుకూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నివాసప్రాంతాల సమస్యలు పరిష్కరించాలని, పెరిగిన కరెంటు చార్జీలను తగ్గించాలని సీపీఎం నాయకులు సోమవారం సుందరయ్య నగర్, జనార్దన గిరిజన కాలనీల్లో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పెరిగిన కరెంటు బిల్లులను తగులబెట్టి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎస్కే. మల్లిక, ఎం.పద్మ, గౌస్, పవన్‌కుమార్, టీ.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

బిట్రగుంట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయతీ చెంచులక్ష్మీపురంలోని బిజ్జం వెంకారెడ్డి (70) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ కోటేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి స్థానికులతో విచారణ చేపట్టారు. ఈ నెల 4వ తేదీన వెంకారెడ్డి ఇంట్లోనే పనిచేస్తున్న పనిమనిషి శాంతమ్మ ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. వెంకారెడ్డి భార్య ఏడాది క్రితమే అనారోగ్యంతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. నెల్లూరులో వైద్యుడిగా పని చేస్తున్న ఆయన కుమారుడు పెద్దిరెడ్డి తండ్రి మృతి తెలుసుకుని గ్రామానికి వచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. పెద్దిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

సోమశిల నీటి విడుదలపై ఆగ్రహం

● ఏపీ రైతు సంఘం

జిల్లా నాయకులు బలిజేపల్లి

కావలి టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సోమశిల నీటిని సముద్రం పాలు చేస్తారా అని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు సోమవారం జిల్లా అధికారులను ప్రశ్నించారు. కావలి కాలువ పరిధిలోని గౌరవరం మేజర్ కాలువ 20రోజుల క్రితమే పంటలు కోతలు పూర్తియినా ఇప్పటికీ సోమశిల ఏఈ నీటిని విడుదల చేస్తున్నారని గడ్డి మోపులున్న పొలాల్లో నీటితో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. కొందరు రైతులు రెండవ పంటగా పత్తి సాగుకోసం ఏఈకి ముడుపులు ముట్టాయని అందువలనే ఆయన గౌరవరం మేజర్‌కు నీటిని విడుదల చేశారని ఆరోపించారు. ఉన్నతాధికారులు ఈ విషయంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సివిల్ కోర్టు కేసుల పరిధిపై సమీక్షించాలి

● ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి

కావలి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సివిల్ కోర్టులో కేసుల పరిధిపై సమీక్షించి జూనియర్ సివిల్ కోర్టులో కేసుల పరిధిని రూ.10లక్షలకు తగ్గించాలని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. ఈ విషయంపై సోమవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడారు. జూనియర్ సివిల్ కోర్టులో ప్రాం సరీనోట్లు, ఇతర డాక్యుమెంట్లు రూ.20లక్షల వరకు ఉన్నందున కేసుల సంఖ్య పెరిగి సత్వర న్యాయం జరుగటంలో ఆలస్యం అవుతోందన్నారు. ఆ దిశగా న్యాయశాఖ మంత్రి ఆలోచించాలని కోరారు.



సమస్యపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి

అర్హత ఉన్న ప్రతి గిరిజనుడికి రుణాలివ్వాలి

కావలి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ద్వారా గిరి జనులకు రుణాలు ఇవ్వక పోవటం అన్యాయం అని దళిత సంఘర్షణసమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి వాపోయారు. ఈ విషయంపై సోమవారం ఆయన సంఘం సభ్యులతో కలిసి స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి ఆర్డీవో ఎం. సన్నీవం శ్రీక్రిష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లి మాట్లాడారు. గతంలో ఎస్సీ, ఎస్టీలకు ఆయా కార్పొరేషన్లతో రుణాలు ఇచ్చేవారని పేర్కొన్నారు. 7ఏళ్లుగా ఆ నిధులు ఆగిపోవడంతో తండావాసులు ప్రయివేట్ బ్యాంకులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. అనంతరం జిల్లా యానాది సమాఖ్య అధ్యక్షురాలు బాపట్ల సత్యవతమ్మ మాట్లాడారు. నెల రోజుల్లోగా కార్పొరేషన్ రుణాలివ్వకపోతే యానాదులతో కలసి ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, జెడ్డా వాసు, చలంచర్ల మహేష్, కత్తి శేషమ్మ పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజన, దళితవర్గాలు

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ప్రారంభం

కావలి టౌన్, మార్చి10 (ఆంధ్రజ్యోతి): స్థానిక కచ్చేరిమిట్టలో వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ అధ్యక్షులు అన్నవరం సత్యనారాయణ పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు బుర్రా శేషాచార్యులు అర్చక బృందం బ్రహ్మోత్సవ పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అంకురార్పణ ధ్వజారోహణతో ప్రారంభమైన ఉత్సవాల్లో సోమవారం రాత్రి శ్రీవారు శేషవాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తజనం అడుగడునా గ్రామోత్సవానికి బ్రహ్మరథం పట్టి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు తిరివీది బ్రహ్మయ్య, తిరివీధి ప్రసాద్, అన్నవరం హనుమకుమార్ తదితరులు పాల్గొన్నారు.



శేషవాహనంపై విహరిస్తున్న శ్రీవారు

కోఆపరేటివ్ ఫిషర్‌మన్ సొసైటీ అధ్యక్షుడిగా యల్లంటి

కావలి,మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక హరిజనపాలెం కోఆపరేటివ్ ఫిషర్‌మన్ సొసైటీ అధ్యక్షుడిగా యల్లంటి వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఫిషర్‌మ్యాన్ సొసైటీ కార్యాలయంలో కో ఆపరేటివ్ ఫిషర్‌మ్యాన్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ఎన్నికలు జరిగాయి. మరలా కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి సహకారంతో అధ్యక్షుడిగా యల్లంటి వెంకటేశ్వర్లును మరోసారి ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మార్పుడి మాచర్ల, ప్రధాన కార్యదర్శిగా మొలతాటి మేమలత, డైరెక్టర్లుగా శెట్టిపల్లి మాల్యాద్రి, యల్లంటి వెంకయ్య, గండూరు తిరుపతి, జూటూరి భాస్కరరావు, మారువనూడి గోపాలరావు, కుందుర్తి శిరోమణిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మేడికొండ సుకుమార్, జ్యోతి బాబూరావు, సుదర్శన్ రమేష్, మనోహర్ పాల్గొన్నారు.



నియామక పత్రం అందుకుంటున్న యల్లంటి వెంకటేశ్వర్లు

అంగన్‌వాడీల హామీలు అమలు చేయాలి



ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కందుకూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తల హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రాజెక్టు గౌరవాధ్యక్షుడు ఎస్‌ఏ.గౌస్ మాట్లాడారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుండా, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఎం రాయుడు, ఆరుసెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌కు యువత దూరంగా ఉండాలి

ఉలవపాడు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): యువత సెల్‌ఫోన్ వినియోగం వలన చెడువైపే ఎక్కువగా నడుస్తున్నారని రామాయపట్నం మెరైన్ సీఐ శివన్నారాయణ అన్నారు. సోమవారం పెద్దపట్టపుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరగాళ్లు, సెల్‌ఫోన్ మంచిచెడులపై విషయ పరిజ్ఞానం, వాతా వరణం మార్పులు, తీరప్రాంత ప్రజలు అపరిచతులపై అవగాహన, సముద్ర ప్రయాణంలో తీసుకోవాలిస జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెరైన్ ఎస్ఐలు షరీఫ్, ఈశ్వరయ్య, సిబ్బంది, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెరైన్ సీఐ శివన్నారాయణ

యువత పోరు వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కావలి టౌన్, మార్చి10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఫీజు రీయింబ్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి డిమాండు చేశారు. సోమవారం ముసునూరులోని ఆయన నివాసం వద్దనున్న క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ వైసీపీ ప్రజాప్రతినిధులు, నేతలతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈనెల 12న వైసీపీ పార్టీ ఆధ్వర్యంలో నెల్లూరు వీఆర్‌సీ మైదానం వద్ద నుంచి కలెక్టరేట్ వరకు జరుగే కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డికి దమ్ముంటే కావలి అక్రమ లేఔట్లపై చర్యలు తీసుకోవాలని ప్రతాప్‌కుమార్ రెడ్డి సవాల్ విసిరారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరణలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి, తదితరులు

కుంచించుకుపోతున్న పెద్దపవని రోడ్డు

కావలి రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉదయగిరి రోడ్డు నుంచి పెద్దపవనికి వెళ్లే రోడ్డు కుచించుక పోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ మార్గంలో పోసిన మట్టి కుప్పలు, తాగి పడేసిన కొబ్బరి బొండాల గుట్టలు ప్రమాదాలకు నిలయంగా మారాయని చెబుతున్నారు. దీనికితోడు రెండుకిరువైపులా ఉన్న చెట్ల కొమ్మలు రోడ్డును కమ్మేస్తుండటంతో వాహనదారులు, ఆర్టీసీ బస్ డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పెద్దపవనికి వెళ్లే రోడ్డు

అసంపూర్తిగా అదనపు గదుల నిర్మాణం

వలేటివారిపాలెం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌కు వైసీపీ హయాంలో నాడు-నేడు రెండోవిడత కింద నాబార్డు నిధులు రూ.95లక్షలు మంజూరు అయ్యాయి. వీటితో 8అదనపు తరగతి గదులు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఏమైందో తెలియదు కానీ పిల్లర్ల దశలోనే పనులు నిలిచిపోయాయి. మూడేళ్లయినా పనులు ప్రారంభం కాలేదు. హైస్కూల్‌లో 325మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి సరిపడా గదులు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. అప్పట్లో ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతోనే ఈ పనులు అసంపూర్తిగా నిలిచిపోయినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాడు-నేడును తొలగించి మనబడి-మన భవిష్యత్‌గా పేరు మార్చింది. ఈ పథకంతోనైనా అసంపూర్తిగా ఉన్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పూర్తి చేయాలని స్కూల్ కమిటీ సభ్యులు కోరుతున్నారు.

సిమెంట్ లేక నిలిచిపోయాయి

\- శిరీషా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, వలేటివారిపాలెం

గత ప్రభుత్వం నిధులు విడుదల చేసి సిమెంట్ సరఫరా చేయకపోవడంతో ఆ నిధులను పక్క పాఠశాలలకు బదలాయించారు. మళ్లీ ఆ నిధులను అదనపు గదులు పనులకు విడుదల చేసే సరికి సిమెంట్ కొరత ఏర్పడింది. దీంతో పనులు నిలిచిపోయాయి.



పిల్లర్లకే పరిమితమైన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు

524 పాఠశాలల్లో కంటి పరీక్షలు

● 4,801 మంది విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ

● అంధత్వ నివారణ సంస్థ జిల్లా మేనేజర్ డాక్టర్ శార్వాణి

నెల్లూరు (వైద్యం), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 524 ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో కంటి పరీక్షలు నిర్వహించి, 4,801 మంది విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేసినట్లు అంధత్వ నివారణ సంస్థ జిల్లా మేనేజర్ డాక్టర్ శార్వాణి వివరించారు.



నెల్లూరులోని జీజీహెచ్‌లో గల జిల్లా అంధత్వ నివారణ సంస్థ కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. గత ఏడాది ఆగస్టు నుంచి డిసెంబరు వరకు ప్రభుత్వ పాఠశాలల్లో ఈ పరీక్షలు నిర్వహించామని చెప్పారు. ఆరు నుంచి 10వ తరగతి వరకు మొత్తం 1,05,520 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఇందులో 4,801 మందికి కంటిలో దోషాలు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. వెంటనే కంటి అద్దాలు కావాలని ఉన్నతాధికారులను కోరగా, పంపించారన్నారు. వీటిని జనవరి, ఫిబ్రవరిల్లో విద్యార్థులకు అందచేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందించటం వల్లే కళ్లద్దాల పంపిణీ త్వరగా చేపట్టామన్నారు. అంతేకాక నేత్రవ్యాధులకు విద్యార్థులకు అవగాహన కలిగించామని ఆమె వివరించారు.

కొండ బిట్రగుంటకు బస్సులు నడపాలి

నెల్లూరు(క్రైం), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నుంచి కొండ బిట్రగుంటకు ఈనెల 12,13,14 తేదీల్లో బస్సులు నడపాలని నగరానికి చెందిన బీ రవికుమార్ డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో కోరారు. నెల్లూరువన్ డిపో పరిధిలో సోమవారం ఆర్టీసీ ప్రధాన బస్టాండులో డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరిగింది. ఐదుగురు ఫోన్ చేసి వారి సమస్యలు, అవసరాలు తెలిపారు. సర్వోదయ కళాశాల వద్ద ఆర్టీసీ బస్సులు నిలపడం ద్వారా ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని, నిలపకుండా చర్యలు చేపట్టాలని నగరానికి చెందిన ఆనంద్ కోరారు. నెల్లూరు నుంచి పామూరుకు ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపాలని ఎన్. నరసింహారావు కోరారు. నెల్లూరు మెయిన్ బస్టాండులో దోమల బెడద అధికంగా ఉందని దినేష్ అనే ప్రయాణికుడు ఫిర్యాదు చేశారు. స్పందించిన డీఎం మురళీకృష్ణ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఆశలు

రాలుతున్నాయ్!

● మామిడిపూతపై చీడపీడల ప్రభావం ● రాలిపోతున్న పిందెలు

● వర్షం కోసం సాగుదారుల ఎదురుచూపులు

● వరుణుడు కరుణించకపోతే భారీ నష్టాలేనని ఆవేదన

ఉలవపాడు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసుక, ఎర్ర నేలల్లో మామిడి రైతులు సుమారు 5వేల ఎకరాల్లో మామిడి పంటలు సాగు చేశారు. ఈ సాగు లో పూతలు ఒక్కసారి కాకుండా విడతలవారీగా వచ్చాయి. డిసెంబరు, జనవరి మధ్య ముందు వచ్చిన పూతలు అడపాదడపా పిందెలుగా మారుతున్నా వెనకపడిన పూతలు పిందెలుగా మారకుండానే పూతకాడ దూషుడులు పడుతున్నాయి. రాత్రి, పగటి ఉష్ణోగ్రతల్లో మార్పు వలన తేనెమంచుతో పూతలు నల్లబారుతున్నాయి. దీనికితోడు త్రిప్స్ పూతలపై పెను ప్రభావం చూపుతుంది. పూతలు నింపుకోడానికే రైతులు కనీసం ఏడెనిమిదిసార్లు పురుగుమందులు పిచికారీ చేసినా నిలబడటం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలో కౌలు రైతులు ఎక్కువగా ఈ పంట సాగు చేస్తుంటారు. కౌలురేటు కంటే చీడపీడల నుంచి పూతలు, పిందెలు కాపాడుకోడానికి ఖర్చు ఎక్కువగా అవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముందు వచ్చిన పూతలు పిందెకడుతున్నాయి వెనకవచ్చిన పూతలు నిలబడం లేదని, భీమవరం, బద్దిపూడి, వీరేపల్లి, కృష్ణాపురం ఎర్ర నేలల్లో ఈ ఏడాది మామిడి పూతలు తక్కువైనా 20శాతం పూతలు నిలబడితే చాలని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

● వర్షం కోసం ఎదురుచూస్తున్న మామిడి రైతు

నిలబడిన పూతలైనా పిందెలుగా మారితే కొంతలోకొంతైనా కాపు చేతికి వస్తుందని రైతులు చెబుతున్నారు. ఒకవైపు మంచు మరొకవైపు అత్యధిక పగటి ఉష్ణోగ్రతలతో పూతపై త్రిప్స్ తీవ్ర ప్రభావం చూపుతోంది. మంచు ప్రభావంతో తేనెమంచు (నల్లతామర) బెడదతో ఆకులు, పూత, పిందెలు నల్లగామారి రాలిపోతున్నాయి. వీటన్నింటికీ ఉపసంహానం కలగాలంటే వర్షం పడితే చీడపీడలు ప్రభావం తగ్గి పిందెలకు, పూతకాడలకు బలం చేకూరుతుందని, తేమశాతం పెరుగుతుందని మామిడి రైతు చెబుతున్నారు.



కొమ్మలకు నిలబడక పూత రాలిపోవడంతో మిగిలిన కాడలు



చీడపీడలతో నల్లబారుతున్న మామిడి పూతలు

హిందువులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

● కలెక్టరేట్ వద్ద హిందూ చైతన్య వేదిక నేతల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న హిందూ చైతన్య వేదిక నాయకులు, కార్యకర్తలు

నెల్లూరు (హరనాథపురం) మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఈనెల 4న జరిగిన వీరభద్రస్వామి పారువేట ఉత్సవం సందర్భంగా, అన్య మతస్థులు హిందువులపై దాడి చేశారని, దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ హిందూ ఐక్యవేదిక నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దాడి చేసిన వారిని అదుపు చేయడంలో పోలీసులు విఫలమవడమే కాకుండా, పక్షపాత ధోరణితో హిందువులపైనే లాఠీచార్జీ చేశారని విమర్శించారు. ఉత్సవంపై అన్యమతస్థులు దాడిచేస్తే హిందువులను, హిందూ సంస్థలను బాధ్యులను చేస్తూ కేసులు పెట్టడాన్ని ఖండిస్తున్నామన్నారు. దేశభక్తి సంస్థలైన ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ పేర్లు పెట్టి మరీ కేసులు పెట్టడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వేదిక జిల్లా అధ్యక్షుడు ఉమామహేష్, కార్యదర్శి నాగశ్రీనివాసులు, ఇతర నాయకులు కాకు మురళీరెడ్డి, శశి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 21,946 మంది హాజరు

నెల్లూరు(విద్య), మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ పరీక్షల్లో భాగంగా సోమవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మ్యాథ్స్-2బీ, జువాలజీ-2, హిస్టరీ-2, ఒకేషనల్ పరీక్షలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 21,946 మంది హాజరయ్యారు. పరీక్షల ప్రారంభానికి ముందు ఆర్‌ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు జిల్లా పోలీసు కార్యాలయంలో సిబ్బందికి పలు సూచనలు చేసి ప్రశ్నపత్రాలను ఆయా కేంద్రాలకు పంపించారు. అనంతరం ఆయన ఆరు కేంద్రాలను పరిశీలించగా, డీవీఈవో ఒకటి, డీఈసీ మూడు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్ 24 కేంద్రాలను పరిశీలించాయి.

12 మంది అడ్మిన్లకు షోకాజు నోటీసులు

నెల్లూరు(సిటీ), మార్చి10,(ఆంధ్రజ్యోతి): నగరంలో ఆస్తి పన్ను వసూళ్లలో వెనకబడిన 12 సచివాలయాల అడ్మిన్లకు ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజ సోమవారం షోకాజు నోటీసులు జారీ చేశారు. రెవెన్యూ వసూళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం తోపాటు లక్ష్యాలు చేరుకోవడంలో ప్రతిభ చూపలేకపోతున్నారని ఆక్షేపించారు. దీంతో లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని కోరుతూ షోకాజు నోటీసులిచ్చారు. ప్రస్తుత పన్నుల్లో నూరుశాతం, బకాయిల్లో 75శాతం వసూళ్లు చేయడంలో ఈనెల 7న జీరో వసూళ్లు చూపారని, ఇందుకుగాను వివరణ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. కాగా బడ్వాడీపాళెం దగ్గర కొత్తగా ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను ఆయన సోమవారం రాత్రి పరిశీలించారు.

స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనకు

ప్రత్యేక కార్యాచరణ : కలెక్టర్



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం) మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనకు ప్రత్యేక కార్యాచరణతో పనిచేయాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో 12నెలలపాటు చేపట్టాల్సిన కార్యక్రమాలను ప్రకటించిందని చెప్పారు. ఈ మేరకు ప్రతి నెలా మూడో శనివారం జిల్లాలో ఆయా శాఖల పరిధిలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అన్ని శాఖల అధికారులు యాక్షన్ ప్లాన్‌ను ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈకు ముందుగానే అందించాలని ఆదేశించారు. కార్యక్రమాల అమలులో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జేసీ కే. కార్తీక్, డీఆర్‌వో ఉదయభాస్కర్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటరమణ, డీఆర్‌డీఏ, డ్వామా, హౌసింగ్ పీడీలు నాగరాజకుమారి, గంగాభవానీ, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ గంగాధర్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ చైతన్య, డీఈవో బాలాజీరావు, డీటీసీ చందర్, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, జిల్లా సర్వే అధికారి నాగశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారులకు భోజనం వడ్డిస్తున్న సిబ్బంది

● అర్జీదారులకు భోజనం

సోమవారం తిక్కనభవన్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లా నలుమూలల నుంచి వందలాది మంది అర్జీదారులు రావడంతో కలెక్టరేట్ కిటకిటలాడింది. 309 మంది తమ సమస్యలు పరిష్కరించాలని అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలు అందజేసేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చినవారికి మధ్యాహ్నం భోజన సౌకర్యం కల్పించారు. దీంతో అర్జీదారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

● అంబేడ్కర్ వర్సిటీని ఏర్పాటు చేయాలి

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీని రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని కోరుతూ విద్యార్థులు కలెక్టర్ ఆనంద్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ తెలంగాణా ప్రభుత్వం ఆ యూనివర్సిటీకి సంబంధించి అడ్మిషన్లను ఆపేసిందని తెలిపారు. దీంతో దూరవిద్యలో చదవాలనుకునే విద్యార్థులు నష్టపోయారన్నారు.

● లస్కర్లను నియమించాలి

పంట పొలాలకు నీళ్లు వదిలేందుకు లస్కర్లను నియమించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె.మాబు, నాయకులు దుంపల సుబ్బారావు, కమలాకర్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. 2023 - 24లో లస్కర్లు లేనందున 20 టీఎంసీల నీరు వృథా అయ్యాయని చెప్పారు.

నమ్మి మోసపోయాం.. ఆదుకోండి!

● ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎస్పీకి పలువురి వినతి

నెల్లూరు(క్రైం), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): 'నమ్మించి మోసం చేశారు.. మీరు తప్ప మాకు ఎవరూ లేరు... ఆదుకోండి సార్.. అంటూ ఎస్పీ జీ కృష్ణకాంత్‌ను పలువురు కోరారు. సోమవారం నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్‌లో జరిగిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో 73 మంది బాధితులు వచ్చి పోలీసు అధికారులకు వినతులు అందించారు.

● నగరంలోని వేదాయపాలెం పరిధిలో నివాసం ఉంటున్న వారి కంపెనీలో ఐటీ లావాదేవీలు చూస్తానని, తాను చార్టెడ్ అకౌంటెండ్‌ను అని కోవూరుకు చెందిన సురేష్ నమ్మించాడు. రూ.1.27 కోట్లు తీసుకొన్నాడని, ఐటీ కట్టలేదని జీఎస్టీ నుంచి నోటీసులు అందడంతో సురేష్ గురించి విచారిస్తే నిజం తెలిసి మోసపోయామని గ్రహించి భార్యభర్తలు వచ్చి న్యాయం చేయాలని ఎస్పీని కోరారు.

● తన పెద్ద కుమారుడు తన బాగోగులు చూసుకుంటానని నమ్మించి, ఆస్తిమొత్తం రాయించుకొని తనని చూసుకోకుండా ఇబ్బందులు పెడుతున్నాడని నగరంలోని సంతపేటకు చెందిన ఓ వృద్ధుడి వాపోయాడు.

● బోగోలు మండలం జువ్వలదిన్నెకి చెందిన వ్యక్తికి నెల్లూరుకు చెందిన డానియల్ ద్వారా ప్రమీల అనే మహిళ తిరుపతి గోశాలలో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి రూ.3 లక్షల నగదు తీసుకుంది. అయితే ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేశారని ఆ మహిళ ఫిర్యాదు చేసింది.

● నవాబుపేటకి చెందిన ఓ మహిళను బాలాజీనగర్ పరిధికి చెందిన శశిధర్, ఈశ్వరయ్యలు తన వ్యాపారానికి తోట్పాటును అందిస్తామని బ్యాంకులో లోన్ ఇప్పిస్తామని నమ్మించారు. ఆమె వద్ద అన్ని కాగితాలు తీసుకొని ఆమెకు తెలియకుండానే రూ.10 లక్షల లోను తీసుకొని మోసగించారు. వారిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు కోరారు.

● బుచ్చికి చెందిన ఒంటరి మహిళ వద్ద శ్రీధర్‌రెడ్డి, మోహన్‌లు రిజిస్ట్రేషన్ పత్రాన్ని ఫొటోలు తీసుకెళ్లి తనకే తెలియకుండా తన స్థలాన్ని అమ్మేశారని, విచారించి న్యాయం చేయాలని ఆ మహిళ కోరింది.



బాధితుడి సమస్య వింటున్న ఎస్పీ కృష్ణకాంత్

నాటి భోక్తల పాపం నేటి ఆదాయానికి శాపం

● 'డీఎంహెచ్‌వో' ప్రాంగణంలో పాత భవనాల కూల్చివేత

● నాడు రూ.30 లక్షల విలువైన కలప తరలింపు

● తెరవెనుక నాటి ఎమ్మెల్యే అనుచరులు

● నేడు రూ.1.67 లక్షలకే టెండర్లు

నెల్లూరు (వైద్యం), మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్య శాఖలో పాత భవనాల కూల్చివేతలో ఆ శాఖ తీవ్రంగా నష్టపోయే అవకాశం వచ్చింది. పాత భవనాల్లో ఇమిడివున్న రూ.30 లక్షల విలువైన టేకు కలపను గత ఏడాదే అక్రమంగా తరలించుకుపోయారు. ప్రస్తుతం కేవలం రూ.1.67 లక్షలకే టెండర్లు పిలిచి కాంట్రాక్టర్‌కు అప్పగించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే అనిల్‌కుమార్ అనుచరులు వైద్య ఆరోగ్య శాఖ వెనుక వైపు ఉన్న భవనాలను అక్రమంగా కూల్చి వేసి కలపను తరలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కేవలం సెలవురోజుల్లోనే ఈ అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. దీనిపై అప్పటి డీఎంహెచ్‌వో పెంచలయ్యపై కూడా విమర్శలు వచ్చాయి. దాదాపు రూ.30 లక్షల విలువైన రంగూన్ టేకు వంటి కలపను గుట్టుచప్పుడు కాకుండా తరలించినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఉద్యోగులు వ్యతిరేకించినా డీఎంహెచ్‌వో ఆగ్రహం వ్యక్తం చేయటంతో వారు మౌనం దాల్చినట్లు తెలుస్తోంది. అప్పట్లో ఆంధ్రజ్యోతిలో కథనాలు వెలువడటంతో ఆఖరిలో అక్రమాల తొలగింపు ఆగిపోయింది. లేదంటే పూర్తిగా పాత భవనాలను కూల్చివేసి విలువైన కలపను తరలించుకు పోయేవారన్న ఆరోపణలు వచ్చాయి. తాజాగా మంత్రి నారాయణ ఆదేశాలతో ఈ ఏడాది ఫిబ్రవరి 6న ఇందుకు టెండర్లు పిలిచారు. రూ.1.67 లక్షలకు టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఉన్న కొద్దిపాటి భవనాలను కూల్చివేసి కలపను సేకరిస్తున్నారు. భవనాల కూల్చివేతలో వస్తున్న రబ్బిస్‌ను వాహనాల ద్వారా తరలిస్తున్నారు.



డీఎంహెచ్‌వో కార్యాలయ ప్రాంగణంలోని పాత భవనాలను కూల్చివేస్తున్న ఎక్స్‌కవేటర్

● అప్పటి డీఎంహెచ్‌వో తీరుపై

గత ఏడాది జనవరిలో పాత భవనాల కూల్చివేతకు అధికారులు నిర్ణయించారు. ఏపీఎంఎస్‌ఐడీసీ ద్వారా ప్రతిపాదనలు తయారు చేయించాలని భావించారు. రూ.32 లక్షల అంచనాలతో పాత భవనాల కూల్చివేతకు టెండర్లు పిలవాల్సి ఉంది. అయితే, ఇవేమి లేకుండా అర్ధంతరంగా పాత భవనాలను కూల్చి వేయడం అనేక అనుమానాలకు తావిచ్చింది. అప్పటి ఎమ్మెల్యే అనిల్ ఒత్తిడితో టెండర్లు పిలవకుండా ఎలాంటి అనుమతులు లేకుండా వైసీపీ అనుచరులకు ఈ పనిని అప్పగించడం, పాతభవనాలను కూల్చి వేస్తున్నా అప్పటి డీఎంహెచ్‌వో మౌనం దాల్చారు. గతంలో డీఎంహెచ్‌వో కార్యాలయం ముందే వైద్యాధికారులు సొంత నిర్ణయం తీసుకుని 4 పాత భవనాల కూల్చివేశారు. ఇందులో ఉన్న కలపనూ బయటకు తరలించారన్న విమర్శలున్నాయి. దీనిపై నేటికీ అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. విచారణ కూడా చేపట్టక పోవటం అనుమానాలకు తావిస్తోంది.

చాలా తక్కువకే అప్పగించాం

గతంలో వైద్య ఆరోగ్య శాఖలో పాత భవనాలు చాలా ఉండేవని అధికారులు చెబుతున్నారు. రూ.32 లక్షలకుపైగా పాత భవనాల కూల్చివేతకు టెండర్లు పిలవాల్సి ఉంది. ఎందుకో అప్పట్లో అధికారులు టెండర్లు పిలవలేదు. అక్రమార్కులు ఈ పాత భవనాలను కూల్చి వేసి కలపను తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పాత భవనాలను తొలగించాలని మంత్రి నారాయణ ఆదేశించడంతో టెండర్లు పిలిచి చాలా తక్కువకే పనులు అప్పగించాము.

- డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో

డిగ్రీ పరీక్షలకు 387 మంది గైర్హాజరు

వెంకటాచలం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో సోమవారం జరిగిన డిగ్రీ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలలో 387 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన డిగ్రీ 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలకు 64 మంది విద్యార్థులకు 57 మంది హాజరు కాగా 7 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం జరిగిన డిగ్రీ 4వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 6,868 మంది విద్యార్థులకు 6,488 మంది హాజరు కాగా 380 మంది గైర్హాజరయ్యారు.

బీఈడీ పరీక్షల్లో నలుగురి డీబార్

వెంకటాచలం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో సోమవారం జరిగిన బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలలో నలుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షలలో 1,214 మంది విద్యార్థులకు 1,132 మంది హాజరు కాగా 82 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. కాగా తిరుపతి జిల్లా గూడూరులోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, నెల్లూరులోని వీఆర్ ఐపీఎస్ కళాశాలలో ఇద్దరు విద్యార్థులు డీబార్ అయినట్లు తెలిపారు.

బాగు చేస్తే బకింగే

● ఆక్రమణలతో కుంచించుకుపోయిన బకింగ్‌హామ్ కెనాల్

● బ్రిటీష్ హయాంలో కొనసాగిన జల రవాణా

● అభివృద్ధి చేస్తే తీరప్రాంతవాసులకు ప్రయోజనం

● కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలి

ఇందుకూరుపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : తెలుగునాట జల రవాణా అంటే ముందుగా గుర్తొచ్చేది బకింగ్ హామ్ కెనాల్. దేశంలో రోడ్డు రవాణా వ్యవస్థ అంతగా లేనప్పుడు జలమార్గం ప్రధానంగా ఉండేది. బ్రిటీష్ కాలం నుంచి తీర ప్రాంతంలో కాకినాడ నుంచి తమిళనాడు రాష్ట్రంలోని పుదుచ్చేరి వరకు ఈ కెనాల్ ద్వారా జలరవాణా జరుగుతుండేది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 12 తీర ప్రాంత మండలాలను తాకుతూ 165 కి.మీ. పొడవున ఈ కెనాల్ విస్తరించి ఉంది. అప్పట్లో కలప, ఆయిల్స్ ఇతరత్రా వస్తువులు ఈ మార్గం నుంచి రవాణా జరుగుతుండేవి. స్వాతంత్ర్యం వచ్చాక రోడ్డు రవాణాకు ఇచ్చిన ప్రాధాన్యతను పాలకులు జల మార్గానికి ఇవ్వకపోవడంతో క్రమంగా ఈ కెనాల్‌లో రవాణా నిలిచిపోయింది. సుమారు 70ఏళ్లుగా ఈ కాలువను పట్టించుకోకపోవడంతో ఆక్రమణల చెరలో చిక్కుకుంది. జాతీయ జలమార్గాల చట్టం 2016 ప్రకారం దేశంలో ఇలాంటి 111 మార్గాలను గుర్తించారు. ఇందులో ఇన్‌లాండ్ వేజల్స్‌వే 4గా బకింగ్‌హామ్ కెనాల్‌ను పేర్కొన్నారు.

బ్రిటీష్‌కాలంలో ఈ కాలువ వెడల్పు 32 మీటర్లు కాగా, నేడు 10మీటర్లు కూడా లేదు. దీన్ని వినియోగంలోకి తెచ్చి కొత్త పోర్టులతో సముద్ర మార్గానికి అనుబంధంగా అంతర్గత జల రవాణాన్ని అందుబాటులోకి తీసుకురాగలిగే జలరవాణాకు జీవం పోసినట్టే. 1880 నుంచి 1950 వరకు తక్కువ ఖర్చుతో సరుకు రవాణా చేయడానికి ఈ జలమార్గం ఎంతో ఉపయోగపడింది. ఒకానొక సమయంలో రోజుకు కోటి టన్నుల బరువైన సరుకులను ఈ కాలువ ద్వారా రవాణా చేశారంటే ఆశ్చర్యం కలగమానదు. అంతేకాక శ్రీహరికోట నుంచి చెన్నైకి అవసరమైన వంట చెరుకును ఈ కాలువ ద్వారానే భారీగా ఎగుమతి చేసేవారు. సరుకు రవాణా సమయంలో అవసరమైనప్పుడు విశ్రాంతి తీసుకోవడానికి కాలువ ఒడ్డున మద్రాసు నుంచి కాకినాడ వరకు 50 పైగా ట్రావెలర్స్ బంగ్లాలను నిర్మించారు. ఈ కెనాల్ భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థను కూడా ఏర్పాటు చేసింది. తీరం పొడవున దాదాపు 150 మందికిపైగా ఇన్‌స్పెక్టర్లను కాలువ ప్రవాహ వేగాన్ని సమీక్షిస్తూ.. ప్రతిరోజు బ్రిటీష్ ప్రభుత్వానికి నివేదికలు అందించేవారు. కాలువ మధ్యలో గేట్ల దగ్గర మరికొంతమంది సిబ్బంది విధుల్లో ఉండేవారు. కాలువ వినియోగం తగ్గాక ఆ సిబ్బందిని నీటిపారుదల శాఖలో విలీనం చేశారు. తాము చిన్నతనంలో తెరచాప పడవల ద్వారా ఆ కాలువలో సరుకులు తరలించడం చూశామని మండలవాసులు చెబుతుంటారు.



గుర్రపు డెక్క తుంగతో నిండిన బకింగ్‌హాం కెనాల్

● ఆశలన్నీ 'ప్రశాంతమ్మ'పైనే...

కొత్త చట్టం ప్రకారం బకింగ్‌హామ్ కెనాల్ పునరుద్ధరణ జరిగితే రాష్ట్రానికి చాలా మేలు జరిగి పారిశ్రామిక పురోగతికి తోడ్పడుతుంది. అయితే అందుకు పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి ఉంది. ఇప్పటికే కేంద్రం పలుమార్లు పరిశీలనలు చేసింది. కొన్ని ప్రతిపాదనలు కూడా వచ్చాయి. ఎంతమంది ఎమ్మెల్యేలు మారినా ఈ కెనాల్ పునరుద్ధరణకు కృషి చేసిన ఎమ్మెల్యేలు ఎవరూ లేరు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో కెనాల్ పునరుద్ధరణపై కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తన వాణి వినిపిస్తారని ఆశిద్దాం.



రోడ్డుపై మురికినీరు

● కాలనీవాసుల అవస్థలు

వింజమూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీచర్స్ కాలనీలో మురికినీరు పోయే దారిలేక రోడ్డుమీదికి వదిలిపెట్టడంతో దుర్గంధం వెదజల్లుతూ దోమలు స్వైర విహారం చేస్తున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ నడిబొడ్డున ఉన్న కాలనీలో మురికి కాలువల్లేక రోడ్డు మీదకి మురికినీరు చేరడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై మురికినీరు నిలవకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	92
లేయర్ లైవ్	90
స్కిన్ చికెన్	170
స్కిన్‌లెస్	190
లేయర్	153

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8295
వెండి కిలో ధర	రూ. 1,00,100
వెండి ఒక గ్రాము	రూ. 103.10